UNIVERSAL
LIBRARY
OU_204271
UNIVERSAL
LIBRARY

OUP—552—7-7-66—10,000

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T83·1/301BP.1 Accession No. T2501

Author

Title శ్రీభాసనాటకకథలు

This book should be returned on or before the date last marked below.

శ్రీ

# భాసనాటకకథలు

ఇది

సంస్కృతకవిజీవితోత్తరరామ చరితాంధ్రభాషానుశాసనాంధ్ర దశరూప
కాది కృతికర్తలును,

రాజమహేంద్రవర రాజకీయకలాశాలాంధ్రపండితులు నగు


మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారిచే


రచియింపఁబడి


పిఠాపురనివాసులు

చల్లా జగన్నాథము బి. ఏ. యల్. టి గారిచే

ప్రకటింపఁబడియె.

రాజమహేంద్రవరము.

రెండవకూర్పు

అద్దేపల్లి లక్ష్మణస్వామినాయఁడు గారిచే

సరస్వతీ పవర్ ప్రెస్‌నందు ముద్రితము 2501—1500

రాజమహేంద్రవరము.

1928



కాపీరైటు రిజర్వుడు]


[వెల 0—12—0.

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 10 | 3 | రిపతపిం | పరితపిం |
| 68-69 | ... | గాఁగలించి | గాఁగిలించి |
| 80 | 21 | క్రొంగీ | క్రొంగే |
| 106 | 5 | రధము | రథము |
| 147 | 1 | వీధి | వీథి |
| 160 | 22 | ములనుఁగూ | ములనుగూ |

# పీఠిక

ప్రాచీనసంస్కృత మహాకవులలో నొకఁడును, కాళిదాసాదికవీంద్రుల ప్రాశస్త్య కెక్కినవాఁడు నగుభాసమహాకవి యనేకనాటకములను రచియించి నట్లుగా భట్టబాణుఁడు మున్నగు కవితల్లజుల ప్రశంసవలనఁ దెలియుటయే కాక, రాజశేఖరుని కవివిమర్శనమువలన నీతని కొన్ని కొన్ని రూపకముల నామములు గూడ లోకమునకుఁ దెలియవచ్చినవి. కాని క్రీస్తుపూర్వము మొదటిశతాబ్దములోనివై రూపకప్రపంచమున కాద్యము లనఁ దగిన యీతని రూపకములు కాలకర్మవశమునఁ జిరకాలము ప్రచ్ఛన్నములై పడి యుండియుండి తుదకు దైవవశమున ననంతశయనమహారాజదృష్టిపథమునఁ బడి మొన్న మొన్ననే తల యెత్తి విబుధలోకమును దృశ్యకావ్యామృతరసాస్వాదనమున నానందపెట్ట నంత్యము లయిన వనుట విచారకరమే యైనను, విచిత్రకల్పనము వివిధలోకవిజ్ఞాననిధానము సరసకథాసన్నివేశము మృదుమధురశైలీనిబద్ధమునై చూపఱకుం జదువరులకుం గూడఁ దన్మయత్వము గలిగించు నీతని నాటకచక్ర మిప్పటికైన సజీవమై విద్వల్లోకము కంటఁబడెను గదా యనియే యానందింపవలసి వచ్చినది.

ఇపు డనంతశయనపురమున నీతనిపేర వెలసిన యపూర్వరూపకములలో నొక్కటి స్వప్నవాసవదత్త దక్కఁదక్కినవి యీమహాకవికృతులుగా రాజశేఖరాదులు పేర్కొనినవానిలోఁ గనఁబడకున్న వనెడితలంపుతోఁ గొందఱీతనిపేర నున్న రామాయణభారతకథారూపకముల కర్తృత్వమును గూర్చి చర్చించుచున్నట్లు తెలియుచున్నది. ఇపు డాప్రసంగమంతయు సహేతుకముగాఁ జర్చించి వ్రాయుట కిది యదనుగాదుగాని, స్వప్నవాసదత్త యీతని దనెడి నిశ్చయముతోఁ బలువిధముల దీనితో సంబంధించి యున్నట్లు కనఁబడుచున్న ప్రతిజ్ఞాయౌగంధరాయణము తప్పక యీతనిదే

యని నిశ్చయించియు, నీరెంటి శైలికిని వీనియందలి కల్పనాదులకు నిసుమంతయుఁ దీసిపోక వీనితోఁ బోలఁ దూఁగుచున్న 'అవిమారకము, ప్రతిమ, అభిషేకము, చారుదత్తము' అనునవి గూడ భాసుఁడే రచియించియుండునని విశ్వసించియు, ముందుగా నీయాఱురూపకములకథలను, ఇప్పటి యాంగ్లకళాపాఠశాలల విద్యార్థుల కుపయోగించు సులభశైలిని దెలుఁగు వచనముగా రచియించితిని. భాసమహాకవి కల్పనాచాతుర్యముతో నీ కథల మాధుర్యమును జనవరులే గ్రహింతురుగాక.

ఇది పాఠశాలలలోఁ బఠనీయగ్రంథముగా 22-12-1925 తేది గెజటులో దొరతనమువారిచేఁ బ్రకటింపఁబడినది. ఇంతకు మున్ననేకపాఠశాలలలో నిది యుపయోగింపఁబడుచున్నది. విద్యాభిమానులును, పాఠశాలాధికారులును మునుపటివలెనే దీని నాదరింతురుగాక.

మల్లాది సూర్యనారాయణశాస్త్రి.

నుంచి యేనుఁగుల వేఁటకుఁ దగినబలమును మాత్రము వెంటఁ బెట్టికొని నాగవనమునకు బయలుదేఱె. కొంత ప్రొద్దెక్కు-నప్పటికిఁ గతిపయయోజనపరిమితం బయినయాదూరమును గడచిపోవునంత ఱాళ్ళతోఁ జేయఁబడినట్లుగాఁ జూచుటకు వెఱపు గొలుపుగజయూథ మొండు గాననయ్యె. దానిఁజూచి మనసేన యిది యేమి యని యాలోచించుచుండ, నయ్యూథము మమ్ముఁ జూచి శంకాకులం బగుచుండ, నియ్యనర్థమునకు మూలమైన యొకకాలిబంటు మన రాజుదగ్గఱకు వచ్చె. వానికిఁ దగినపసదనం బిచ్చి గౌరవించి మనప్రభువు మాతోఁ 'నిందు హస్తిశిక్షలోఁ జెప్పఁబడిన నీలకువలయతను వనుగజేంద్రము గలదు. మీ రీకరిసముదాయంబునెడ నప్రమత్తులరై యుండుఁడు. వీణాద్వితీయుండనై నేనేగి యాకరీంద్రమును దీసికొనివచ్చెద' నని పలికెను. ఆమాట విని యమాత్యరుమణ్వంతుఁ 'డయ్యా! నీ వైరావణాదిదిగ్గజములనుగూడఁ బట్టఁ గలవాఁడ వనుట నిక్కము. కాని, సామాన్యముగా నిట్టిస్థలములానన్న దోషములై యుండును. ఇందు నివసించుజనమును గులహీనంబు నిర్లజ్జము నగును. కావున నీ వొక్కఁడవు పోఁ జనదు. మన మందఱము గూడి యేగుటయే యుత్తమ' మని బోధించె. అంత రాజు 'నాతో' డని యొట్టు వెట్టి రుమణ్వంతుని నివారించి నీలవలాహకం బనెడి తనయెక్కిన యేనుంగును డిగ్గి సుందరపాటలం బను గుఱ్ఱము నెక్కి యిరువదిమంది కాల్బంటులను మాత్రము కూడఁ దీసికొని యింకను బ్రొద్దు

నెత్తిమీఁదికి రాకమున్నే పయన మయ్యె. అట్లు చనఁగా నొకమద్దిచెట్టునీడను దంతధవళకాంతిచే నొడ లెల్లఁ దెల్లవడ మేని నంటకయుండిన ట్లున్న నాలుగుదంతములతోడి యా నీలవారణము దృగ్గోచర మయ్యె. అంత నొడయఁడు తురగము డిగ్గి యిష్టదేవతలను స్మరించి వీణను జేతఁ బట్టఁ గానే యొక కంఠీరవము కంటఁబడెను. దానిజాడ దెలిసికొన మే మందఱము తొందరపడుచుండ నాయుధీయు లధిష్ఠించిన యామాయసింధుర మెదురు వచ్చుచుండె. దానిని జూచి రాజు పేరుపేరువరుసన మమ్ముఁ బిలిచి యూఱడించి 'యిది యంతయుఁ బ్రద్యోతునికపటప్రయోగముగాఁ గన్పట్టుచున్నది. మీ రెల్లరు నన్ననుసరించి యుండుఁడు. నే నీశత్రువిషమారంభమును బరాక్రమమునఁ జక్కఁజేసెదను.' అనిపలుకుచుఁ బరబలముపైఁ బడెను. మానవంతులకు వంచన సంభవించి నపుడు చేయఁదగినపని యంతకన్న నే మున్నది? అట్లు పరాక్రమించి యిష్టము వచ్చినట్లు నడచుచున్నసుందరపాటలము మూలముగా ననుకొన్నదానికంటె నధికముగానే శత్రుబలమును బ్రహరించుచు నది మిక్కిలి హెచ్చుగా నుండి కడు విజృంభించి పోరు సలుపుటచే లెక్కకున్నమనభటులు పడి పోఁగా, దెబ్బలు తిని గుట్టు మలసిపోఁగా, మధ్యాహ్నయుద్ధమగుటచే మిగులఁ బరిశ్రాంతుఁడై నే నొక్కఁడనుమాత్రమె మెట్లో వెంటనంటిచూచుచుండ, మట్టమధ్యాహ్నసమయమున మనమహీశుఁడు మూర్ఛవడెను. వెంటనే కొందఱు దుర్మార్గులు దగ్గఱ

నున్న గట్టికఱకుఁదీఁగలు పెఱికికొని వచ్చి బుజములు గట్టి వేసిరి. అకటా! యేమి చెప్పుదును? సకలవసుధాభారంబు వహించినవియుఁ బరమహీపతులగర్వ మణంచినవియు సదాచారపరాయణుల సత్కరించినవియు సన్మిత్రులఁ గౌఁగిలించినవియు నగు తేనిబాహువులవలయస్థానంబున బంధనంబు సంభవించుట చూచుచు నేను జీవంబుతో నుంటిని. అట్లు కట్టువడి తిరిగి తెలివి చెందునంత 'నితఁడే నాయన్నను జంపె వీఁడే నాతండ్రిని గొట్టె నీతఁడే నాసుతుని బొడిచె' నంచుఁ గొందఱు పరభటులు పరుగులెత్తుచు వచ్చిరి. వారిలో నొకఁడు జుట్టు విరియఁ బోసికొని మహాకోపముతోఁ గత్తిఁ జేతఁ బట్టి మననరనాథుని జంప నుద్యుక్తుఁడై పరుగెత్తి వచ్చుచు దైవప్రాతికూల్యంబున నెత్తుటికాలువలోఁ గాలు జాఱి గుబేలున నేలఁ గూలెను. మగధేశునిచే సధర్మముగఁ బాలింపఁబడుచున్న భూదేవి యధర్మసంగ్రామమును జూచి యోర్వఁజాలక యానృశంసుని గూల్చెనో యనునట్లుగా నప్పాపాత్ముఁడు పడిపోయెను గాని లేకున్న వాఁడు వచ్చినరాకకు నపు డేమిజరిగియుండునో యింతకు మన మే మయియుందుమో నేను జెప్పఁజాలను. అంతలో మనతేనియాఁటుపోటు తిని మోహపడి మరలఁ దెలి వొందినసాలంకాయనుఁ డను ప్రద్యోతమంత్రి 'వలదు సాహసము వల' దనుచు వారించి యచ్చటికి వచ్చి మనవిభునకు మ్రొక్కి కట్లు విడిపించి యాదరించి దెబ్బలు తిని యుండుటచే గుఱ్ఱము నెక్కి వచ్చుట తగ

దని యాలోచించి బంధశయనమున నెక్కించి మనపాలకు నుజ్జయినికిఁ గొనిపోయె. ఆ సమయమున రక్షకునితో నేనును బోవ సిద్ధపడితినిగాని సాలంకాయనుఁడు 'నీవు రావలదు. కౌశాంబికిఁ బోయి యీవృత్తాంతము మీరాజమంత్రుల కెఱిఁగింపు' మనుచు నన్నడ్డగించె. అప్పుడు నేను నా పాలకునకుఁ బ్రదక్షిణముగావించి నమస్కరింప నతఁడు "హంసకా! యౌగంధరాయణుని సందర్శింపు" మని యొక్కమాట మాత్రము నుడివె. అది విని రాజదుఃఖదుఃఖిత హృదయుండనై యెప్పుడు నిన్నుదర్శింతు నని మహావేగంబున నిందుల కరుదెంచితిని.''

ఇట్లు హంసకునివలన వత్సరాజవృత్తాంత మంతయువినిన యౌగంధరాయణుఁడు "కటకటా! సాలంకాయనుఁడు మన రాజు నుజ్జయినికిఁ గొంపోవుట మహానర్థము. ప్రద్యోతుఁడు మనస్వి యగుటచే స్వామికిఁ గష్టము తప్పదు" అని యాలోచించుచుండ, రాజమాతయొద్దనుండి వచ్చినప్రతీహారి యమాత్యునకు నమస్కరించి "అయ్యా! తల్లిగారికిఁ జెప్పఁదగిన దేమి?" యని యడిగెను. మంత్రియుఁ గొంతవడి చింతించి యెట్లయినఁ జెప్పక తప్ప దని తలఁచి యుదయనునకు వచ్చిన కష్టదశను దానిచెవిలోఁ జెప్పి, యీవార్త ముందుగానే యామెకుఁ జెప్పకు. మాతృహృదయము స్నేహదుర్బలమయినది. కావునఁ దొలుత యుద్ధసంబంధ మయినదోషములను దెలిపి పిదప సేన తక్కువగా నుండుట చెప్పి యనంతరము గెలుపు సందిగ్ధ మగుట నుడివి యంత విచారము హెచ్చుచున్న

పుడు రాజు పట్టుపడినమాట మెల్లఁగాఁ జెప్పు మనుచు బోధించి దానిని బంపెను. అదియు వెడలినతోడనే యంతిపురమునుండి స్త్రీలయార్తనాదము వినవచ్చె. దాని నాలకించి యిది మంత్రులయసామర్థ్యమును వివరించుచున్న దనుకొనుచుండ, మరలఁ బ్రతీహారి వచ్చి "ఆర్యా! యేబుద్ధిశాలి కష్టముల విషాదము చెందఁడో వంచితుఁ డయ్యు నిర్వేదము గాంచఁడో యట్టి నాపుత్రునిమిత్రుఁడు నమాత్యుఁడు నయిననాపుత్రకుఁడు నాపుత్రుని బంధనమునుండి విడిపించి తీసికొని వచ్చుఁ గాక యని రాజమాత నీతోఁ జెప్పుమన్న" దని విన్నవింప నతఁడు నాపూజ్యురాలి ధీరవాక్యమును శిరసావహించి యా ప్రతీహారిచే నీరు దెప్పించి యాచమనము చేసి "రాహుగ్రస్తుఁ డయినరాజుమాడ్కి శత్రుగ్రస్తుఁడై యున్న వత్సరాజును విడిపింపకున్న నేను యౌగంధరాయణుఁడను గాను" అనుచుఁ బ్రతిజ్ఞ పట్టె. దాని విని ప్రతీహారి వెళ్ళినంత, నిర్ముండకుఁ డనుపరిచారకుఁడు వచ్చి "ఆర్యా! రాజుగారికష్టము శాంతించుటకై జరుగుచున్న బ్రాహ్మణసంతర్పణమును జూడవచ్చి వెఱ్ఱివేషముతోనున్నయొకవిప్రుఁడు నవ్వుచు "మీరు సుఖముగాఁ దినుఁడు తినుఁడు. రాజున కభ్యుదయము గలుగఁ గల" దనుచుఁ బలుకుచు సంతర్పితుఁ డయ్యె నని విన్నవించె. అంతలోనే యొకభూసురుఁడు "ప్రయోజనవిశేషాపేక్షచే వేషాంతరమును దాల్చినద్వైపాయనుఁడు వచ్చె" ననుచు మంత్రిసన్నిధి కరుగు

దేర, నతఁ డాతనిఁ గాంచి నమస్కరించి తనలో "నాహా! యీసాధువు నా కీయున్మత్తవేషము నుపదేశింప వచ్చియుండును. నే నిట్టివేషము ధరించి తప్పక రాజును విడిపింపఁగలనని తలంచి "మహాత్మా! శాంతిగృహమున మరల దర్శన మిమ్మని" యాబ్రాహ్మణునకు సెలవిచ్చె. అంత వెండియు బ్రతీహారి వచ్చి, అమ్మగారు మంత్రివర్యునిఁ జూడఁ గోరుచున్నారని పలుక, యౌగంధరాయణుఁడు హంసకాదులకు సెలవిచ్చి

గీ. కఱ్ఱ రాపాడ రాపాడఁ గలుగు నిప్పు
ఫుడమి త్రవ్వంగఁ ద్రవ్వంగఁ బొడము నీరు
ధర నసాధ్యంబు లేదు సోత్సాహమతుల
కన్ని పనులు ఫలించుఁ దీక్షై సత్రోవ.

అని తలఁచికొనుచుఁ బ్రతీహారి ముందు నడవ రాజమాత దర్శనంబున కరిగె.

ఈప్రసంగ మిట్లుండ నుజ్జయినిలోఁ బ్రద్యోతుఁ డొకనాఁడు సపరివారుఁడై కొలువుదీర్చి యున్నసమయమున బాదరాయణుఁ డనుకాంచుకీయుఁడు తనలో—నిచ్చలు మంచిరాచకులమునుండి కన్యార్థులై దూతలు వచ్చుచునే యున్నారు. కాని, మారా జెవ్వరికిని మాట యీయకున్నాఁడు. దీనికిఁ గారణ మేమో తెలియదు. రాజపుత్త్రిలగుణము లెఱిఁగి యుండియు నితఁ డిట్లుపేక్ష చేయుట దైవమే యీకన్యాప్రదానంబున కధికారి యనితోఁచుచున్నది-అని తలఁచికొనుచు

తేనిని సమీపించి 'మహాసేనా! జయము జయము. దేవర యానతిచే దూతగా వచ్చిన కాశిరాజోపాధ్యాయుఁడగు నార్యజైవంతికి దూతోచితసత్కారము గావింపఁబడిన'దని పలికె. దానికి మహాసేనుఁడు సంతసించి, విశేష మేమని యడుగఁ, బాదరాయణుఁడు 'దేవా! మఱి యేమియును లేదు. ప్రతి దినము రాజకులములనుండి కన్యార్థులై దూతలు వచ్చు టయే కాని నీ వొకనివిషయంబునఁగూడ ననుగ్రహించినట్లు గానవచ్చుటలేదే యని వితర్కించుచున్నాఁడ. దేవరయాశయ మే'మని ప్రశ్నించె. అందుకు రాజు 'నిజమే. వరగుణముల యందలి యతిలోభమును వాసవదత్తయందలి యతిస్నేహ మును నానిశ్చయమును గుదుర నీకున్నవి. కన్య యానందిం చుటకుఁ దగినవరగుణసంపత్తి నరయుట తండ్రిపని. తరువాతఁ గన్నె భాగ్యము! అయినను గూఁతుల నిచ్చునెడఁ దల్లులు దుఃఖ శీల లగుట సహజము. కావున, దేవిని బిలిచికొనిరమ్ము' అని యానతీయ, నతఁడు వెడలె. రాజును వత్సరాజగ్రహణాం బున కేగినసాలంకాయనుఁ డింకను రామికిఁ గతం బేమని శంకించికొనుచుండ, సపరివారయై యంగారవతి వచ్చి తదాజ్ఞ వడసి కూరుచుండె. అంత రాజు "వాసవదత్త యెక్కడ నున్న దని యడుగ వైతాళిదగ్గఱ వీణావాద్యము నేర్చికొనుచున్న దనెను. దానిపై నతఁ డిది బాల్యమునఁ దగినదియే యన, నాపె సరియేకాని, మంచిగురువు నెవని నైన నేర్పఱుప నాకో రిక యనెను. "వివాహసమయము ముతటస్థించినదానికిపుడు గురు

వేల? భర్తయే గురువు గాఁగలఁ'' డని రాజు పలుక, నపుడే పెండ్లియీడు వచ్చెనా యని యామె యించుక సంకోచించె. నిత్యము దానిపెండ్లికిఁ దొందరపడుదాన విప్పుడు పరితపించెద వేల యని యాతఁ డనఁ, బరిణయము గావించుట నాకిష్టమే కాని దానిని విడువవలసివచ్చు నని వగచుచున్నదాన. కాని, యెవని కీయఁదలంచితిరో చెప్పుఁడని యాదేవి యడిగె. అంత నతఁడు, ఇంకను నిశ్చయింపఁబడలేదు. తనయకుఁ బెండ్లి కాకున్నంతకాలము మనపిల్లకు వివాహమే కుదురలేదని సిగ్గు. పెండ్లి యైనచో నెడఁబాటు గలుగునని మనోవేదన. ఇట్లే ధర్మస్నేహములనడుమ దుఃఖితలై దుహితలు గలతల్లులుయ్యెల లూఁగుచుందురు. మనపిల్ల యిప్పుడత్తమామల పరిచర్యకుఁ దగిన వయసున నున్నమాట నిక్కము. కాశిరాజోపాధ్యాయుఁ డిప్పుడే దూతయై వచ్చియున్నాఁడు. ఇంకను వంగసౌరాష్ట్రమిథిలాశూరసేన దేశాధిపతులయొద్దనుండియు దూతలు వచ్చియున్నారు. వీరిలో నెవని కీయఁదగునో నీవే నిశ్చయింపు''మనెను. అందు కాసతి, యెవని కిచ్చిన సంతాపము గలుగదో యతని కిమ్మని పలుకునంతఁ గాంచుకీయుఁడు లేచి "వత్సరాజు" అనెను. అందుకు రాజు "వత్సరాజా!" యన నతఁడు దేవా! అనుగ్రహింపుము. మంచిమాట చెప్పఁ దలఁచి తొందరచేఁ గ్రమము తప్పితిని. మంత్రిసాలంకాయనుఁడు వత్సరాజును బట్టి తోడ్కొనివచ్చె"నని పలికె. అందుకు మహాసేనుఁడు సంతుష్టాంతరంగుఁడై "యౌగంధరాయణుఁడు జీవించియుండ నిక్కా

ర్యము శక్యమయ్యెనా? వత్సరాజును బట్టుట యన మందరం బును జేతులలోఁజుట్టపెట్టుటయే. ఈమాట సమ్మఁదగునా? యని సంకోచింప, బాదరాయణుఁడు, సత్యము స్వామీ! పెద్ద వాఁడను ప్రభువునొద్ద నసృతమాడుదునా? యనెను. అంత రాజు ‟అట్లయినచో నే నిపుడు మహాసేనుఁడనయితిని, నీవు పోయి సత్కారపూర్వకముగా వత్సరాజును ముందుంచుకొని సాలంకాయను నిచ్చుటకై గమ్మనిచెప్పుము. అతనిఁ దీసికొని వచ్చునపుడు మార్గమున నెవ్వరని దొలఁగుఁ డని నిషేధింప వలదు. యజ్ఞమునకై కట్టి తేఁబడిన సింహము మాడ్కిఁ బౌరు లందఱు యథేష్టముగా వత్సరాజును జూచెదరుగాక” యని సెల వీయ, నతఁడు వెడలె. పిదప దేవి ‟ఆర్యపుత్రా! పెక్కండ్రు మనసంబంధము గోరుచున్నారుగదా? ఈతఁ డెపుడయిన దూతను బంపెనా?” యని యడుగ, రాజు ‟అయ్యో! ఇతఁడు మహాసేనశబ్దమునే గణింపఁడు. ఇఁక సం బంధమును స్మరించునా? ఎంతమాట? వత్సరాజు తనది భార తవంశ మని గర్వించును. తనకు గాంధర్వవేదము వచ్చునని దర్పించును. ప్రజలు తన్నుఁ బ్రేమింతు రని విజృంభించును. రూపయౌవనముల నసమానుఁడ నని మదించును. ఇట్టివాఁడు మనపిల్లను గోరునా?” యనెను. అంతలోఁ గాంచుకీయుఁడు వచ్చి ‟స్వామీ! నీయానతిచొప్పున మంత్రివర్యుఁడు వచ్చుచు ముందుగా వత్సరాజుగారియీవీణారత్నమును నీ కిమ్మని యిచ్చె” నని ఘోషవతిని సమర్పింప, దాని నంది

కొని "దేవీ! యీవిపంచిక యసామాన్య మయినది. మునీంద్రవచోగతమయిన మంత్రవిద్యవలెనే యిది గజహృదయమును వశపఱుపఁగలదు. దీనిని మనవాసవదత్త కిమ్మని యిచ్చెను. అంత బాదరాయణుఁడు దేవా! దెబ్బలచేఁ గాలుసేతులు నలఁగియుండుటచే వ్రణవైద్యము చేసి వత్సరాజును బల్లకిలోఁ బరుండఁబెట్టి మోసికొని వచ్చి మయూరయష్టిముఖముననుబ్రవేశ పెట్టిరన, రాజు ఛీ! ఛీ! అది తగదు. మణిభూమినిబరుండఁ బెట్టుమని చెప్పుము. అం దెవరిని జూడనీయవలదు. ద్వేషసూచకము లయినమాటలు చెప్పవలదు. ఎండ తగులకుండఁగాఁ జల్లనిచోటఁ బరుండఁబెట్టి యుపచారము చేయింపనలయు ననుము పో, యని యాజ్ఞాపింప, వాఁడు మహాసేనా! అమాత్యభరతారోహకుఁడు దేవరదర్శనము గాంక్షించుచుండె నని చెప్పి వెడలె. దానిపై రాజు, వత్సరాజసత్కార మతని కిష్టముగాదు. నేనే వెళ్ళి యాతని ననునయించెద నన, నంగారవతి సంబంధము నిశ్చయింపఁబడెనా? యని యడిగె. లేదని యతఁడు నుడివి యామెకు సెల విచ్చిపంపి "ద్వేషభావమున నితనిఁ బట్టించితినిగాని యీతనికష్టదశ వినఁగా నాకే సంతాపము గలుగుచున్నది. నే నేగి యుదయను నుపచారవాక్యంబుల స్వస్థపఱిచెద" ననుచు మణిభూమికిఁ జనెను.

అనంతరము వత్సరాజు బంధనాగారమున నివసించియున్నతఱి నొకనాఁడు వాసవదత్త, ధాత్రి యొక్కతెయు వెంటరాఁ బల్లకి నెక్కి కృష్ణాష్టమి నిమిత్తముగా దేవతారాధనము

చేయుటకై యక్షిణీస్థానమునకు బయలుదేఱెను. ఆమె కన్నె యగుటచే నాశిబికకుఁ దెర కట్టఁబడలేదు. మఱియు నాస్థానము వత్సరా జున్నయింటి కెదురుగానున్నది. ఆకారణమున బంధనగృహద్వారమునఁ దిరుగుచున్న యారా జాకన్నియను గన్నులారఁ గాంచెను. ఆమెయు సాభిలాషంబుగ నామనోహరాకారుని సందర్శించెను. అన్యోన్యవీక్షావశంబున వారిహృదయంబుల ననురాగబీజ మంకురించి పెరిగి క్రమముగా నతిరహస్యముగా దాంపత్యసుఖరూపమున ఫలించినది. ఇది నిమిత్తంబుగా నుదయనుఁడు తనకు ఘటిల్లినదురవస్థను మఱచి యానందపరవశుఁడై యుండె.

ఈ వృత్తాంత మిట్లు జరుగుచున్నకాలముననే మంత్రి యౌగంధరాయణుఁడు వత్సరాజు నెట్లయిన మాయోపాయంబుననే విడిపింపఁ దలఁచి తనమిత్రులను బరిచరులను గూఢరూపంబుల సజ్జుని నుండఁ బనిచి తాను నున్మత్తవేషుఁడై యందు నటించుచుఁ గార్యసాధనమార్గంబు లరయుచుండె.

ఒకనాఁడు మధ్యాహ్నవేళ డిండికవేషధారి యగువసంతకుఁడును శ్రమణకవేషధారి యగురుమణ్వంతుఁడును దోడరా వెఱ్ఱివేషంబున నున్నయమ్మంత్రి యుజ్జయినీ ప్రాంతమందలియొకశూన్యశివాలయముచెంత నున్న యగ్నిగృహమునఁ బ్రవేశించి "వసంతకా! మనప్రభువును జూచితివా" యని యడిగె. అందు కతఁడు "నేఁడు చతుర్దశి యగుటచే స్నానము

చేయుచుండఁగా రాజును జూచితి'' నని చెప్ప, మంత్రి "విదూషకా! మరల నొకసారి జేనినిజూచి, రేపే ప్రయాణము. ఘోషవతితోఁగూడ నీవు కౌశాంబి చేరుసన్నాహముచేయఁ బడినది. ప్రద్యోతుఁడు నిన్ను శరణుచొచ్చునట్లు ప్రయత్నింపఁబడియె నని విన్నవింపు'' మన, వాఁ డేదో యాలోచించుచున్నట్లుండె. దానిపై రుమణ్వంతుఁడు 'వసంతకా! యేమట్లు చూచుచున్నా' వన నతఁడు మఱేమియులేదు. మీ ప్రయత్నమంతయు విఫల మగు నని చూచుచున్నాను. మన ఱేఁడు వాసవదత్తయెడ బద్ధానురాగుఁడై దాంపత్యసుఖ మనుభవించుచున్నాఁడని యీవృత్తాంత మంతయు వాక్రుచ్చె. అందుకు యౌగంధరాయణుఁడు చింతించి "ఆహా! యెంత సిగ్గుమాలినపని గావించినాఁడు? స్నేహితుల కెట్టిసంతాపము గలిగించినాఁడు? దేశకాలంబు లెఱుఁగక శత్రుకన్యను వరియించెఁ గదా? కానిండు. దీనికిఁ దగినట్లుగానే ప్రతీకారము చేయవలసియుండును' అని పలుక, విదూషకుఁడు "నీ వట్టిదిట్టతనము గలవాఁడవే యగుదువేని బంధనమునుండి రాజును, అంతిపురమునుండి వాసవదత్తనుగూడ లేవఁ దీయవలసియుండు' ననెను. అంత మంత్రిపుంగవుఁడు 'సరియే. గాండీవి సుభద్ర నట్లు వత్సరాజు వాసవదత్త నపహరింపకపోయినను, నేను రాజును వాసవదత్తను ఘోషవతిని విడిపింపకపోయినను, నేను యౌగంధరాయణుఁడను గాను. ఇదియే నా రెండవప్రతిన' అని సధైర్యముగఁ బలుకునంత విదూషకుఁ "డెవరో మన

వైపు వచ్చుచున్నారనెను. అంత వారు మువ్వురు రాజవిమో చనోపాయంబు నూహించికొని తలాయొక దిక్కునకుఁ జనిరి.

ఈ ప్రసంగ మిట్లుండ వత్సరాజు జలక్రీడ సలుపఁగోరినవాసవదత్తకు భద్రవతీగజము కావలసియున్నదని యొక రాజభటుఁడు దానిమావటీని వెదకుచు, గాత్రసేవకా! యని వానిపేరెత్తి గొంతెత్తి పిలుచుచు నెందును గానక తిరిగి తిరిగి మద్యపానశాలలో నుండెనేమో యని యచ్చటికి వచ్చి తప్పఁ ద్రాగి రక్తాక్షుఁడై యున్న యాగాత్రసేవకునిజూచి "యేమిరా! మదించియుంటివి? భర్తృదారిక యుదకక్రీడ సలుపఁగోరి యున్నదఁట. శీఘ్రముగా భద్రవతిని దోలికొనిర" మ్మన నమ్మావటీఁడు నోడ లెఱుఁగక యసంబద్ధప్రలాపము గావింపఁ జొచ్చె. అంత నాభటుఁడు భద్రవతి గానరాదేమి? ఎందున్నదో త్వరగాఁ బోయి తీసికొనిరా. తప్పుడుమాటలు ప్రేలక పొ'మ్మనుచుండ, వత్సరాజు వాసవదత్తతోఁగూడ భద్రవతి నెక్కి నెడలె'నని యొకమాట వినవచ్చె. దానిని వినినతోడనే గాత్రసేవకుఁడు సంతసించి 'ప్రభువున కవిఘ్నమగుఁగాక' యనెను. దానిపై రాజభటుఁడు కోపగించి 'యింకను ద్రాగుము మత్తెక్కిపడు' మన, వాఁడు" ఛీ! ఎవఁడోయి మత్తుఁడు! మేమందఱము నార్యయౌగంధరాయణునిచే నయ్యాకార్యంబుల నియోగింపఁబడిన గూఢచారులము. ఇదిగోఁ జూడుము. మా మిత్రు లెల్లరు నిరోధవిముక్తములయిన కృష్ణసర్పముల వలె నిటునటుఁ బరుగులెత్తుచున్నారు. ఓ స్నేహితులారా!

ప్రభువుకొఱకై నిష్కపటముగా యుద్ధము చేయకున్న నరకము సిద్ధము. అతఁడే యౌగంధరాయణుఁడు. అయ్యో! సంగ్రామము ప్రవృత్త మయినది. పొండు పొండు. కొట్టుఁడు కొట్టుఁడు'' అని కేకలు వేయుచు, నందేగి యకటా! మంత్రి పుంగవుఁడు పట్టువడెఁగదా? నేను నతనితోఁ గలిసికొనియెద' ననుచు నిష్క్రమించెను. ఇదంతయుఁ జూచి రాజభటుఁ "డిదేమి? ఆశ్చర్యకరముగా నున్నది. అకటా! ప్రాకారతోరణవర్జముగా నీయుజ్జయిని కౌశాంబీపుర మయినది. ఈ వృత్తాంతము నమాత్యున కెఱిఁగించెద" ననుచు వెడలె.

యౌగంధరాయణుఁడు కత్తి త్రిప్పుకొనుచు సంగరమునఁ బ్రవేశించి యోధుల నఱకుచుండ విజయసుందర మనెడి యేనుఁగుదంతము తగిలి యాకృపాణము జాఱిపోయినది. అంతలో జోదులు వచ్చి యాతనిఁబట్టి కట్టి కోటలోనికిఁ గొంపోవఁ జొచ్చిరి. ఆమంత్రియు వత్సరాజును జెఱనుండి విడిపించినందు కానందించుచు ఖడ్గదోషమునఁ దనకుఁ గలిగినబంధనమునకు వగవక "బ్రహ్మచారులకు వనప్రవేశము సుఖప్రద మయినది. మనోరథసిద్ధి నొందినవారికి వినిపాతమే రమణీయతర మయినది. ధర్మ మార్జించినవారిక మృత్యువు పశ్చాత్తాపకరము గాదు. నేను వైరమును భయమును బరాభవమును విడిచి, నయ వినయ శరంబులఁ గార్యము సలిపి శత్రుసంపదను మిత్రాపయశంబును బరిహరించి రాజునకు జయ మొసంగితిని. ఇఁక బద్ధుఁడ

నైన నేమి?" అని తలంచుకొనుచుండ, నాతనిఁ జూడ వచ్చిన వారిని భటులు తొలఁగుఁడనుచు నివారించుచుండిరి. అంత నమ్మంత్రి, "ఓరీ భటులారా! రాజానురాగనియమమున విపన్నుఁడ నయిన నన్ను నెల్లరం జూడనిండు. ఎవరు మంత్రిపదమును గోరుచున్నారో వారి కాయభిలాషము పొసఁగఁబోవును. లేదా స్థిరపడును. కావున నన్నందఱును జూచుటయే మంచి" యన, వారు మరలఁ బొంకు పొందు. యౌగంధరాయణు నెఱుఁగరా యనుచుఁ జూపఱ దొంగించుచువచ్చి, యమాత్యభరతరోహకుని యాజ్ఞచే నతని నాయుధాగారమునఁ బ్రవేశపెట్టి చేతికట్లు విప్పిరి. అంత భరతరోహకుఁడు యౌగంధరాయణుఁ డెక్కడ ననుచు నక్కడికి వచ్చి 'ఓయీ! నీనామాక్షరములు వినుచున్నాను గాని యిప్పుడు దైవవశమున నిన్నుఁ జూచితి" యన, నతఁడు "యోనితలిప్తాంగుఁడనై బద్ధుఁడనయ్యుఁ, దంత్రీయవమానమును మాపి శాంతుఁడయిన యశ్వత్థామ మాడ్కి నున్న నన్నుఁ గన్నులారఁ జూచుచున్నాను. దాని కా మంత్రి, 'తగును! మాయ చేసి రాజును విడిపించినందుకా యీ యాత్మస్తుతి?' యన 'నవును. కపటగజంబు నెపంబుగా పరరాజును వంచించుటకంటె నిది యధికము గా' దనెను. అందుకు భరతరోహకుఁడు 'కన్నె నీయకుండఁగా నపహరించుట నీచవృత్తి గాదా?' యన, యౌగంధరాయణుఁడు 'నీమాట సరిగాదు. ఇది వివాహమే గాని వేఱొండు గాదు. భారత కులజాతుఁడయిన వత్సరాజు గాంధర్వవిధిని వాసవదత్తను

2

బరిగ్రహించుట యెంతయు యుక్తమే' యనెను, అటుపిదప నాతఁడు "సరియేకాని సమరావజితు లయిన శత్రువులనుగూర్చి శాస్త్ర మేమి చెప్పుచున్న' దన, నితఁడు వధమే యని బదులిచ్చెను. అట్లయిన 'మీరాజును మాతేఁడేల సత్కరించును? అది యట్లుండనిమ్ము. మహాసేనునకుఁ బ్రాతికూల్యముచేసి కౌశాంబికిఁ బోవ నీ కెట్లు బుద్ధి వొడమె'నని యడుగ, నితఁడోయీ! యెంతపరిహాస్యవచనము పలికితివి? మీ యెదుటనే మాభూపతియరిగెను. ఇఁక మిగిలిన కార్యమును గూర్చి సంశయ మేల? వ్రేళ్ళతోఁ జెట్టును బెఱికినపిదపఁ గొమ్మలు నఱుకుటకు శ్రమపడవలయునా?' యనెను. వీరిట్లు సంభాషించుచుండఁగానే యొకపెద్దకలకలము వినవచ్చె నంతఁ, గంచుకి వచ్చి 'ఆర్యా? దేవి యయినయంగారవతి వాసవదత్తను వత్సరా జపహరించినందుకై పరితాపము చెంది మేడమీఁదనుండి క్రిందికిఁ బడుటకు సిద్ధపడునంత, నంతఃపురస్త్రీలు గోలపెట్టిరి. దానిపై మహాసేనుఁడువచ్చి 'దేవీ! యిది సంతోషసమయము గాని విచారకాలము గాదు. క్షత్రధర్మమున మనపుత్రిపరిణయ ముద్దిష్ట మయినది. వాసవదత్తావత్సరాజుల చిత్రఫలకంబుల కిపుడు పెండ్లి జరుగును గావున శాంతింపు మని నివారించి, తనరాజుమేలుగోరి యౌగంధరాయణుఁడు చేసినకృత్యముల యెడ నాకు ద్వేషభావములేదు. ఎవరియం దయినను గుణము కనఁబడినపుడు గౌరవింపఁదగినదే కావున నీబంగరుగిన్నె యౌ

మంత్రిశేఖరున కిమ్మని నాచేతి కిచ్చె' నని దాని నీయఁగడం గిన, యౌగంధరాయణుఁడు 'మేలుమేలు. తనతనయసంబంధము నిర్విఘ్నముగా గౌరవించినందు కెంతయు సంతస'మనుచు నాస్వర్ణపాత్రమును గైకొనెను. అంత వాసదత్తావత్సరాజుల ప్రతిమల కిక్కడ వివాహము జరిగినది. యౌగంధరాయణుఁడును ససత్కారంబుగఁ గౌశాంబికిఁ జనెను. ఆయనురూప దంపతులును నిరంతరానురాగంబున నందు సుఖం బుండిరి.

---

# 2. స్వప్నవాసవదత్త

శ్రీమంతం బగుమగధరాజ్యమునఁ బ్రకృతిరమణీయ మగు నొకకాననంబు గలదు. స్నానపానముల కనువగు సరోవరములును సర్వదా ఫలించు నానావిధ ఫలతరుబృందంబులును గలుగుటంజేసి యది తాపసుల కావాసమయ్యె. కావున నేది తపోవనము నాఁ బరగె. ఒకనాఁ డొక పరివ్రాజకుఁ డొకయవంతిదేశసుందరిని వెంటఁబెట్టుకొని యందుల కేతెంచి నంత "పొండు పొండు. లెండు లెండు. ఒత్తిగిల్లుఁ డొత్తిగిల్లుఁ" డను కేకలు వినవచ్చె. ఆసన్యాసి యామాటలు విని "ఇక్కడఁ గూడఁజోపుదారు కేకలా? ఈవచ్చెడిమైశ్వర్యమత్తుఁ డెవడో తనయానతిచే నతిప్రశాంత మయినయాశ్రమస్థానమును గూడ

గ్రామముగాఁ జేయుచున్నాఁడు" అనెను. అంతలో మరఁ
బై కేకలు వినిపించిన నయ్యవంతిక "అయ్యా! ఎవఁడు వీఁడు
ఈకష్టమునకన్న నీపరిభవ మెక్కుడుదుఃఖకరముగా నున్న
గదా?" అనిన నతఁడు "సోదరీ! ఎవఁడో తెలియక కూఁత
చుండె, మన కేమి? ఈవైభవ మంతయు నీవు పూర్తిగా నను
భవించి విడిచినదే. నీభర్తకు జయము గలుగఁగానే నీవు మర
నిట్లే వందమంది చోపుదారు కేకలు వేయుచు ముందు నడచు
చుండఁ బయనముమీఁదఁ బయనము చేయఁగలవు. బండికండ్ల
యాకులబంతివలె భాగ్యపంక్తియు గిరగిరఁ దిరిగివచ్చుచుండుట
నైజముగదా? దీని కింత వంతయేల?" యని యోదార్చె.
అంతలో మరల నట్టే కేకలును, వానిమీఁద "ఓరీ! ఇది ఘో
వాసక్లేశంబు విడిచి వచ్చిన మునుల యాశ్రమస్థానము. ఇం
దిట్టిపరుషపదము లుపయోగింపరాదు. రాజుగారి శిక్ష
తీసికొని రాకుఁడు" అను మందలింపుఁబలుకులును వినవచ్చె.
వానిని విని యాతపస్వి "వీఁడెవఁడో కొంచెము తెలివి గల
వాఁడుగా నుండెఁ జూత' మని యామెతో నప్పురుషున కెదు
రేగి "ఓయీ! ఈ యుత్సాహ మేల?' యని యడిగిన
నతఁడు "స్వామీ! మగధరాజైన దర్శకమహారాజుగారి
చెల్లెలు పద్మావతి యీ యాశ్రమమునఁ దాపసియై యున్న
తనతల్లిని సందర్శించి వెళ్ళుటకై వచ్చినది. అందుకై తెలియక
భటులు కేక లిడిరి. దీని కేమి గాని, మా రాజపుత్రి మిక్కిలి
ధర్మప్రియురాలు. మునులయెడ నామెకుఁ గడుభక్తి. మీరు

దర్శింపవచ్చును" అని సవినయంబుగఁ బలికె. అమ్మాటల కాయతివచ్చ్యుఁ డలరి తనలో « కానీ! ఈమె మగధరాజపుత్రి యైన పద్మావతియా? పుష్పకభద్రాదిదైవజ్ఞుల యాదేశమున నీమె మనప్రభు వైనయుదయనునకు భార్యగాఁ గల దని యూహించుచుంటిమిగదా?" అని తలఁచుచుండె. అవం తికయు « రాజదారిక యని వినఁగానే తన కామెయెడ సోదరీ ప్రేమ ముదయించిన " దనుకొనెను. అంతలో సపరివారయై పద్మావతి యచ్చటి కనతిదూరమున నున్నతల్లిని జేరవచ్చె. వీ రిరువురును వారివెంబడి నేగిరి. పిదపఁ బద్మావతి వృద్ధతాపసి యగు మాతకు నమస్కరింప నామె దీవించి « అమ్మా? రమ్ము తపోవనము లతిథులకు స్వగృహములే. సంశయింపక యిందు ర' మ్మని పిలిచి యాదరించి, యామెచేటికతో « నోసీ! మీ భర్తృదారికకు వరుఁడు దొరకలేదా? యని యడిగెను. అం దుకది, ఉజ్జయినీ రాజగు ప్రద్యోతుఁడు తనకుమారున కీమె నిమ్మని కోరుచు వర్తమాన మంపె' నని చెప్ప, నత్తాపసి తగిన సంబంధమే యని సమ్మతిఁ జూపె. ఆమాట కవంతిక « ఈమె నా కాత్మీయురా లగుట యానందకరమే ' యనుకొనెను.

అటుపిదపఁ బద్మావతి తనతో నున్నకంచుకితో నిందలి మును లేమయినఁ గోరుదురేమో? పిలిచి చెప్పు ' మన నతఁడు "ఓమహర్షులారా! కమండలువు గాని వస్త్రములు గాని గురుదక్షిణ గాని యెవ్వ రేమి గోరినను సరియే, వాని నెల్ల నిచ్చుటకు మారాజతనయ యభిలషించుచున్నది.

రండు రండు" అని గొం తెత్తి యాహ్వానము సేసె. అంతఁ బ్రక్కను నిలిచి యున్న యాపరివ్రాజకుఁ డిదియే సమయము. నా కుపాయము దొరకిన దని యానందించి యెదుటికి వచ్చి నఁ, జూచి యావృద్ధతాపసి 'యీ తపోవనమందలితపస్వులు నిత్యసంతుష్టులు. ఇతఁ డెవఁడో యాగంతుకుఁడు కావచ్చు ననెను. కంచుకి 'నీ కేమి కావలయునయ్యా!' యని యడిగిన, నతఁడు తనతో నున్నయవంతికను జూపి "ఈమె నాతోఁ బుట్టువు. ఈమెమగఁడు పరదేశమున కేగె. అతఁడు వచ్చు నందాఁక నీమెను మీ రాజకుమారి తనయొద్ద నుంచికొని సంరక్షించుఁగాక" యని కోరుచున్నాను. నాకు ధన మక్క ఱలేదు. వస్త్రము వలదు. భోగము లపేక్షణీయములు గావు. జీవికకై నేను గాషాంబరము గట్టినవాఁడను గాను. ధర్మశీలయు ధీరయు నైననాసోదరిని గొంతకాలము పోషించినఁ జాలును. ఇదియే ముమ్మాటికి నాకోరిక' యని తెలిపెను. అతనికోర్కి విని యవంతిక తనలో "కానీ! ఈ యౌగంధరా యణుఁడు నన్నిమెకడ నుంచఁ దలఁచినాఁడు. మంచిదే. ఇతఁ డాలోచింపక యిట్లు చేయఁడు" అనుకొనెను. కంచుకియుఁ బద్మావతితో అమ్మా! ఈ మునియభిలాష గొప్పది. దీని నెట్లంగీకరింపవచ్చునో తెలియకున్నది. తపోధనప్రాణముల నైన దారవోయుట సుకరము గాని న్యాసరక్షణము మాత్ర ము సుకరముగాదు గదా!" అనఁగా, నామె "ఏమి కోరిన నిచ్చెద నని ప్రతిన చేసి యిపుడు దీనికై యాలోచించుట

తగవా? తప్పక యట్లు సమ్మతింపవచ్చును” అని బదులిచ్చె. అందుకు యౌగంధరాయణుఁ డానందించి ‘సోదరీ! ఈమహారాజసుతతో నుండుము’ అని చెప్పిన, నట్లే యని యామె పద్మావతిచెంత కరిగి యామెచే గౌరవింపఁబడియె. వృద్ధతాపసి యవంతికను జూచి యాశ్చర్యపడి ‘యీతన్వి రాజపుత్రి యనియే నానమ్మక’ మనుకొనెను. చేట్యాదులు నట్లే యూహించిరి. అట్టియెడ యౌగంధరాయణుఁడు తనలో “అమ్మా! సగము బరువు వదలినది. వాసవదత్తను దగిన చోటఁ దాఁచితిని గదా! రుమణ్వదాదులతోఁ జెప్పినట్లు జరిగినది. ఇఁకనో వత్సరాజు శత్రుకత మైనతనరాజ్యమును మరల గెలిచినపిదప నీవాసవదత్త నాతని కర్పించునెడ నీమగధరాజపుత్రి మంచివిశ్వాసస్థానముగాఁ గలదు. ఉదయనుని రాజ్యము పోవు నని చెప్పినదైవజ్ఞులే కాలక్రమమున నాతనికిఁ బద్మావతి పత్ని గాఁ గల దని నిర్ణయించిరి. ఆనమ్మకమును బట్టి యీమె నీమెకడ నుంచుట యెంతయు నుచితమే యైనది” యని మనసు సరిచేసికొనెను.

అత్తరి నొకబ్రహ్మచారి తల యెత్తి చూచి ‘ఇపుడు మధ్యాహ్న మయినది. మిక్కిలి యలసితిని. ఎందు విశ్రమింపఁ దగునో తెలియకున్నది. పరికింపఁగా నీప్రాంతముననే మున్యాశ్రమ మున్నదని తోఁచుచున్నది. అందుకు నిదర్శనముగా లేడిపిల్లలు నిర్భయముగా నిచ్చటికిఁ జేరుచున్నవి. నీళ్ళు పోసి పెంచినట్లుగా నీపాదపములు పువ్వులతోఁ బండ్ల

తో నిండియున్నవి. ఇందుఁ గపిలగోవులు సమృద్ధిగా నున్నవి. ఈప్రాంతభూములు దున్నినవి గావు. అదిగో! పొగ గూడఁ బైకి లేచుచున్నది. ఇది నిక్కముగాఁ దపోవనమే. కానీ! ఇందుఁ బ్రవేశించెదను." అని తలఁచుచు నచ్చటికి విచ్చేసి యాశ్రమవిరుద్ధ మయినజనమును జూచి యుచ్చైరువడి తాపసులు గూడఁ గొంద ఱుండుట కానందించి యాఁడువారుండుట గనిపెట్టి సంశయించి యొకచో నిలువఁబడెను. అతనిఁ జూచి కంచుకి ‹‹అయ్యా! సందియ మొందక దయ చేయుము. ఇది సర్వజనసాధారణ మైన యాశ్రమమే!' యన, వాసవదత్త ‹ఊఁ' అనెను. అది విని పద్మావతి ‹ ఓహో! ఈమె పరపురుషదర్శనమును బరిహరించుచున్నది. ఈమె నేకాంతమునఁ గాపాడఁ దగునుగదా!' అనుకొనెను. అంతఁ గంచుకి యతని కతిథిసత్కారము గావించినపిదప, యాగంధరాయణుఁడు ‹మీ దేయూరు? ఎక్కడనుండి వచ్చుచున్నావు? ఎక్కడికిఁ బోవలయును?' అని యాబ్రహ్మచారి నడుగ, నతఁడు తనవృత్తాంత మివ్విధమునఁ జెప్పఁదొడఁగె.

"వత్సరాజ్యములో లావాణక మను గ్రామము గలదు. వేదాధ్యయనమునకై నేనచటికిఁ బోయి యుంటిని. కాని నా విద్య కంతరాయము సంభవించినది. దాన నేనచ్చోటు విడువవలసి వచ్చినది. అ దెట్లో చెప్పెద వినుము. లావాణకరా జయినయుదయనుఁడు వేఁటకుఁ బోయినసమయమున నాగ్రామము కాలిపోయినది. అపుడు రాజపత్నియు నవంతిరాజ

పుత్రియు నగువాసవదత్త గూడఁ గాలిపోయినది. ఆమెను సంరక్షింపఁ బోయి యమాత్యవర్యుఁ డగుయౌగంధరాయణుఁడు గూడ నాయగ్నిలోఁ బడి మృతిఁ జెందెను. అంత మృగయానివృత్తుఁడై వత్సరాజావృత్తాంతము విని తాను గూడ నయ్యగ్నిలోఁబడ యత్నించెను గాని తక్కినమంత్రు లెట్లో యడ్డగించిరి. ఆతఁడును దనప్రియురాలివియోగము నోర్వలేక దుఃఖించుచుఁ గాలఁగా మిగిలినయామెనగలను దీయించి వానిని గౌఁగిలించికొని యేడ్చెను. అప్పు డాతని యవస్థఁ జూచిన రాతికైన నేడుపు రాక పోలేదు. అంతటితో నాఁగక యతఁడు నేలపైఁ బడి పొరలిపొరలి యేడ్చుచు వాసవదత్తను బేర్కొని యామెసుగుణముల వాక్రుచ్చుచుఁ బలువిధముల విలపించెను. అయ్యో! ఏమి చెప్పుదును? అమితానురాగంబున నామెసుగుణముల నాతఁడు పేర్కొనుటఁ జూడ వాసవదత్త దగ్ధయైనను దగ్ధురాలు గాని దనియే యెల్లరకుఁ దోఁచినది. అంత మంత్రిపుంగవుఁ డగురుమణ్వంతుఁ డనేకవిధముల బోధించి యాశ్వాసించి లేవనెత్తి తీసికొని పోయి నీళ్లు లేక నిద్రలేక తిండిలేక ఆతనికిఁ బరిచర్య చేయుచు రాత్రి యనక పగలు నాక యాతని నొక్కనిముసమైన విడువక యాతనికోఁడిదే ప్రాణమని యాతని నంటిపెట్టుకొని యుండె. అప్పటికిని రాజు దుఃఖశాంతి నొందక “ఇందు నా కాంతతో నవ్వితిని. ఇందుఁ గూరుచుంటిని. ఇందు మాటలాడితిని. ఇందు నిద్రించితిని. ఇందు విహరించితి’ ననుచు

నాయాస్థానంబులు చూచి విలపించుచుండ, నది పని గాదని తలంచి మంత్రు లతిప్రయత్నము చేసి యాతని నాగ్రామమునుండి తీసికొని పోయిరి. అతఁడు వెడలినపిదపఁ జంద్ర నక్షత్రశూన్య మయిన యాకాశమువలె నప్పురము తేజోహీన మయ్యె. కావున నేను నాగ్రామము విడిచితిని"

ఆబ్రహ్మచారి యుదయనునికథ ప్రారంభించి నంతనే గ్రుడ్ల నీరు గ్రుక్కుచున్న వాసవదత్త "ఆ మహారాజు ననురాగము నా కనుభూతమే. అయ్యో! ఎంతదుఃఖ మనుభవించెనో? నేను జీవించియుంటి నని తెలియదు గదా? నాదహనవార్త యలీక మని తలఁపఁడు గదా? అక్కటా! ప్రాణప్రియుఁడు నాకై మూర్ఛిల్లెనా? రుమణ్వంతుఁడు దుఃఖోపశమనము చేసెనా? కానీ యౌగంధరాయణుని యాలోచనము ఫలించినఁ జాలును" అనుచుఁ దల వంచికొని తనలోఁ దాను దుఃఖపడుచుండఁ, బద్మావతి చూచి "యీమె పరులకష్టము సహింపలేని దయాళురాలు గదా" యని తలఁచెను. వృద్ధతాపసి వత్సరాజునకుఁ గలిగినకష్టమును గూర్చి విచారించి యాతనిసౌజన్యముఁ బ్రశంసించె. తక్కినవా రందఱు వత్సరాజోదంతంబునకు విస్మయపడిరి. చేటిక పద్మావతితో రహస్యముగా 'అమ్మా! ఇఁక మీఁద నామహారాజు జేకన్యను బెండ్లియాడునో?' యన; నామె తనలో 'నేను నదియే యాలోచించుచున్నా' ననుకొనెను. అంత నాబ్రహ్మచారి వారిసెలవు గైకొని యాశ్రమములోనికి వెడలెను. యౌగంధరాయణుఁడును రాజకార్యనిర్వహణమునకై

పన్నినయుపాయ మంతయును ఫలించినందు కానందించి వాసవదత్తను బద్మావతికి మరల నప్పగించి సెలవు గైకొని చనియెను. పద్మావతియు నవంతికావేషధారిణి యగువాసవదత్తయు వృద్ధతాపసికి వందనము లొసంగ, నామె క్రమముగా నీకుం దగినవరుండు లభించుంగాక, నీ కచిరకాలమునం బతిసమాగమము గలుగుంగాక, యని యిరువురను దీవించెను. అంతఁ బద్మావతి సపరివారయై వాసవదత్తను గూడి సూర్యాస్తమయ సమయమున రాజగృహాభ్యంతరమున కరిగె.

ఒకనాఁడు పద్మావతి తనగృహారామమున మాధవీలతామండపముచెంగట వాసవదత్తను గూడి కందుకక్రీడ సలుపుచుండ, వాసవదత్త "చాలసేపు బంతు లాడుటచే నలసితివి. నీచేతులు నెఱ్ఱవాఱి నీవి కాని యట్లున్నవి సుమీ" యనెను. పద్మావతియుఁ "బరిహాసము చాలింపుమమ్మా!" యని ప్రణయకోపము నటింప. "మహాసేనుస్నుషా! ఊరకుండుము లే' యని యెత్తిపొడిచి పరిహాసించెను. "మహాసేనుఁ డెవఁడమ్మా' యని పద్మావతి యడుగ, నామె "ఉజ్జయినీరాజగు ప్రద్యోతుఁడే" యని బదులుచెప్పె. అప్పటికి వచ్చియున్న చేటి యామాట విని "మా భర్తృదారిక యాసంబంధమును గోరుట లేదు. వత్సరాజగు నుదయనునిసుగుణంబులు కలుగు చున్నది' యని చెప్పిన, "వాసవదత్త తనభర్తను గోరుచున్నదనుట తమతలంచినకార్యమున కనుకూలమే'యని యూహించి "యేమికారణ' మని ప్రశ్నించె. అందుకుఁ జేటి "అతఁడు దయాస

ముద్రుఁ డగుటయే' యని యుత్తర మిచ్చి, పద్మావతి తో అమ్మా! అతఁడు చక్కనివాఁడు గానిచో నేమి చేయఁ దగు'' నని యడిగెను. దానికి వాసవదత్త " అట్లు కాదు. ఆ రాజు స్పృహణీయుఁ' డని చెప్పెను, నీ వెట్లెఱుఁగుదు వని పద్మావతి యడిగె. అందు కామె భర్తృపక్షపాతంబునఁ దొందరపడి యట్లు చెప్పుట కించుక సవరించుచు 'ఉజ్జయిని లోనివా రెల్ల ప్రశంసించుకొనుచుండుట విని యుంటి' నని మాఱుపలికె. ఇట్లు వీరు మాటాడికొనుచుండ ధాత్రి వచ్చెను. పిదప నీక్రిందిసంభాషణము జరిగెను

ధాత్రి—భర్తృదారికా! రాజుగారు నిన్నిచ్చినా రమ్మా.

వాస—ఎవరికి?

ధాత్రి—వత్సరాజుగారికి.

వాస—అతఁడు కుశలముగా నుండెఁగదా?

ధాత్రి—సుఖముగా నుండె. ఇప్పుడిటకు వచ్చె. మా భర్తృదారికను నోటితోఁ బ్రతిగ్రహించె.

వాస—అబ్బా! ఒడలు గగుర్పొడుచుచున్నది.

ధాత్రి—అంత వెఱ యేమి?

వాస—ఏమియు లేదు. నాఁడు బ్రహ్మచారి చెప్పినట్లు వాసవదత్తనుగూర్చి యంతగాఁ జింతించి నేఁ డిట్లుదాసీనుఁడయ్యెఁ గదాయని—

ధాత్రి—దాని కేమి? ధర్మజ్ఞులైన మహాపురుషుల హృదయము లెట్టియుక్కట్టు ననుభవించియు శీఘ్రముగాఁ బూర్వస్థితిని జెందు నటుల నిక్కము.

వాస—అతఁడే స్వయముగా వరించెనా?

ధాత్రి—లేదు లేదు. ఆయన యేదో పని గలిగి యిక్కడికి వచ్చెను. ఆతని సుగుణసంపదను గని పెద్ద మహారాజుగారు [illegible] నిచ్చెద నని వాగ్దానము చేసెను.

ఆ మాటలు విని యుదయనుఁడు పెండ్లియాడునని వాసవదత్త తనలో సంతోషించుచు [illegible] ఒక చేటి వచ్చి "అమ్మా! త్వరపడుము త్వరపడుము. నేఁడు శుభదినము గావునఁ గౌతుక మంగళకార్యము జరిపించవలయు నని దేవిగారు సెలవిచ్చిరి" అని [illegible]. వాసవదత్త [illegible] యుండెను.

[illegible] వాసవదత్త [illegible] ధర్త యన్యకన్యను [illegible] వచ్చి "అమ్మా! [illegible] మనసాయెను. [illegible] పద్మావతమ్మా! నీవు గొప్పకులమునఁ బుట్టినదానవు, స్నేహితురాలవు [illegible] నీచే [illegible]

ప్పించి తెమ్మని మా రాణి యానతిచ్చినది. ఇవిగోఁ బత్రపుష్ప పల్లవములు" అని యిచ్చెను. "అయ్యో! నాకర్మము. ఈ పనిగూడ నేనే చేయవలయునా? ఆహా! భగవంతుఁ డెంత దయమాలినవాఁడు?" అని తనలోఁ జింతించుచు మాలిక గ్రుచ్చుచుండ నచ్చేటిక "ఆర్యా! త్వరగాఁ గావలయును. అపుడే జామాత మణివేదికపై స్నాన మాచరించి చతుశ్శాలమునఁ బ్రవేశింప నున్నాఁ" డని తొందరపెట్టెను. అంత నవంతిక 'నీ వాతనిఁ జూచితివా? ఎట్లున్నాఁడు" అని యడుగ నది 'యేమి చెప్పుదును? శరచాపహీనుఁ డగు కామదేవుఁడే యతఁ" డని బదులిడె. అందు కామె "చాలులే. పరపురుషసంకీర్తనము వినఁదగ' దని దానిని వారించి మరల దండ గ్రుచ్చుచు "నిది యేమి యిది యేమి" యని కొన్నిదళములు చూపి యడిగె. "ఇది సౌభాగ్యవర్ధనము. ఇది సపత్నీమర్దనము" అనుచుఁ జెప్ప "మొదటిది యుక్తమే కాని, యీ రెండవది నిరర్థకము. సపత్నియే లేదు" అని చెప్పి దానిని విడిచి పెట్టి కౌతుకమాలికను గ్రుచ్చి దానిని బంపి యీ భర్తృపరాధీనుఁ డయ్యెఁగదా యని దుఃఖించుచును లేచి యెందేని శయనించి సంతాపశాంతిఁ జేకొనియెదఁ గాక యని వెడలె.

పరిణయోత్సవ మయినపిదప నొకనాఁడు పద్మావతి సపరివారయై యవంతికనుగూడి ప్రమదారామమున కేతెంచి యందలిచంద్రకాంతశిలావేదికపైఁ గూరుచుండి శేఫాలికాలతాకుసుమంబులు గోసికొని రమ్మని చేటికనుబంపి తనప్రక్కఁ

గూర్చుండి యున్న యవంతికతో ముచ్చటలాడుచు మాటల సందర్భమునఁ దనయెడ వత్సరాజునకుఁ గల యనురాగమును దెలిపెను. అంతలోఁ జేటిక, పవడములు ముత్తెములు గలిసి నట్లుగా నెఱుపు దెలుపు గలిసి యున్న యాపూవులు గొన్ని కోసి తెచ్చి చూపించి యింకను గోసికొనివత్తునా? యని యడుగఁ బద్మావతి "వలదువలదు. ఆర్యపుత్రుఁ డిందులకు వచ్చి కుసుమసమృద్ధిని జూచి నన్ను గౌరవించును. ఉండని" మ్మనెను. అంత వారి క్రిందిసంభాషణ మయ్యెను.

వాసవ—చెలీ! నీభర్త నిన్ను మిక్కిలి కూర్చునుగదా?

పద్మా—ఆకూరిమి నేను జెప్పఁజాలను. అతని విడిచి నిమిష మైనను నుండఁజాలను.

చేటి—మారాజపుత్రి నిజము చెప్పినది.

పద్మా—కాని, నా కొక్క సందేహము.

వాస—ఏ మేమి?

పద్మా—నన్నెట్లు ప్రేమించుచుండెనో యట్లే వాసవదత్తను ప్రేమించుచుండెనా? యని.

వాస—ఇంతకంటె నెక్కుడుగాఁ బ్రేమించెను.

పద్మా—నీ వెట్లెఱుఁగుదువు?

వాస—(పతిపక్షపాతమున నట్లు చెప్పియు మాట తప్పించి) అట్లు గాకున్న వాసవదత్త తల్లిదండ్రుల విడిచి భర్తతో వెడలునా?

పద్మా—అవును నిజమే.

చేటి—అమ్మా! "నేను గూడ వీణ వాయించఁ గల నని నీభర్తతోఁ జెప్పితివా?

పద్మా—చెప్పితిని.

వాసవ—ఏమనెను?

పద్మా—ఏమియు బదులు చెప్పక నిట్టూర్పు విడిచి యూరకుండెను.

వాస—అప్పుడు నీ వేమనుకొంటివి?

పద్మా—పూజ్యురా లయిన వాసవదత్త గుణములను తలఁచికొనియు, దాక్షిణ్యముచే నాయెదుట విలపింపకుండె నని యూహించితిని.

ఇది సత్యమైనచో నే ధన్యురాలనే యని తలఁచికొని వాసవదత్త గూర్చుండెను.

ఇట్లు వీరు సంభాషించుచుండఁగా వత్సరాజగు నుదయనుఁడు వసంతకుఁ డను విదూషకుఁడు ముందు నడువ నా ప్రమదవనమునుఁ జూచుచు వచ్చి యొక్కచో నించుక నిలిచి "వసంతకా! నాఁడు నేనుజ్జయినిలో నవంతిరాజతనయను జూచి పంచబాణావస్థఁ జెందినప్పుడు మన్మథుఁడు తన కున్న యైదు బాణములను నాపైఁ బ్రయోగించె. అవి యిప్పటికిని నా మనసులో నాటుకొని యే యున్నవి. అట్టియెడ మన్మథుఁడు నన్నిప్పుడు మరల బాణములతోఁ గొట్టెంగదా? ఈ యాఱవబాణ మతని కెక్కడనుండి వచ్చెనో యని యూహించుచు ముందు నడవసాగించితిని. ఇదిగో వచ్చుచున్నాఁడు" అనుచు [illegible]

చుండ, వసంతకుఁడు "వయస్యా! దేవి లతామండపమున నుండె నో యాచంద్రకాంతోపలవేదికపై నుండెనో యేయాకులయరఁ టిచెట్లలో నుండెనో తెలియకున్నది. కాని, నూతన మదిగో గగ నమున సారసపక్షులు బారులు తీరి యెంతచక్కఁగాఁ బోవు చున్నవో?" అనుచు నడచుచుండెను. "తెల్లనై పొడవై వంకర లేనిదై యాకసమును విడఁ దీయునట్టిసరిహద్దువలె నున్న యా విహంగరాజిని జూచితిని" అనుచు రాజు చెప్పె. వీరిద్దఱిట్లు వచ్చుజాడఁ దెలిసి చేటి తెలియఁజెప్పఁగాఁ బద్మావతి "ఆర్యా నీకై నేను గూడ నార్యపుత్రునిదర్శనమునకుఁ దొలఁగెదను. ఈ మాధవీలతామండపములోనికిఁ బోవుదము రమ్మనుచు నామెతో నం దేగెను. రాజవిదూషకులుఁ గ్రమముగా నవ్వే దికకడకు వచ్చి యందున్న శేఫాలికాపుష్పగుచ్ఛములఁ జూచి పద్మావతి వచ్చి వెళ్ళినదని యూహించి యంతట మాధవీ లతామండపములోఁ బ్రవేశింతమనుకొని వచ్చుచుండ, నందుఁ బ్రవేశింపకుండుటకై చేటిక ద్వారమునందున్నకొమ్మలఁ గదల్చినది. కదల్చుటచేనే పూవులరాలి [illegible] యుం తుమ్మెదలు ఝుమ్మనుచు [illegible] మూఁగుచుండఁగా [illegible] గట్టెను. [illegible] మరలి వేదికపై నధివసించిరి. అట్లు కూర్చున్నయుదయనుని వాసవదత్త తీఁగలనడుమనుండి చూచి తనప్రియుఁడు తొంటి వలెనే యుండుటకు సంతసించి వియోగమునకు దుఃఖించి

కన్నుల నీరు పెట్టి పద్మావతికిఁ దెలియకుండుటకై పుష్పోడి కన్నులలోఁ బడిన దని కన్నులు నలిపికొనెను.

ఇట్టియెడ వసంతకుఁడు "వయస్యా! ఈపూలతోఁటలో నిప్పు డెవ్వరు లేరు. ఒక్క చిన్న ప్రశ్న మడిగెదను. సంశయింపక చెప్పుము. పద్మావతీవాసవదత్తలలో నీ కేదేవి యుత్తమ ప్రేమస్థాన మయ్యె' నని యడుగ, వా రిరువురు గూడదా జేమను నో యని తలంచిరి. రాజు నేమియుఁ జెప్పక యూరకొనెను. "సంశయించెద వేల? వాసవదత్త పోయినది. పద్మావతి దగ్గఱ లేదు. యథేచ్ఛముగాఁ జెప్పవచ్చు" నని మరల నిర్బంధింప, రాజు "నీ వోటినోటివాఁడవు. చెప్పుటకు మనసు రాకున్న" దనె, విదూషకుఁడు ఒట్లు పెట్టికొని బలాత్కారముచేసె. పద్మావతి యామాట విని "ఆర్యపుత్రుని యభిప్రాయము తెలిసి యుచునే యున్నది. ఇంక నీతఁడు నిర్బంధించు టెందుకో?" యనెను. అంతట నా రాజు "వయస్యా! నీపీడ వదలదు. చెప్పుచున్నాను విను. సౌందర్యసౌశీల్యసరససల్లాపములఁ బట్టి పద్మావతియు నా కెక్కుడు ప్రియురాలే యగును గాని వాసవదత్తాబద్ధమైయున్న నాహృదయము మాత్రము మాకర్షింపఁ జాలకున్నది' అని దెలిపినంత, వాసవదత్త "కష్టమునకుఁ దగిన ఫలము గాంచితిని. అజ్ఞాతవాసము గూడ సుగుణభూయిష్ఠమే యయినది" అని తనలో నానందించెను. చేటి "అమ్మా! నీ కేల దాక్షిణ్యము లేదన, నామె "అట్లు గాదు. ఇప్పటికిఁ గూడ నార్యపుత్రుఁడు వాసవదత్తను స్మరించుచుండుట యాతని దాక్షి

న్యాయమునే స్మరించుచున్నది కదా. పిదప "నీయభిప్రాయ మేమో చెప్పు" మని రాజు వసంతకుని బలాత్కరించి యడుగ, వసంతకుడు వాసవదత్త నిట్లని యన్నారాలు. పద్మావతి, తరుణి ఘనుని యహంకారిణి మధురవాణి కరుణాకారిణి యగుట నామెయు విష్ణుగాతే కాని యుం దొక్కటి లేదు. వసంతకుం డెం కుండెదని నేకించి పిలిపించి యార్యవాసవదత్త నాకు భోజనము పెట్టుచుండెడిది' యని పలుక, వసంతకుడు "కానీ! యింతయు నత్తవ్వకే చెప్పవలెనే" యనె. వసంతకుడు "మిత్రవరా! వాసవదత్తే నీకాలమె యున్నదిగదా? ఆమె యెక్కడ? అనగా, వసంతకుడు నవ్వుచు "నగరా; యీ పరిహాసపు మాటలను కొంతసేపటి వరకు మానిపట్టి మాటలాట నొకటి చెప్పుచు సుఖింతె. వాని పై పద్మావతి యుంచి ప్రసంగమును ప్రక్కకు నెట్టి నాయము దెప్పుమని చింతిల్లె. వాసవదత్త "ఓలోకమునకు నిట్టివిలుమాటలు పలుకు చేర్చితేను వెళ్ళెది మాయాసనని తలచెనట్లె. ఆసుఖ్యమును విదూషకుడు మూఢ సిరుచ, రాజు "వయస్యా! నాయమయ్య నీకు చెప్పుదును. శాంతిలును గని యేమి చెప్పెదవు? దుఃఖశాంతికొఱకే నవ్వులా పెంచ్చుకొంటిని. కాని తెలియని కొన్నాళ్ళకొఱకిది భార్యాదుఃఖము వదలక నగుచున్నది. ఇంకే నేమి చేయుదును? పూర్వాగాం గన్నయు తాగ్ని ప్రియాపరాగబుద్ధిను తీర్చి చిత్తశాంతి నొందెద. ఇంకేమి లోకమాధానము. ఇంతకంటె వేఱుపాయము గానరాదు' అని విలపించెను. అంత విదూషకుడు మొగమును నీరు

కొన నీళు దెచ్చుటకై వెడలినంత, వాసవదత్త మనసులో ఖేదించి, విచారించుచున్న పద్మావతిని ప్రియునియొద్దకుం బొమ్మని చెప్పి తాను వెడలిపోయె. తామరాకులో నీరుపోసి కొని వచ్చువసంతకుని దారిలోఁ జూచి పద్మావతి "ఆర్యా! యేమిది?' యని యడుగ, నతఁడు 'ఏమియు లేదు. గాలి కెగిరి వచ్చిన రెల్లుపువ్వురేణువు కంటిలోఁ బడుటచే నామిత్రుని ముఖము కన్నీటఁ దడిసినది. కడిగికొనుటకై జలము తెచ్చితిని. దీనిఁ దీసికొనిపోయి నీవే యి'మ్మని యా తామరాకుదొప్ప చేతి కిచ్చెను. ఆమెయుఁ, బ్రభువువలెనే పరిజనము గూడ దాక్షిణ్యము గలిగియుంట కచ్చెరువడి యానీరు గొంపోయి తన మగని కిచ్చెను. అతఁడును గొంకుతో ముఖప్రక్షాళనము చేసి "ప్రేయసీ! కాశపుష్పపరాగమున వదనము సబాష్పమాతమయ్యె'నని చెప్పి తనలో "నిది క్రొత్తపెండ్లికూఁతురు. నిజము తెలిసిన దుఃఖించును. ఈతరుణి నైజముగా ధీరురాలే యైనను సామాన్యముగా స్త్రీహృదయము భయశీలము గదా? కావునఁ బ్రకృతవిషయమును గప్పిపుచ్చుట యుక్త' మని తలఁచెను. అంత విదూషకుఁడు "వయస్యా! మగధమహారాజుగారీశుభదినములలో నిచ్చలు నపరాహ్ణసమయమున నిన్ను ముందు గూర్చుండఁ బెట్టికొని బంధుమిత్రులకు దర్శన మిచ్చుట యుచితమైనయాచారమై యున్నది. గౌరవము ప్రతిగౌరవముచేఁ జక్కఁగ విలసిల్లి ప్రీతిని బుట్టించును గదా? కావున వేళ యగుచున్నది లెమ్మ'ని చెప్పిన, నతఁడు లోకములో

సత్కార్యములను సత్కారములను నాచరించువారిలెక్క మిక్కిలిగ నున్నది గాని వానితత్త్వ మెఱుఁగువారిసంఖ్య మాత్ర మరిదిగా నున్నది” యనుచు లేచెను. అంత నందఱు తమతమ నెలవుల కరిగిరి.

పిదప నొకనాఁడు మధురిక యనుచేటిక తొందరపడుచు వచ్చి 'పద్మావతి తలనొప్పిచే బాధపడుచుఁ గోటలోని కృతకసముద్రమునొద్ద నున్నమందిరములోఁ బరుండియుండె' ననెడివార్త వసంతకునిమూలమున వత్సరాజున కెఱిఁగింపఁ బద్మిని యనుపరిచారికను బంపి, చక్కనికథలు చెప్పి రాజపుత్రికి వినోదము గలిగించుటకై యవంతికను దీసికొనివచ్చుటకుఁ దాను వెడలె. పద్మినియు విదూషకుని వెదకుచుండ, నతఁడు 'అపురా! వాసవదత్తావియోగమున వికలమానసుఁడై నవత్సరాజునకుఁ బద్మావతీపాణిగ్రహణోత్సవ మత్యంత సుఖావహ మగుటచే మదనబాధ హెచ్చినది” అనుకొనుచుఁ బద్మిని కెదురువచ్చెను. అదియు దేవిశీర్షవేదనావృత్తాంతము తెలుప, నతఁడు “నీవు దేవికడ కేగుము. నేను రాజున కీయుదంతము తెలిపెద' నని చెప్పి దానిని బంపి తాను వెడలె.

ఆసమయమున వత్సరా జొకగదిలోఁ గూరుచుండి “అకటా! యౌదార్యధైర్యగాంభీర్యాదిగుణముల నవంతిభూపాలునకుఁ దగినకూఁతురై నవాసవదత్త మంచుపాల్పడిన తామరతీఁగవలె లావాణకంబున నగ్నిపా లయి నశించినపిదప మఱచిపోఁదగినంతకాలము గడపి మరలఁ గళత్రమును బరిగ్ర

హించితినిగాని దానిసుగుణములు మది నెడఁబాయకుండుటచే నత్తరుణి యిప్పటికిని స్మృతికి వచ్చుచునే యున్నది. ఆహా! ఏమి చేయుదును!" అనుచుఁ జింతించుచుండ, వసంతకుఁడువచ్చి "వయస్యా! తొందరపడకు తొందరపడకు. తెప్పిం తె'మ్మనెను. వాఁడు "మిత్రమా! యేమిటి కారణ'మన నతఁడు 'పద్మావతీదేవి శిరోవేదనచేఁ బీడ నొందుచు సముద్రగృహకములో శయనించియున్న'దని చెప్పెను. అంత నుదయనుఁడు 'అయ్యో! యెంత కష్టము! వాసవదత్తావిరహ ముల్లమును బెల్లగించుచున్నను, గుణవంతురాలు రూపవంతురాలు నగు కన్యను వరింపఁ బెండ్లాడుటచే నాశోకము కొంచెము మందగించి యున్నది. కాని, యీవార్త వినఁగానే దెబ్బ తిని యున్నవాఁడను గావునఁ బద్మావతికూడ దక్కే యగునేమో యని భయము పొడముచున్నది. పద పద పోయి చూచి వత్త'మని లేచి, యతఁడు మార్గదర్శిగా నచ్చటి కేగి పద్మావతి లేకుండుటఁ జూచి "వయస్యా! పఱచిన పక్క పఱచినట్లే యున్నది. నలఁగ లేదు. ప్రోగుపడలేదు. తలనొప్పి మందులు డాగు లైన లేవు. రోగము మీఁదనే దృష్టి నిలువకుండఁగా వేఱుగా నాకర్షించుట కగది యైనను చిత్రపటాదులు నలంకరింపఁబడలేదు. పోనీ! ఇంచుకసేపు శయనించి వెడలెనేమో యని యూహింతమన్న, జబ్బుతో నున్నవారు శయ్యనుఁ జేరి వెంటనే లేచిపోఁగలుగుదు రనుట కల్ల. కావున నాప్రేయసి యిక్కడికి రాలే దని యే తోఁచుచున్న" దని వచింప, వసం

తకుఁడు 'అట్లయిన నామొగాక నిరీక్షించుచు నీ వించుక సేపింపు శయనింపు' మనెను. రాజందుకు సమ్మతించి పరుండి "వయస్యా! నిద్ర బాధించుచున్నది. ఏదయిన నొకకథ చెప్పు' మన నతఁడు "ఉజ్జయిని యని యొకనగర మున్నది. అందు మంచిమంచి స్నానతీర్థము లున్నవి' యని యారంభించె. రాజు నవ్వి "ఉజ్జయినియే పొంకనదా? ఇదన్న నాకిష్టమే కాని, నాఁడుజ్జయినినుండి కౌశాంబికి బయలుదేఱి వచ్చునపుడు స్వజనపరిత్యాగమున దుఃఖించుచు నా భుజమ్ముమీఁదఁ గన్నీరు విడిచినయవంతి రాజతనయ స్మృతికి వచ్చునుగదా? మఱియు వీణాశిక్షాసమయంబుల నన్నుఁ జూచుచు ననురాగవశముననై మఱచి సారిక విడిచిపెట్టి పట్టిచేతితోనే యాకాశమున నా సుందరి వీణ వాయించుట జ్ఞప్తికి వచ్చునుగదా? యని విచారించుచున్నాను.'' అనఁగా నతఁడు, మఱియొక కథ చెప్పెదను. అనఁగా ననఁగా బ్రహ్మదత్త మను నొకపురము. అందుఁ గాంపిల్యనామకుఁడు రాజొకఁ డుండెను. అని యారంభించినంత, వత్సరాజు 'మూర్ఖా! రాజు పే రూరికి నూరి పేరు రాజునకుఁ బెట్టితి' వనెను. అంత నతఁడు "పేళ్ళు దిద్దికొని వల్లెవేసి చెప్పెద నుండు' మని యించుక గొణఁగుకొనుచుండునంతలో వానికి నిద్ర పట్టెను. అంత వసంతకుఁడు తాను నిద్రించుటయు నపుడు చక్కలి చలిగానుండుటయుఁ గని పెట్టి శాలువు తెచ్చుటకై వెడలెను.

పిమ్మట మధురిక, యవంతిక నక్కడికిఁ దీసికొని వచ్చి యాగదిలోఁ బ్రవేశపెట్టి తాను చలనొప్పిమందు దెచ్చుట కని వెడలిపోయెను. అవంతికయుఁ దనలో "అకటా! దైవ మెంత ప్రతికూలముగా నుండెఁ? విరహావేదనాపరిభూతుఁ డగు నార్యపుత్రునకు విశ్రమస్థాన మయిన యీమె గూడ నస్వస్థురా లయ్యె. ఇట్టిస్థితిలో నొక్కతె నైన నిందు లేదేమి? దీపము మాత్రము సహాయము గా నున్నది. ఈమెకు నిద్ర పట్టినది కాఁబోలు? కానీ! చూచెదను' అనుకొనుచు శయ్యపైఁ గూర్చుండి యుచ్ఛ్వాసనిశ్వాసములు సరిగా నుండుట విని జబ్బు మళ్ళినట్లు భావించి యామెప్రక్కను గూర్చుండుట యాహ్లాదకరముగా నున్న దని తలఁచి శయనములోఁ గొంత భాగము మిగిలియుండుట చూచి, ప్రియజనము తన్నుఁ గౌఁగి లించికొని పరుండుటకై యిట్లీమె విడిచి యుండు నని యూహించి యందుఁ బరుండెను. అంత నుదయనుఁడు 'హా! వాసవదత్తా!' యని పలవరించె. అది విని వాసవదత్త యులికి పడి లేచి 'అయ్యో! పద్మావతి గాదు. ఆర్యపుత్రుఁడే. ఔరా! నన్నితఁడు చూచెనేమో? అకటా! నన్నితఁడు చూచుటచే యౌగంధరాయణునిప్రతిజ్ఞాభారము నిష్ఫల మగునుగదా?' అని విచారించెను. మరల రాజు 'హా! అవంతి రాజపుత్రీ!' యని కలవరించెను. అది విని యవంతిక 'ఆఁ! కానీ! ఆర్యపుత్రుఁడు నిద్రించుచుఁ బలవరించుచున్నాఁడు. ఇక్కడ నెవ్వరు లేరు గదా? ఒక్కనిమిష మిం దుండి

నయనములకు మానసమునకు సంతోషము గలిగించికొనెదను' అనుకొనెను. తిరిగి యతఁడు 'హా ప్రియా! హా ప్రియశిష్యా! నాతో మాటలాడుము' అనఁగా నామె 'ఆర్యపుత్రా! మాటలాడుచున్నాను' అనెను. పదంపడి యట్లే వారిరువుర కీక్రింది సంభాషణము జరిగెను.

రాజు—కోపగించితివా?

వాస—లేదు లేదు. దుఃఖించితిని.

రాజు—కోపింపని చో నలంకరించికొన లేదేమి?

వాస—ఇంతకన్న నలంకరణ మేమి?

రాజు—విరచికను దలఁచుచుంటివా?

వాస—చాలుఁజాలు. ఇక్కడఁ గూడ నవ్వేశ్య కావలయునా?

రాజు—దానిపై రెత్తినందుకు క్షమింప నిన్ను బతిమాలెదను. అని చేతులు చాఁపును.

వాస—చాలసే పుంటిని. ఎవరయిన నన్నుఁ జూతురు. ఇఁకఁ బోయెదను. పక్క దాఁటి యీవలికి వచ్చిన యార్యపుత్రునిచేతులు పక్కమీఁదఁ బెట్టి పోయెదను. అని యట్లు చేసి వెడలెను.

అంత రాజు దిగ్గన లేచి 'వాసవదత్తా! ఉండు ముండు' మనుచు వేగముగా వచ్చునంత ద్వారబంధపుఁగమ్మి దగిలి నెత్తి బొప్పిగట్టఁ, దెలివి దెచ్చికొని వెనుక మరలి శయ్యపైఁ గూర్చుండి 'ఇది యథార్థమా? లేక స్వాప్నికమనోరథమా?'

యని తలంచుకొనుచునుండె. అంతలో విదూషకుఁ డరుదెంచి 'వయస్యా! లేచితివా?' యన, నతఁడు 'నీ కొక మంచిమాట చెప్పెదను. వాసవదత్త బ్రతికియున్న' దనెను. 'వాసవదత్త పోయి యెన్నాళ్ళాయెనది? ఆమె జీవించియుండు టేమి? నేను నమ్మ'నని యతఁడు నిషేధింప, రాజు 'కాదు. కాదు. నిజముగా బ్రతికి యున్నది. నన్ను నిద్రనుండి లేపి యిపుడే వెళ్ళినది. మున్ను నా ప్రియురాలు దహింపఁబడె నని రుమ ణ్వంతుఁడు నన్ను మోసముచేసె' నని మరలఁ బలుక, నతఁడు 'ఇది యసంభవము. ఒకవేళ నే నింతకు మున్ను చెప్పిన యుజ్జ యినిలోని స్నానతీర్థప్రసంగమును స్మరించుకొనుచు నిద్రింప నామె నీకుఁ గలలోఁ గనఁబడెనేమో?' యని పలికె. ఆమాట పై రాజు 'నిజముగా నది స్వప్నమే యైనయెడల నా కీమెల కువ రాకుండుటయే చక్కఁగా నుండునుగదా?— ఛీ! స్వప్న ము గాదు. ఒకవేళ నన్నుఁ జిరకాలమునుండి యాశ్రయించి యున్నచిత్తవిభ్రాంతియే యిట్లు పైకిఁ బొంగినదేమో?' యని సమాధానము చేసికొన, విదూషకుఁడు 'వయస్యా! ఈ యూరిలో నవంతిసుందరి యనుయక్షిణి గలదఁట. అది నీకుఁ గనఁబడెనేమో?' యని హేత్వంతరము చెప్పె. రాజామాట విని 'కాదు. కాదు. నేను మేల్కాంచిన వెంటనే మహాసాధ్వి మొగముఁ జూచితిని. తలవెండ్రుకలు మోముపై నిట్టట్టు చిక్కువడి యున్నవి. కన్నులకుఁ గాటుక లేదు. పోనీ! ఇం కొకటి చెప్పెద వినుము. నాకు మెలఁకువ వచ్చునని భయ

పసి కాంభోలు నాసతి క్రిందికి వ్రేలాడుచున్న నాచేతులు పట్టుకొని మెల్లగాఁ బఱిఘుమీఁదఁ బెట్టఁగా నప్పటిస్పర్శసుఖమునఁ గలిగినరోమాంచ మిప్పటికి నట్లే యున్నది చూడుము' అని బుజములు గనఁబఱిచిన, నతఁడు 'కానీ! యీవిచారము విడిచిపెట్టుము. చతుశ్శాలమునకుఁ బోవుదము ర'మ్మనెను.

అంత నొకకంచుకి వచ్చి 'రాజవర్యా! జయముజయము. మా దర్శకమహారాజుగారు మీ కిట్లు విన్నవింపు మని నన్నుఁ బంపిరి. మీయమాత్యవర్యుఁ డగురుమణ్వంతుఁడు ససైన్యముగా వచ్చెను. నేనును జతురంగబలమును సన్నద్ధము చేసితిని. శత్రువులలోఁ బరస్పరభేదము గల్పించితిని. నీప్రజల నందఱిని నీపైఁ గూరిమి యతిశయించునట్లు ఆడించితిని. మనదండువెనుక సంరక్షణమున కేర్పాటు గావించితిని. శత్రుమథనమునకుఁ గావలసినసాధనము లన్నియు సమకూర్చితిని. వేయేల? సేన లిప్పుడే గంగానదిని దాఁటినవి. ఆరుణిరాజుపై దండెత్తి రమ్ము. రమ్ము. వత్సరాజ్యము చేతికి వచ్చిన దని నమ్ము.'

ఆమాటలు విని వత్సరాజుత్సాహముతో లేచి 'యిదిగో నే నిప్పుడు రథగజతురగపదాతిసంకుల మగుమహారణరంగమునఁ గ్రూరకర్ముఁడై నయారుణిని నశింపఁజేసెద' ననుచు విదూషకునిఁ గూడి వెడలె.

ఒకనాఁ డుజ్జయినీప్రభువు లగుసంగారవతీమహాసేనులు యానతిని వసుంధరాభిఖ్య లనుధాత్రీకంచుకులు కౌశాంబి

కరుదెంచి రాజద్వారమున నిలిచి, మావార్తను వత్సరాజ్య పునస్సంపాదనాతిశయితోదయుఁ డగునుదయనమహారాజు నకుఁ దెల్పు'మని ప్రతీహారిని వేఁడికొనిన నది యిట్లనియె. 'రాజుగారిని జూడ నిది సమయము గాదు. ఏమనఁగా? మారాజుగారు పద్మావతీదేవిని గూడి ప్రాసాదముమీఁది యంతస్తు మీఁద నుండఁగా నెవఁడో యొకఁడు మేడముంగిటికి వచ్చి వీణ మీటెను. ఆధ్వని విని మాఱేఁడు ఘోషవతీనాదము విన వచ్చెనిదేమి యనుచు నీవలికి వచ్చి క్రిందికిఁ జూచి 'యీ వీణాధ్వనియెక్కడ' యనియె. అంత నాతఁడు 'దేవా! నర్మదా తీరమున దర్భలపొదలో నిది దొరకినది. ఇది పనికివచ్చునెడలఁ దీసికొనవచ్చు'నని చెప్పెను. దానిని బైకిఁదెప్పించుకొని తొడల మీఁద నిడికొని బాష్పపూరితనయనుఁడై మాభూపాలుఁడు మోహముతో 'అమ్మా! ఘోషవతీ! నీవు గనఁబడితివి గాని ప్రియురాలు గానరాదయ్యె'నని విచారించుచుండె. ఆయనయు నిపుడు క్రిందికి రాఁగలఁడు. రాఁగానే తెల్పెదను. అంతవఱకు నిం దుండుఁడు.'

అంత రాజు విదూషకునితోఁ బద్మావతీప్రాసాదము డిగి క్రిందియంతస్తులోనికి వచ్చి యాఘోషవతిని జూచుచుఁ బ్రియురాలిని దలఁచికొని విచారించె. అంత వసంతకుఁడు 'రాజా! యేల విచారించెదవు. చాలింపు'మన నతఁడు 'వయస్యా! నాప్రియురాలివిపంచికను జూచుటచే నింతదనుక మనమున దాఁగియున్న కామమిపుడు మేల్కాంచినది. ఏమి చేయుదును?

కానీ! దీనిని గొనిపోయి చిత్రకారునిచే రంగువేయించి బాగు
చేయించి క్రొత్తదానిని జేసి తీసికొనిరమ్మని యావీణ నిచ్చి
యతనిఁ బంపె. అప్పుడు ప్రతీహారి వచ్చి యాధాత్రీకంచుకుల
యుదంతము దెల్ప, నతఁడు పద్మావతిని రావించి తనయొద్దఁ
గూర్చుండఁ బెట్టుకొని యవార్తఁ జెప్పి, వారిని బిలిచికొని
వచ్చుటకుఁ బ్రతీహారిని బంపి 'దేవీ! నేను వారికన్య నపహరించి
తీసికొనివచ్చితిని గాని రక్షింపలేక పోయితిని. కావున వా
రేమి చెప్పి పంపిరో యని నాకు సంశయము గలుగుచున్న'దని
చెప్పుచుండ, నవ్వసుంధరతో రైభ్యుఁడు వచ్చుచు 'ఆహా!
మహారాజుగారి యల్లుని రాజధానికి వచ్చుటచే మహాసంతోష
మును మారాజపుత్రిమరణమును దలఁచికొనుటచే మహావిషా
దము నొక్కమా ఉదయించుచున్నవి. ఓ భాగధేయమా!
పరాపహృతమైనరాజ్యముతో నప్పరమసాధ్వికుశలస్థితి గూడ
సంభవించెనేని నీ వేమిమహోపకారము గావించినదానవు కా
వు?' అని తలఁచుచు, రాజును సమీపించి 'జయము జయ
మనుచు నెదుర నిలిచె. రాజును సబహుమానముగాఁ బలుక
రించి 'ఆర్యా! క్షోణిమీఁది యెల్లరాజులకు రాజై యుదయా
స్తమయములకు రాజైన మహాయుజ్జయినీరాజు నాయనుఁగుఁ
జుట్టము కుశలముగా నుండెనా?' యని ప్రశ్నించి, 'యాతఁ
డెల్లరకుఁ గుశలము. కుశలియై యామహాసేనరాజు మీకుశల
మడిగె.'నని చెప్పినంత, లేచి 'ఆర్యా! మహాసేనరా జేమి
యాజ్ఞాపించె'నని యడిగి కూర్చుండె. అంతఁ గంచుకి యానం

దించి 'రాజా! వైదేహీపుత్రుఁడ వయినందుకుఁ దగిన మర్యాద గావించితివి. మా రాజు పంపిన సందేశము వినుము. 'కాతరులు నశక్తులు నగువారి కుత్సాహము పుట్టదు. రాజ్యలక్ష్మి యుత్సాహవంతులసొమ్ము. కావున నీవు ధైర్యోత్సాహములతో శత్రువుల జయించి మరల రాజ్యమును గైకొనినందు కానందము!' అన్నమాట విని యుదయనుఁడు 'ఆర్యా! ఇదంతయుఁ బ్రద్యోతరాజు ప్రభావమే కాని నాదిగాదు. చిన్నతనమున నన్నుఁ దీసికొనిపోయి తనపుత్రులతో సమముగాఁ బెంచె. నేనాతని కన్య నపహరించి తెచ్చి సంరక్షింపలేక పోయినను నాయందాయన స్వీయవాత్సల్యము నుంచె. కావున నారాజ్యము మరల వచ్చుట కతఁడే కారణ మని నాయభిప్రాయ' మనెను. అంతఁ గంచుకి 'ఆర్యా! మామహాదేవిగారిసందేశముగూడ విను' మన నతఁడు 'మహాభాగ్యము. పదునార్గురు రాజభార్యలలోఁ బెద్దదియు, బుణ్యాత్మురాలును నాదుఃఖమున దుఃఖించునదియునైన మాతల్లి కుశలినియే కదా?' యనెను. అంత ధాత్రి 'దేవా! మాయమ్మగారిసందేశము వినుము' అని యిట్లు విన్నవించె. "కుమారా! వాసవదత్త కాలధర్మము నొందినది గదా? మాకు గోపాలకపాలకు లెట్లో నీవు గూడ నట్లే. నిన్నల్లునిఁగాఁ గోరియే యుజ్జయినికిఁ దీసికొని వచ్చితిమి. వీణావ్యాజమున నగ్నిసాక్షికముగా మాతనయను నీకొసఁగితిమి. నీవు బాల్యచాపలమునఁ బరిణయోత్సవము జరిగింపకుండఁగనే మాసుతను దీసికొని పోయితివి. పిదప మీయిరువురిరూపము

లను ప్రత్రింపఁజేసి మీ కిందుఁ బెండ్లి గావించితిమి. ఆచిత్రఫలకము నీయొద్దకుఁ బంపితిని. దానిఁజూచికొని యానందింపుము'. ఆ మెమాటలు విని దుఃఖపరవశుఁడై వత్సరాజు విచారింపఁ, గంచుకి 'రాజా! విచారింపఁ బని లేదు. కాలమానసన్న మనువారిని రక్షింప నెవరితరము! తాను పోగి నూతిలోఁ బడుచున్నకడన నెవఁడైనఁ బట్టికొనఁగలఁడా? అడవిలోని చెట్లవలె మానవులును అనాద్యకాలంబుగఁ బుట్టుటయుఁ గిట్టుటయు సహజధర్మము' అని యూరడించెను. రాజును 'ప్రద్యోతునికూఁతురు నాకు శిష్యురాలు ప్రియురాలు నైన వాసవదత్త, జన్మాంతరమునందు మఱల నాకుఁ బ్రియురాలుగ వచ్చునా' యనుచు నెట్లకేలకు దుఃఖము నిగ్రహించెను. అటుపిదప ధాత్రేయియుఁ గొన్ని యుపశమనవాక్యములు చెప్పి చిత్రఫలక మిచ్చినంతఁ, బద్మావతి దాని జూచి 'ఆర్యపుత్రా! యీ ప్రతికృతి యార్యపుత్రా యనుయవంతికను పోలియుండలేదా?' యని యడిగెను. వత్సరాజు ఆమాటవిని 'ఆ ధాత్రియే యిది' యనవచ్చునని చెప్పి దుఃఖమున 'సఖా వసంతకా! ఈమృదు కాంతికి దారుణమైనవిపత్తి యెట్లు కలిగెనో కదా! ఆపాపకుఁ డీముఖలావణ్యము నెట్లు దహింపఁ జాలెనో? హా వాసవదత్తా!' యని కంట నీరు వెట్టె. పద్మావతియు నీమహాకృతి మార్యపుత్రుని యాకృతి కెంతయుఁ బోలియున్న దనుచుఁ బరిశీలించి చెప్పెను. దానిపై వత్సరాజు 'నీ చిత్రమువుఁ జూచి నంతసముతోఁ బొందుచున్న యింటి వేసుని యడుగ

నామె 'అవును. ఈప్రతికృతి కీడుజో డయినకాంత నాయొద్ద నున్నది. నేను గన్నెగా నున్నపుడే యొకబ్రాహ్మణుఁ డామెను దీసికొని వచ్చి 'యీమె నాచెల్లెలు ప్రోషితభర్తృక. భర్త వచ్చునంతకు నీమెను నీయొద్ద నుండనిమ్ము' అనుచు నా కప్పగించె. ఆమె పరపురుషదర్శనమును సహింపదు. ఆమె నాతో వచ్చి యిక్కడనే యున్నది. ఎట్లో నచ్చఁ జెప్పి యామెను జూపెదను జూడు' మనెను. ఆమాటపై నతఁడు 'బ్రాహ్మణసోదరి యనుటచే నామె మఱియొక్కవనిత' యని విదిత మగుచున్నది. లోకములో రూపసాదృశ్యము లేక పోలేదు' అనుచుండఁ బ్రతీహారి వచ్చి 'దేవా! ఉజ్జయినీ నివాసుఁ డగువిప్రుఁడు తాను మున్ను దేవిగారికడ నుంచిన తనసోదరిని దీసికొని వెళ్లుటకై వచ్చితి నని చెప్పుచు ద్వారము కడ నిలిచియున్నాఁ' డని చెప్పెను. 'ఆమహీసురుఁడు వచ్చి నాఁడు గాఁబోలు' నని దేవి పలుకఁ, దీసికొని రమ్మని రాజు ప్రతీహారిని బంపె. అవంతికను దీసికొని వచ్చుటకై పద్మా వతియు వెడలెను. అంత యౌగంధరాయణుఁడు తనలో 'నాచేని మేలుకొఱకుఁ బట్టమహిషిని దాఁచితిని. తలఁచిన కార్యము నెఱవేఱినది. కాని, యితఁ డీ విషయమున నే మనునో యని చిత్తము తత్తఱపడుచున్న' దనుకొనుచు వచ్చి మహారాజా! జయము జయ మని కూర్చుండెను. 'ఈకంఠస్వరము మున్ను విన్నదిగా నున్న' దనుకొని

భూపతియు నాతనితో నవంతికాన్యాసవృత్తాంతము మాటలాడుచుండె.

పిదపఁ బద్మావతి నీయన్న వచ్చినాఁడని చెప్పి యవంతిక నచ్చటికిఁ దీసికొని వచ్చి 'ఆర్యపుత్రా! ఇదిగో నాకడ నున్న న్యాసము' అనెను. 'వసుంధరారైభ్యులు సాక్షులుగా నీబ్రాహ్మణునకు నర్పింపు' మని రాజనెను. ఆమెయు నట్లొసఁగినపిదప, వసుంధర 'ఆహా! మా రాజపుత్రియే' యనెను. రాజు 'ఎట్టెట్టూ! మహాసేనకుమారియా? దేవీ! పద్మావతిని గూడి యభ్యంతరగృహమున కరుగు' మన, యౌగంధరాయణుఁడు 'అట్లు కూడదు. ఈమె నాభగిని గదా!' యనెను. 'ఏ మట్లనెదవు? ఈసతి ప్రద్యోతతనయ గదా!' యని మరలఁ బలుక, నతఁడు 'రాజా! నీవు భారతవంశమునఁ బుట్టినవాఁడవు. వినీతుఁడవు జ్ఞానివి! శుచివి! రాజధర్మమునకు దేశికుఁడవు. 'నీ విట్లు బలాత్కరించి నాచెల్లెలి నపహరించుట తగ'దని యెత్తి పలికెను. అంతట యౌగంధరాయణుఁడు 'తెరచీర దీసి సహోదరీరూపసాదృశ్యము పరీక్షించెద' నన, నవంతిక 'ఆర్యపుత్రా! జయము' అనుచు మేలిముసుఁగు దొలఁగించెను. ఆ వత్సరాజును బరమాశ్చర్యానందములతో 'ఈ రమణి నామనోహారిణియే. ఇప్పు డితఁడు నామంత్రి యగు యౌగంధరాయణుఁడే. ఆహా! ఇది సత్యమే కదా? లేక స్వప్నమా? అపుడు గూడ నీసుందరియే కనఁబడెను గాని మోసపోయితిని' అనుచుఁ గలవరపడ, నయ్యమాత్యుఁడు 'స్వామీ! దేవిని

[illegible] రాజ్యము [illegible] క్షమింపు' మని ప్రార్థిం
చెను. [illegible]! నీవు యథార్థ[illegible]
[illegible]! [illegible] [illegible]మును
నాలోచించి యున్నట్లుండె వదియు యుక్తప్రవర్తనుండ వయ్యు
నా [illegible]లో [illegible] కష్టము [illegible] లేక [illegible]
డవు నీవు గావా? సందేహ మేమి?' యని ప్రశంసింప, సత్యం
'[illegible]త్తమా! నీభాగ్యములు సమగమించువారము గాని
వేఱు గాదు' అని నిరహంకారతం జూపె. అంతం బద్మావతి
వాసవదత్తకు మ్రొక్కి 'ఆర్యా! నిన్నుం బరిచారికలను బోలి
చూచి యుపచార మొనర్చితిని మన్నింపు' మని వేడికొనెను.
ఆమెయు 'సోదరీ! అది నీ తప్పు గాదు. అర్థినినై వచ్చుటచే
నా సొమ్మయిన నీశరీరమునకుం జేయందగిన యుపచారము
చేసితిని. అందుకు నీవు వగవం బని లేదు' అన, నామె ప్రస
న్నురా లయ్యె. రాజమంత్రిపత్న్యు [illegible]ముగా మాటలాడిరి.

రాజు—అపూర్వ త్వ్యా! దేవిని దాచియుంచుటకు నీయభి
ప్రాయ మేమి?

మంత్రి—పుష్పకభద్రాదిదైవజ్ఞులు పద్మావతి స్వామికి
దేవి గాంగల దని చెప్పిరి. దన్నిక బాంధవ్యమునం గలుగు
లాభము దెలిసియే యున్నది గదా?

రాజు—ఈవృత్తాంతము [illegible] దెలియుంగునా?

మంత్రి—అతం డెఱుంగడే గాదు. స్వామిహితము
గోరువా[illegible] తెలియుంగదుగ.

రాజు—ఓరా! రుమణ్వంతుఁ డెంతటిరాతిగుండె వాఁడు? నాకు దేవీక్షేమవార్త యించుక యైనఁ దెలియనీయ లేదుగదా?

మంత్రి—స్వామీ! ఇఁక గతించినవృత్తాంత మేల? దేవికుశలవార్త నెఱిఁగించుటకై శీఘ్రముగా వసుంధరా రైభ్యులను బంపుట మంచిది.

రాజు—అట్లు గాదు. రాణిని బద్మావతిని గూడఁ దీసికొని మనమే పోవుదము.

మంత్రి—ఇది యత్యుత్తమము.

అంత యథోక్తముగా వత్సరాజు జాయాద్వయసమేతుఁ డుజ్జయిని కేగి ఆప్తబంధువర్గమును గాంచి కౌశాంబికి వచ్చి ప్రజారంజకుఁడై పరిపాలించుచు దేవేరులతో సుఖముగా నుండె.

---

## ౬. అవిమారకము

కుంతిభోజుఁ డను రాజు శత్రువుల నణఁచి ప్రజానురాగము సంపాదించియుఁ దనకూఁతునకుఁ దగినవరుఁడు లభింపమికి మిక్కిలి మనోవేదనఁ జెందుచు, నొకనాఁడు సేవాగృహమున నుండి తనరాణిని రావించి యామెతోఁ ముచ్చటలాడుచు “దేవీ! తొంటికంటె నేఁడు నీముఖపద్మము సుప్రసన్నమై

యున్న దేమి?' యని యడుగ, నామె 'కుమారునకై రాజకన్యా దూతను బంపి యుంటిరి గదా! శ్రమమునకేమున కల్లుడు రాఁగలఁడని యానందించుచున్నదాన' నని నుడివె. అందుకు రాజు 'ప్రేయసీ! సత్యమే కాని వివాహములు మిక్కిలి చక్కఁగా నాలోచించి చేయఁదగినవి సుమీ! ధనము, వరుని కుండఁదగిన సర్వవిధసుగుణసంపత్తి నాలోచింపక త్వరపడి మనయభిలాషమును బట్టి పెండ్లి గావించితి మేని వివాహ, క్షుబ్ధజల యగునది కూలద్వయమునట్లు క్షుబ్ధచిత్త యగుకన్య కులద్వయమును జెఱచును.' అని చెప్పుచుండ ద్వారపాలుఁ డరుగుదెంచి 'దేవా! మంత్రిపుంగవుఁడు వచ్చుచుండె,' నని చెప్పి వెడలె.

అంతఁ గౌంజాయనుఁడు 'పరిపాలనము చక్కఁగా నున్న మొదల రాజు సమర్థుఁ డందురు. అందే యయిన లోపము గలిగెనా, మంత్రి యసమర్థుఁ డందురు. ఇట్లని తనకుఁ దెలిసెనా, యతఁడు సచివుల శిక్షింపఁ బూనును. ఆహా! యెట్టి యున నమాత్యపదవి దోషభూయిష్ఠమే కదా!' యనుకొనుచు వచ్చి 'రాజేంద్రా! దేవి యానతిని శిరసా వహించి భర్తృదారికతోఁ గూడ నుద్యానమునకుఁ బోయినది. అచట సుఖముగాఁ జెలికత్తెలతోఁ గురంగి క్రీడించి యుంటిని నిలుచుండ, మావటీనిఁ గ్రిందఁ బడవైచి నుడిగాలి వచ్చినట్లుగా మదధారాదూషితానన మగు నొకమదపుటేనుఁగు ఘట్టముగాఁ బరుగెత్తికొని వచ్చె. దానిని జూచి హాహాకారములతో స్త్రీలు

భయపడుచుండ, నది దేవరకన్నె దాపునకు వచ్చె. అంతకు కొక్క నిమిషము ముందుగా నీతిగుప్తునితోఁ బ్రమదారామోపకరణములఁ బరీక్షింపఁ బోయిన నేనును వేవేగ యక్కడికి నడలునంతలో దర్శనీయుఁడు తరుణవయస్కుఁడు దృఢగాత్రుఁడు సాహసికుఁడు నగునొకపురుషుఁ డెవఁడో యాగజము న నిష్ఠుపడి దాని నఱచేతులఁ గట్టిగాఁ జఱచి తొలఁగించి మన కురంగిని గాపాడె. ఆకరియును రాజదారికను విడిచి తన్నుఁ గొట్టినకోపమున నప్పురుషుని జంప నుంకించి వెంబడించె. అంత నామెను సుఖముగాఁ గన్యాంతఃపురమునకుఁ జేర్చితిని.' అని విన్నవింప, రాజు 'ఆహా! మహాప్రమాదమే తప్పినది. కుమారికను గాపాడిన యా మహాపురుషునిఋణము మనము తీర్పఁ జాల' మనియె. దేవియు 'యిప్పటికిఁ బ్రాణములు మరలఁ జేరినవి. ఎంతగండము తప్పినది' అని విస్మయపడెను. అంత భూవరుఁడు 'సరియే కాని భూతికుఁ డేఁడీ'? యని యడుగ, మంత్రి 'గజమును మరలించిన పురుషునివృత్తాంత మరసి వచ్చుటకై నడచె' నని చెప్పెను. అంతఁ 'బరదుఃఖసహాయుఁ డగునతఁ డేకులమువాఁ' డని రాజడుగ, 'సంత్యజకులజాతుఁ డేమో యని తోఁచుచున్న'దని యతఁడనె. 'నీచకులునకట్టి కనికర ముండునా? యని దేవి యన 'నదిసందిగ్ధవిషయమే' యని రాజనెను.

వీరిట్లు మాటలాడుకొనుచుండ, భూతికుఁడు 'ఆహా! ఈపురుషునియసమానపరాక్రమముచే మనుష్యులపరాక్రమబుద్ధు

లు మందగించినవి గదా! కాని యితఁడు తనకులగోత్రముల నేల మఱుఁగుపఱిచికొని యిట్లుండెనో యని యనుమానించుచున్నాఁడ. అయిన నేమి? దివాకరుని నఱచేతితోఁ గప్పుట శక్యమగునా? అనతిక్రమణీయము లయిన స్వీయ హేతువులనో మహాత్ముల శాపములనో లేక పెద్దలయానతినో లోకములో నిట్లు ప్రచ్ఛన్ను లయినసత్పురుషు లనేకు లుందురు. కాని యట్టివారు పరులకష్టములఁ జూచి యోర్వఁ జాలక తమయునికిని మఱచి బయల్పడుట యను పెంపు సంభవింపును' అని యాలోచించుకొనుచు రాజసన్నిధి కరుదెంచె. అంత దేవియు రాజానుమతి నభ్యంతరమందిరమున కేగె. పిదప నప్పరోపకారశీలునివృత్తమును మాళవేశ్వరుఁ డడుగ, భూమీశుఁడు 'అయ్యా! ఏమి చెప్పుదును? ఆబలశాలి యొక్కముహూర్త కాలము మెల్లగా స్నేహితునితో వలె నయ్యిభముతోఁ గ్రీడించి దాని నిట్టట్టు త్రిప్పి మారాడించి తనపనికిఁ దానే లజ్జించి తల వంచికొని తనయింటికిఁ జనెను. నేనును కరేణువులఁ బంపి యాగంధగజమును మెల్లగా గజశాలకు రావించి కట్టివేయించి, నాతనియుదంతముఁ దెలిసికొన నేదోయొకనెపము బెట్టికొని పోయితిని' అని విన్నవించె. అంత, భూపతి 'వాతఁడు చండాలుఁడా?' యన భూమీశుఁడు 'శివశివ! ఎంతమాట? అతఁడు మఱుఁగుపడి యుండినయొకయున్నతజాతిపురుషరత్న మనుట నిక్కము. ఆతనిరూపమూ, దివ్యమైనది. వాక్కు, మృదుమధురమై బ్రాహ్మణజాతికిఁ దగి యున్నది.

తేజోబలములా, నిరుపమానములై క్షత్రియజాతికిఁ దగియున్న వి. ఇవన్నియుఁ గలుగు నయ్యవిమారకుఁ డంత్యజాతివాఁ డందు మేని మనకు శాస్త్రాభ్యసనక్లేశము వ్యర్థమే యని నాయభిప్రాయము.' అని నిస్సంశయముగ విశదీకరించె. పదంపడి రా జాతనికిఁ బెండ్లి యయినదా యన లేదని బదులిడి యాతనితండ్రి నేల పరీక్షింపలే దని మరల నడిగినంత, భూతి కుఁడు 'దేవా! చూచితిని. విశాలోరస్కుఁడు నున్నతాంసుఁడు ధనుర్గుణకిణాంకితప్రకోష్ఠుఁడు ననుభావసూచితరాజభావుఁడు నయినయాతఁడు మబ్బుచాటున నున్న వేవెలుఁగుమాడ్కిఁ బ్రచ్ఛన్నుఁడై కానవచ్చె' నని చెప్ప, నతఁడిఁకఁజాలు. మరల నొక్కమా రాతనిఁ బరీక్షింపఁ దగి యున్న' దని చెప్పి, కాశీ రాజుదూతకుఁ జెప్పఁ దగిన దేమని యడిగె. అంత నాసచి వుఁడు 'రాజా! దూత లెంతలో వచ్చుచుఁ బోవుచుందురు. అందుకుఁ జెప్పఁదగిన దేమున్నది? కన్యాపితృత్వము బహుజన వందనీయము. మల్లవీరులు జయపతాకంబోలి రాజులు రాజకన్యను గోరుట సాజము. దీని కంత చింత యేల? సుగు ణసంపదను సత్కులమును దలిస్థితిగతులను విచారించి తదయుక యుద్దిష్టకార్యంబు నేఱవేర్చికొనుట ప్రాజ్ఞధర్మ మని శాస్త్ర ము నిర్ణయించుచున్నద న, రాజు 'భూతికా! చక్కఁగఁ జెప్పి తివి. 'మంత్రివరా! ఊరక యుంటివేమి? నీ యభిప్రాయ మే' మని యడిగె. దానికై కౌంజాయనుఁడు 'స్వామీ! పూర్వసం బంధపరిచితులై నసౌవీరనరపతియుఁ గాశిరాజును గూడ

నీకు భ్రాతృకులు నాప్తబంధువులు నగుట సంబంధయోగ్యులని నీవు తలఁచుచుందువు. సౌవీరరాజు మున్నొకతఁడెఁ దన పుత్రునకు నీకన్నె నిమ్మని దూత నంప, మాపిల్ల వయసునఁ జిన్నది యని యప్పుడు సమాధానము చెప్పి పంపితివి. ఇప్పుడు కాశీరాజట్లే దూత నంపె. ఇందలి మంచిచెడ్డ లరయ దేవరయే ప్రమాణ' మనెను. మంత్రిమాట బాగుగానే యున్నది గాని యీ రెండుసంబంధములలో నేది మంచి'దని మఱల భూతికు నడుగ, నతఁడు 'దేవరమంత్రులకు రాజు లెల్లరు ప్రభువులే. వారు నిరసింపఁ దగరని మిన్నకుండె. అంత నరేంద్రుఁడు 'సరియే ఈ మర్యాదల కేమి గాని నీ నిశ్చయమే' మని వెండియు నడుగ, నతఁడు 'సౌవీరకాశీరాజు లిరువురు నీకు భగినీపతు లగుటచే సమానులే; కాని రాణిగారికి సోదరుఁ డగుటచే సౌవీరపతి గుణాధికుఁ డని యూహించెద'ననెను. 'సౌవీరరాజు మరల దూత నంపక పోవుటకుఁ గారణ మేమో?' యని రాజు పలుక, భూతికుఁడు 'చక్కఁగాఁ దెలిసికొని కాని చెప్పరా దని యూరకుంటిని. కాని నాకావిషయమున నొకసంశయము గలదు. పుత్రునితోఁ గూడ నాతఁడు నగరమునఁ గానవచ్చుట లేదనియు నెందుండిరో యెవరికిని దెలియవచ్చుట లేదనియు నాతనిమంత్రులే రాజ్యకార్యములు నిర్వర్తించుచుండి రనియు గూఢపురుషుల వలన వింటి'ననెను. అంత రాజు 'నా కాలోచింపఁగా నిట్లు తోఁచినది. కామాతురుఁడై దుష్టసచివులతో నెందేని పోయి

యుండును. లేదా, ప్రవాసమున రోగపడి యెందైన బంధు గృహముల నివసించియుండును. లేదా, తపోధనులచే శపింపఁబడి యెక్కడనైన దానిశాంతికై పడియుండును. ఇంతకుఁ దక్క నాతఁడు గానరామికిఁ గతం బనగతంబు గా కున్నది. ఇందలినిజ మేమో శీఘ్రముగాఁ దెలిసికొనవలయు' ననిన, భూతికుఁడు 'చిత్త'మనెను. అంత సురల రాజు 'కొంజాయనా! కాశిరాజు దూతకుఁ జెప్పఁ దగినదేమి' యని యడుగ, నతఁడు 'ఇట్టియెడఁ గాశిరాజు దూత గౌరవింపఁదగినవాఁడే' యని బదు లిచ్చె. అంత రాజు 'ఆహా! అమాత్యులు కార్యమునే యపేక్షింతురు గాని స్నేహమును గోర' రనుచుండ, 'స్వామీ! పదిగడియలప్రొద్దెక్కినది' యని వినఁబడె. అది విని భూతికుఁడు 'రాజా! స్నానసమయ మతిక్రమించుచున్నది. తక్కిన విషయ మంతర్గృహమున నాలోచించికొందము. కురంగి నూఱడింపవలయును. దేవియుఁ బ్రతీక్షించుచుండును. ఎందఱో పెద్ద లీయుపద్రవము విని దేవరను జూడ వత్తురు. కావున లేచుట మంచి'దన, నతఁడును లేచి 'అవురా! రాజ్య మొక పెద్దబరువు. ధర్మమును సంరక్షించుకొనవలయును. మంత్రుల మతిని జక్కఁగాఁ బరిశీలింపవలయు. రాగద్వేషముల లోన నణఁచికొని కాలానుగుణముగా వానిని మృదువుగాను బరుషముగాను గూడ వినియోగింపవలయును. లోకరహస్యము తెలుఁగవలెను. చారనేత్రముల రాష్ట్ర మంతయుఁ గనుఁగొనవలెను. అతిప్రయత్నమున నాత్మరక్షణ మొనరించి

కొనవలయును. రణరంగమున శరీరేచ్ఛ విడువవలయును. ఇన్ని లక్షణములు గల మహాభారము వహింపలేవు గదా' యని కొనుచు సామాత్యుఁడై చనియె.

ఇది యిట్లుండఁగా నాఁడుద్యానమున మాతంగబాధను దొలఁగించిన దాదిగాఁ బరమసాహసోదారుఁ డగు నవిమారకుఁడు కురంగినే ధ్యానించుచు నిద్రాహారములు విడిచి కామపరవశుఁడై కృశించి పగలు శోకమును రేయి మోహమునఁ గుందుచు, దానిరూపయౌవనలావణ్యములు స్మరించికొని యానందించుచు, సహాయునకును నిరాశఁ జెంది యంత నొందుచుఁ దనశోకాంతమును దనరహస్యస్థితియు మఱచి కురంగీలాభము నభిలషించుచుఁ గుంతిభోజపుర బాహ్యప్రదేశమందలి తనవాలుగిండ్లబసంతిలో నొకగదిలోఁ గూరుచుండెను.

అత్తఱి నాగరిచింతను వచ్చినయొకధాత్రి 'అయ్యో! ఎంత చిక్కయినపని వచ్చినది! ఇట్లు చేయుదునా, రాజకులము కలంకిత మగును. చేయకుందునా, రాజపుత్రి విపత్తి నొందును. ఆమె ననేకోపాయముల నడిగి చూచితిని. ఆకన్నె తనహృదయము నాకడఁ గూడ దాఁచుచున్నది. ఎంత దాఁచిన నేమి? తెలియనే తెలియుచున్నది. నాఁటి కుసుమారామవిహారము మొదలుగాఁ బొడవులు పొడిగికొనదు. భోజనము నుద్వగింపదు. ముచ్చట లాడదు. నిట్టూర్పు పుచ్చుచుండును. సంబంధము లేకుండ మాటలాడును. చెప్పిన దెఱుఁగదు. చాలునన నవ్వును. ఒంటిగా నుండి యేడ్చును. రోగ మని చెప్పను. చిక్కి

పోయినది. తెల్లబడినది. కాని, యొకటిమాత్రము మాశ్చర్యము. ఇట్టివేళలోఁ గూడ సిగ్గుననో భయముననో కులాభిమానముననో చిన్నతనముననో చెలికత్తెలలో నొక్కతెకును నన హృదయ మెఱిఁగింపదు' అని పలికి, దానికి వచ్చిన నలినిక యను నింకొకపరిచారిక 'చెప్ప కేమి? నాకంతయుఁ జెప్పుచున్నదనెను. అంత ధాత్రి ఏమి చెప్పినది? అవస్థనుబట్టి యామె కీతనిపైఁ గోరిక గలదని నీ వూహించితి వేమో' యన, నప్పుడంతి 'తక్కేమి? అందు 'తండు తగఁడా?' యనెను. 'అదియే నాకును సందేహము. కాని, యాతఁడు కాంతాంతరమునఁ బ్రచ్ఛన్నుఁడయ్యెను గాని నీచకులజాతుఁడు గాఁడని విని యుంటిని' అని చెప్పుచుండఁ బ్రక్కనుండి 'కులహీనులకు సంపద చక్కఁదనము తెలివి బలము గలుగవచ్చును గాని సత్ప్రవర్తనముమాత్రము గలుగఁబోదు. నిక్కముగా నీవే యితఁడు సత్కులీనుఁడని వినఁగలవు. కావునఁ గులశంక విడిచి సుఖముగాఁ గార్యము సాధింపుము' అని వినవచ్చెను. ఆమాటలు విని ధాత్రి యిరుచక్కులు పరికించి యెవ్వరును గానరామిక వగచి 'అయ్యో! నామేను గగురుపొడుచుచున్నది. ఇది యమాకాశవాణిమాట గాని మానవుని పలుకా' దన, నలినిక 'మన కిఁక జాగుసేయ నక్కఱఁ బని లేదు. మనమాట యితఁడు వినునా వినఁడా యని సంశయము. కాని మనభర్తృదారికను జూచినచోఁ గాముదేవుఁడు గూడఁ గామబాధితుఁ డగు నన, నితఁడు పాపమటులఁ గాకపోవునా?' యనెను. అంత నిపుణిక యవిమార

కుని గదిగుమ్మము చెంత కరిగి యాతని ప్రలాపము విని మనసు యూహా నిజమే యనుకొనుచు లోనికిఁ జని 'ఆర్యా! సుఖమా?' యని యడిగిరి. 'మీదర్శనమునఁ గలుగఁ గల' దని యతఁ డనిసంత వారికిం క్రిందిసంభాషణము జరిగెను.

ధాత్రి—ఏమి చింతించుచుంటివి?

అవి—యోగశాస్త్రము.

ధాత్రి—శుభవచనము పలికితివి. యోగశాస్త్రమే యగుఁ గాక!

అవి—నీ యభిప్రాయ మేమి?

ధాత్రి—మేమును యోగమును గోరియే వచ్చితిమి. మా రాజగృహమునఁ గూడ నొక్కరు మిక్కిలి యోగచింత చేయువారు గలరు. వారితో మీ రక్కడనే యోగాభ్యాసము చేయుదురుగాక యని మా ప్రార్థన.

అవి—నా ప్రాణము నా కిచ్చితివి.

ధాత్రి—నేఁడే కన్యాంతఃపురమును ప్రవేశింపవచ్చును. కన్యాపురరక్షకుఁ డగుభూతికుఁడు కాశీరాజదూతతోఁ గూడ వెడలెను.

అవి—తగినసమందు దొరకినపు డేయోగి యుపేక్షించును?

ధాత్రి—అంతిపురము చొచ్చుటయే దుర్లభము గాని ప్రవేశించినపిదపఁ జిరకాలము నివసింపవచ్చును.

అవి.—మార్గమున కభ్యంతరములు లేకుండఁ జేయుఁడు.

ధాత్రి.—లోపలఁ జేయఁదగినది చేసెదము. అప్రమత్తుఁడవై ప్రవేశింపుము. అని మార్గము తెలిపెను.

అవి.—ఇందు నాకు నమ్మిక యేమి?

ధాత్రి.—నామాటయే నమ్మికము—అని చెప్పి సెలవు గైకొని నళినికతో రాజగృహమున కేగెను.

అంత నవిమారకుఁడు కురంగీప్రాసాదమునకుఁ బోవుటను గూర్చి విచారించికొనుచుండఁగాఁ జీకటి పడెను. పగలంతయు నగరవిహారము సలిపి రాత్రి యవిమారకునకు సహాయుఁడుగా నుండుటకై విదూషకుఁడును వచ్చెను. వానితోఁ గొంత ముచ్చటించి తా నా రాత్రి రాజకన్యాగృహమునకుఁ బోఁ దలఁచుచుండ రాజపుత్రుఁడు చెప్పినపిదప 'వయస్యా! కుంతిభోజుని మంత్రు లసాధ్యులు; నీ వం దేగి ప్రాణములతో మరల రాఁగలవా?' యని విదూషకుఁడు భయపెట్టెను. అందు కాతఁడు 'ఛీ! నన్ను నూరక నటుల నెంచెదవా? ఎందఱు శత్రువులు నా కరవాలపు దెబ్బలో మడిసిరి? మానవు లనుమాట యటుండనిమ్ము. అదికాక ధాత్రి యుద్యానవనమున బాహుబలముతో నొక్కనినే నోర్చినవాఁడను గానా? నన్నెదిరింపఁగల వారెవరు?' అనఁగా నతఁడు 'నిజమే కాని, రాత్రివేళఁ బరగృహము చొచ్చుట ప్రమాదకర మని తలఁచుచున్నాఁడ' ననెను. దాని కాతఁ 'డేమయినఁ గానిమ్ము. ఈనడికిరేయి కురంగీగృహ

ములోఁ బ్రవేశించి తీరెదను' అని శపథము చేయఁగా 'నట్లయిన నేను గూడ వచ్చెద' నని విదూషకుఁ డనెను. దానికి రాజకుమారుఁడు సమ్మతింపక 'పరగృహమున కొక్కఁడు పోవలయును. ఆలోచన మిద్దఱు చేయవలయును. అనేకులు యుద్ధమునకుఁ జనవలెను. ఇది శాస్త్రనిర్ణయము. కావున నేనొక్కఁడనే పోయెదను. కుంతిభోజగృహమును బ్రవేశింప నాకు నాభుజములే సహాయము లైనపరమాయుధములు గాఁగలవు. నీవు శంకింపకు మని యాతని సమ్మతిపఱిచి భోజనాది క్రియలు గావించి యతనితో నగరమునకేగి కొంతసేపు వాని మిత్రుని యింట నుండి యర్ధరాత్రసమయమును బ్రతీక్షించుచుండె.

ఆరాత్రి కురంగి తనమేడమీఁదఁ జంద్రకాంతశిలా వేదికపైఁ బఱచినపఱుపుపై శయనించి, సర్వదా యవిమారకుని స్మరించుకొనుటచే వచ్చినపొరపాటు మాటలకుఁ జేటికలు శంకింపఁ దెలివి తెచ్చుకొని యాపలుకులు చక్కఁగా మాటుపఱచి, వారేదో యొకకథ చెప్పెద మనిన నిద్ర వచ్చుచున్న దనునెపమున నయిష్టము చూపి నిద్రించుచున్నట్లు పండుకొనియుండె. అంతఁ బ్రక్కలఁ గూరుచున్న చేటికలలో మాగధిక విలాసినితో 'సకియా! వింటివే? మనరాజు కాశీరాజపుత్రుఁ డయినజయవర్మకు నీమె నిచ్చి పెండ్లిచేయుట కిష్టపడి వచ్చినదూతను సత్కరించి పంపుచు, రాణిగారు కుమారికను విడిచియుండుట కిష్టపడక యల్లుఁడు వచ్చి మనయింటనే యుండునట్లు చేయుఁ డనికోరుటచే, నివ్విషయము నిర్ణయించుకొని

ముహూర్తనిశ్చయము చేసికొని వచ్చుటకై యమాత్యప్రధాను
ని బంపిరఁట, నా కీమాటలు దేవిగారి పరిచారిక వసుమిత్ర
చెప్పుటచే నిది నిజమే యని తలఁచితిని' అనుచుఁ గురంగి పెక్కు
మాటలు చెప్పుకొనుచుండిరి. కురంగి యామాట లాలకించి
తనలో 'నివి నమ్మఁదగినమాటలు కావు. అయినను కార్యమునకు
వ్యవధి యున్నది గదా?' యనుకొనెను. అంతలో నక్కన్నియ
ప్రియచేటికి యగు నలినిక యచ్చటికి వచ్చి 'భర్తృదారికా!
యని పిలిచెను. కురంగియు నపుడే మేల్కాంచినట్లు కన్నులు తె
రచి చూచి 'నలినికా! వచ్చితివా!' యనఁగా, నది 'దేవిగారొ
క్కమాట చెప్పిరి' యని చెవిలోఁ జెప్పెను. నలినిక వచ్చుటచే
సంతసమునకు నన్నచేటిక లిరువురును వెడలిరి. కురంగియు నిం
చుక యాలోచించి 'అయ్యో! నడవడి నింద్య మగును గదా?'
యని భయము చూప, నలినిక 'అట్లు కాదు. ఆతఁడు మన
మనుకొనినయతఁడే గౌరవింపఁదగినవాఁడు. సంశయింపకుము'
అని చెప్పి కా[illegible]త్తుచుండెను.

ఇది యిట్లుండ, నవిమారకుఁడు కత్తి యొకచేతను ద్రా
డొకచేతను బట్టికొని చోరవేషము వేసికొని యర్ధరాత్రమున
విదూషకుని మిత్రుని యింటినుండి బయలువెడలెను. ఆహా!
యౌవన మెంతకష్టమయినది! ఇది కామమును విస్తరింపఁజే
యును. తప్పులను లెక్కపెట్టదు. ప్రమాదములకు కిరవగును.
సాహసములకుఁ బలిమి చేయును. లోకవిస్మృతిఁ బొందును.
నీతివచనములకుఁ జెవి యొగ్గదు. దీనివిభవ మేమనవచ్చు?

అవిమారకుఁ డట్లు వచ్చుచు నెవ్వ రయినఁ జూతు రేమో యని భయపడెను. కాని యానిశీథసమయమునఁ బౌరు లెల్లను గాఢనిద్రలో నుండిరి. పెక్కుమాఱు లాపురమునాలుగువీథులు త్రొక్కినవాఁ డగుటచే దారి తెలియక చిక్కుపడ నక్కఱ లేకపోయె. మనమున ధైర్యమును జేతఁ గత్తియు నుండుటచే దుష్టులకు జంకనివాఁడు గావున నతఁ డసహాయుఁడ నని కొంకలేదు. అందఱు శయనించుటచే మేడ లన్నియు నలుకుడు లేక మౌనముద్రను దాల్చినవి. అందందు దారి కిరువంకల నున్న చెట్లు చీకటితోఁ గలిసి తాఁకినఁ గాని తెలియరాకున్నవి. తిమిరపూరముతో నిండినమార్గమున కిరువంకల నున్న యిసుక గట్లవలె మేడలవరుసలు మాత్ర మించుక గానవచ్చుచున్నవి. అట్లే యొక తెరువుఁ బట్టి యాతఁడు వచ్చుచుండ నొకచోట గానము వినవచ్చెను. 'ఎవఁడో ధన్యాత్ముఁడు సదానందుఁడు భార్య యింపు లొలుక వీణ వాయించుచుండ హాయిగా వినుచున్నాఁడు' అనుకొని మఱికొంత నడచెను. అక్కడ నొక యాలుమగలకయ్యము వినిపించెను. దానిని జక్కఁగా నాలకించి 'ఛీ! వానిదే తప్పు. ఇంత రాత్రి యగువఱకు నెందో పోయి తిరిగి వచ్చినాఁడు. శీలవతి యగు కాంత, కాంతుని యిట్టి యపవాద మెట్లోర్చును? ఇంతేసు నామెయే మంచిది. ఆఁడుది గనుకఁ గోపావేశముచేఁ బ్రతికూలముగాఁ బలుకుచున్నది. కాని యేడుపుగొంతుతో నదలించుచున్నట్లుండియుఁ బ్రసన్నరాలే యగుచున్నది.' అనికొని మఱి కొంత దవ్వరిగె.

అందంగడిసాలనుండి మెల్లగా మాటలు వినవచ్చెను. దానిని శ్రద్ధగా విని 'వీఁడు నాకు సహాధ్యాయుఁడు. అనుమానించుచు నేదో చెప్పుచున్నాఁడు. ఇంకను మెల్లగఁ జెప్పు మని దూత కాఁబోలు వారించుచున్నాఁడు—కార్య మనుకూలముగా లే దని సణుఁగుకొనుచున్నాఁడు. సంకేతస్థలమునకుఁ బోకుండ మాన లేఁడు; పోఁడు. ఆఁ! వీఁడు మానునా?' అనుకొని యొకింత దూరము చనెను. వెలుఁగు గనఁబడెను. వెన్నెల వచ్చినదా యేమి యని భ్రాంతిపడి చూచెను. అది జ్యోత్స్న గాదు. హర్మ్యములలోనిదీపములకాంతి. ఎట్టో యావెలుఁగు దాఁటి యావలఁ బడెను. అంత నొకసందులో నొకఁడు గనఁబడెను. వాఁడు దొంగ. కన్నపుఁగత్తి ముడ్డుఁగఱ్ఱయుఁ జేతఁ బూని యడుగులచప్పుడు గాకుండ వడిగా వచ్చుచుండెను. దానిని జూచి యతఁడు ప్రక్కసందులోనికిఁ దప్పుకొనఁగా దొంగ దాఁటి పోయెను. అవిమారకుఁడును దసదారికి వచ్చి పదిబారలదూర మేగునంత రక్షకభటులు గనిపించిరి. వారిజాడఁ గనిపెట్టి యతఁడు నాలుగువీథులమొగలో నున్నరచ్చబల్లపై కెక్కి శయనించిన ట్లుండెను. భటులు తొలఁగిపోవుటఁ జూచి యతఁడు లేచి వడిగా ముందుపోయి రాజుగారికోట నెంత కరిగి ప్రాకారపుగోడను జూచెను. అది మిక్కిలి గట్టిగాను నిగుడు నెత్తుగాను నున్నది. దానిపై నక్కడక్కడ కోఁతితలకాయలు గానవచ్చినవి. ఆరాతిబొమ్మలతలలు తెల్లనిసున్నపుఁగాంతిచేఁ

చీకటిలో గోడపై వేఱుపడి కొంచె మెత్తుగా నున్నట్లు స్పష్టముగాఁ గనఁబడుచుండె.

అవిమారకుఁడు తనచేతిలోని త్రాడు వలయాకారముగాఁ జక్రమువలెఁ జుట్టి దానికొన యెడమచేతఁ బట్టుకొని కుడిచేతితో నా త్రాటిచక్రముఁ బూని యది గోడమీఁదికోఁతితలకుఁ జుట్టివచ్చునట్లుగా విసర నుద్దేశించి 'సృష్టికారణా! నమస్కారము. బలిశంబరమహాకాలపురుషులారా! అనుగ్రహింపుఁడు. చీకటీ! క్రమ్ముకొనుము. నిద్రాదేవతా! వర్ధిల్లుము. విఘ్నదేవతలారా! పాఱిపొండు. శత్రువులారా! అణఁగిపొండు. కాత్యాయనీ! జయముజయము' అని ధ్యానించి త్రాడు విసరిన నయ్యది కోఁతిమెడకుఁ దగిలికొని వచ్చెను. ప్రథమప్రయత్నముననే దైవము తనకు సహకారి యగుటఁ దనపని నెఱవేఱునని యాతఁ డానందించెను. అది యుక్తమే. యత్నము చేసినను గార్యము సిద్ధింపదేని నాదోష మేమనుతలఁపుతోఁ బట్టుపట్టి యత్నించిన నేకార్యము నెఱవేఱదు? మానవులపౌరుషరూప మైనమంచిప్రయత్నమును గార్యసిద్ధిరూప మగుదైవ మనుసరించియే యుండును. అట్లు చుట్టివచ్చినత్రాటికొనలు రెండు పట్టుకొనియాతఁడు గోడ యెక్కి చూచి ప్రాసాదములశోభ కచ్చెరువడి యారజ్జువే సహాయముగా లోనికి దిగి యాత్రాడు గజశాలలోఁ బెట్టి యొకవంక రక్షకపురుషు లుండుటయు నొకచక్కి దీపములకాంతి ప్రసరించుటయు నింకొకప్రక్క గానరావము వెడలుటయుఁ గని విని యించుక నేపు

డాఁగియుండి కోట యంతయు నిశ్శబ్ద మగుట గనిపెట్టి లేచి ధాత్రి చెప్పినమార్గ మిదియే యనుకొని యాదారిని బడి 'యిదియే మందాకిని, ఇదియే దారుపర్వతము, ఇదియే సేవామందిరము, ఇదియే కన్యాప్రాసాదము. ఆహా! ఇది యంతయుఁ గట్టులతోఁ గట్టిన దగుటచే సులభముగా నెక్కవచ్చును. ఒకవేళ నెక్కుట కష్టమే యనుకొందము. అయిన నేమి? దప్పిగొన్న వాఁడు చెఱువునకుఁ బోయి తామరతూండ్ల ముండ్లు గ్రుచ్చుకొను నని భయపడి నీరు ద్రాగక పోవునా? అని తలఁచుకొని యామేడ యెక్కి 'ఆఁ! ధాత్రి చెప్పినజాలయంత్ర మిదియే' యని దాని నూడఁ బెఱికి లోపలఁ బ్రవేశించి 'ఔరా! కుంతిభోజా! మేలు మేలు. ఈగృహము స్వర్గమును నవ్వుచున్నది. మణివేదికలపై హంసలు నిద్రించుచున్నవి. స్తంభములు గోడలు ద్వారములు సర్వము నవరత్నమయమై ప్రకాశించుచున్నది. వేయేల? ఈరత్నకాంతులకు దీపములు వెలవెలఁ బాఱుచున్నవి గదా' అని తలఁచికొని చోరవేషమును దీసి వైచెను.

అంత నలినిక 'రాజపుత్రుఁ డింకను రాలే దేమో? ప్రియుఁడు వచ్చు నని నేను చెప్పినంతమాత్రముననే యీ రాజపుత్రి తనయవస్థకుఁ దగనినిద్రను జెందినది' అని మెల్లగా ననుకొనుచుండ, నమ్మాటలు విని యవిమారకుఁడు సమీపించి సానందముగా నిదిగో వచ్చితి ననెను. ఆచేటియు 'ఆర్యా! యీపక్కపైఁ గూర్చుండు' మని సమ్మానింప, నతఁడు కురం

గిని జూచి 'ఔరా! నాదృష్టి తృప్తిపడక దీనిని గాఁగలించు చున్న ట్లున్నది. బుద్ధియూ, తొందరపడి నిద్రించుచున్న దీనిని లేపుచున్న ట్లున్నది. అనురాగమూ, నామేనిం బురికొల్పు చున్న ట్లున్నది. మనసమూ, ఆనందామృతలహరిలో మునిఁగి పోయినది' అనుకొనుచుఁ గురంగిశయ్యమీఁదఁ గూరుచుం డెను. అంత నలినిక రాజకుమారిని లేప నుద్యమింప, నతఁడు వలదని నివారించి 'భద్రా! నాకుఁ గన్నులు రెండే కాని వేయి లేవు. ఎంతో కాలమునుండి కోరికోరి నాబుద్ధి మూఢ మై యున్నది. కావున నిమ్మనోహారిణిఁ జూచి యనురాగసాగ రంబునావలియొడ్డు గాంచిననాకనుఁగవ నానందింపనీ' అని మనసారఁ జూచుచుండ, నీమెను గూర్చి నీవు పడుపరిశ్రమము నే నెఱుఁగక పోతే' నని నలినిక యనెను. అంతఁ గురంగి మేల్కాంచి 'ఏమే! అతఁ డంతనయమాలినమూర్తి చెప్ప నటే?' యన, నలినిక 'అమ్మా! నేను తొలుతనే చెప్పితిని గదా? మరల మరల సంశయించి యిట్లు పలికెద వేల?' యనె నెను. అవిమారకుఁడు నప్పలుకున కానందించి 'యిప్పటికి నాజీవితము సఫలమయిన' దనుకొనెను.

కురంగి—అయ్యో! ఇపుడు నే నేమంటినే?

నలినిక—ఏమియు ననలేదు.

అవిమా—(తనలో) ఈమోహనాంగికిఁ గలిగినయీ మోహాతిశయమున నాకింకొకమోహ ముదయించుచున్నది.

కురం____చాలసేపు కూరుచుంటివి. ఇపు డెంత రాత్రి యయినదే?

నలి____అర్ధరాత్ర మయినది.

కురం____అలసియుంటివి. నన్నుఁ గౌఁగలించికొనుము.

నలి__(అవిమారకుని చెవిలో) నేను గాళ్ళు పిసుకుచునే యుందును. నీవు గౌఁగలింపుము.

అవిమా____సంతోషముతో సరియే. కాని నీవు గూడ నిట్లె నాచెలియిష్టాలాపములు వినుచుండుము.'

కురం____రా. రా. ఆలింగన మొనరింపుము.

నలి____ఇదిగో వచ్చితిని. (అని యాతనికిఁ గనుసైగ చేయును.)

కురం____(బలాత్కారముగా నవిమారకుని లాగి కౌఁగిలించికొని) ఇపుడు కాళ్ళుపట్టువా రెవరే?

నలి____లేచి వచ్చి చెవిలోఁ జెప్పును.

కురం____(తత్తఱపడి లేచి) అయ్యో! చారిత్రము హీనమయ్యె. భయ మగుచున్నది.

అవి____ప్రేయసీ! నేను గ్రొత్తవాఁడను గాను. భయమేల? శరణుచొచ్చితిని. అనుగ్రహింపుము.

అంతలో ధాత్రి యరుదెంచి "భర్తృదారకా! జయము జయ" మని యవిమారకుని బ్రశంసించి, నలినికతో "అభ్యంతరమండపమున శయనము సిద్ధముగా నున్నది. వీరి నిద్దఱి నక్కడికిఁ దీసికొనిర"మ్మని చెప్పి వెడలెను. అవిమా

రకుఁడును యౌవనఋణము తీర్చికొంటి నని యానందించి కురంగిని గూడి నలినికతోఁ బూర్వోక్తస్థలమున కరిగె.

ఒకనాఁడు ప్రభాతసమయమున మాగధిక యనుచేటి కురంగికి సుమనావర్ణక మనుభూషణ మలంకరింప నామె యంతఃపురమునొద్దకు వచ్చి, ప్రాసాదము తుడిచి సుగంధజలము చల్లి శుభ్రపఱచుపరిజనము కానరామికి వగచి "సూర్యోదయమైనఁ గూడఁ బరిచారకు లెవ్వరును లేచి రాకుండి రేమి? ఆఁ! రాత్రి యంతయు మేలుకొనుటచే రాజపుత్రి తెల్లవాఱువేళ నిద్రించినది గాఁబోలు? కానీ! యీమెను లేపెదను" అనుకొనుచు లోనికిఁ బోవుచుండ, విలాసిని యనునింకొకచేటి వచ్చి "ఉండుముండుము. అలంకరణమున కేమియుఁ దొందర లేదు." అని చెప్పి దానితో భర్తృదారికాభర్తృదారకులయనురాగాతిశయమును గూర్చి యించుక ముచ్చటించుచుండెను. అంతలో నలినిక "అహో! 'శ్రేయాంసి బహువిఘ్నాని' యనెడు లోకప్రవాదము సత్యమే కదా? ఈసంవత్సర మంతయు మా రాజపుత్రికి నిరంతరాయముగా నిత్యసుఖము గలిగినది. గోష్ఠీజన సముపసమాకులము సుఖముగాఁ గాలము గడచినది. కాని యిప్పు డీవృత్తాంతము మహారాజునకుఁ దెలిసిన దని వినఁగానే యొడలు వణఁకుచున్నది. రాజపుత్రియు లజ్జాభయానురాగములు ముప్పిరిగొన నతిపరితాపమున మొద్దువోయినది. ఈమేడ యంతయు దీప మాఱిపోయినట్లు తేజోహీనమై కనఁబడుచున్నది. ఆరాజపుత్రునివియోగమున నతిదుఃఖిత యగు

నీమెవిచారమునకుఁ బ్రతిక్రియ యే కానరాదు. ఎట్లో దైవానుగ్రహమున నేయాటంకము లేకుండఁగా నతఁడు దాఁటెనాఁడని విని నాహృదయముకొంత శాంతించినది.” అని విచారించుచు వచ్చి మాగధికావిలాసినుల కావృత్తాంతము చెప్పి వారితోఁగూరంగి నూఱడించుటకై వెడలెను.

ఇక్కడీవృత్తాంత మిట్లుండ నవిమారకుఁడు ప్రియావియోగము నోర్వఁజాలక మతి చెడి తదేకధ్యానమున మునిఁగి తనసంతాపముతోఁ గూరంగిపరితాపమును బోల్చి యూహించికొనుచు, వియోగబాధ యుపశమించునుపాయము గానక ‘అవ్యాజానురాగమున నన్నానందాబ్ధి నోలలాడించిన ప్రేయసిని వంచించిననేను కృతఘ్నుఁడను పాపాత్ముఁడను. ఈ పాపుబ్రదు కేల’అని ప్రాణములపై రోసి యిల్లు వెడలి మట్ట మధ్యాహ్నమున నరణ్యము చొచ్చి యీజీవన్మరణముకంటె మరణమే మే లని తలపోసి యొకచెఱువునొద్దకుఁ బోయి దానిలోఁ బడఁ గడంగి “ఛీ! యిది నింద్య మయినమరణమార్గము. అజ్ఞానమున మంచితోఁవ మఱచితిని. అదిగో దగ్గఱనే దవాగ్ని మండుచున్నది. అందు నాదేహమును వేల్చెదను” అని యచ్చటి కరిగి యగ్నిధ్యానము చేసి యాకార్చిచ్చులోఁ బడి నవ్వికొని “ఔరా! ఇ దేమివింత! మదనాగ్నిదగ్ధుఁడ నగు నాయెడ ననుగ్రహించి యీదావపావకుఁడు మలయచందనశీతలము లగుజ్వాలాభుజములఁ దండ్రి కొడుకునట్లు నన్నుఁ గాఁగిలించుచున్నాఁడు. ఆహా! ఇంతకంటె విస్మయ మేమి

గలదు? అగ్నిహోత్రుఁడు గూడ నన్నుఁ గాల్చకుండె. దీని కేదో కారణముండ నోపు. కానీ, ఆప్రక్కఁ బెద్దకొండ గానవచ్చుచున్నది గదా? దానిశిఖరమెక్కి క్రిందఁబడి చచ్చెదను. మహత్ప్రపాతము సర్వార్థసాధకమని యార్యులు చెప్పుదురు' అని యూహించి యాపర్వత మెక్కి యందలిసెలయేట స్నానము చేసి యాచమించి మంత్రజపము చేయుచుండె.

అట్టియెడ నొకవిద్యాధరుఁడు సతీయుతుఁడై గగనతలమున విహరించుచు 'సౌదామనీ! భూలోకము దూరమున కెంత రమణీయముగాఁ గానవచ్చుచున్నదో చూడు. మహామహీధరములు కరిశాబకములవలెను, సముద్రములు క్రీడాసరోవరములనుబోల్కొని, వృక్షరాజములు నాఁచుకైవడిని, భూతలము పూఁడ్చినగోతిచందమునను, నదులు పొలిమేరలఁబోల్కొని సౌధములు నీటిచుక్కలరీతిని గనఁబడుచున్నవి. జగమంతయు సంక్షేపరూపముగా గోచరమగుచున్నది చూచితివా?—అటు చూడు మవిగో దక్షిణాశైలములు. ఆపైనున్నది మలయాద్రి మన మిపుడచటికే పోఁదలంచితిమి కాని నీవలసినట్లుంటివి. ఈకనఁబడుశిఖరి మన కాతిథ్య మీయఁజాలియున్నది. దీనిపై ముహూర్తమాత్ర ముండి పోయెదము రమ్ము' అని భార్యతోఁ గూడ సవిమానకుఁ డెక్కినకొండపై దిగెను. ఆయహార్యము మీఁదివివిధజాతితరుగుల్మలతాదులు ఫలపుష్పపల్లవపరిశోభితములై గన్పట్టుచుండె. ఆవిద్యాధరదంపతులు కొంత విశ్రమించి కొన్నిపండ్లు కోసికొని తిని పుష్పాపచయకుతూహలం

బున నందందుఁ దిరుగునంత నవిమారకుఁడు వారికంటఁ బడెను. విద్యాధరుఁడు వానిరూపరేఖావిలాసముల కచ్చెరువడి పరిశీలించి చూచి సమీపించి మంత్రభ్రష్టుఁ డగువిద్యాధరుఁ డని గ్రహించి పలుకరింపఁ బోవునంత, నవిమారకుఁడు వారిని జూచి 'వీరెవ్వరై యుందురు! కలగంటినా? నాకు నిద్ర యెక్కడిది? కాదు కాదు. అంతకాలమున మానవుల కెవరో కనఁబడుదురఁట. అట్లే నాకు వీరు కనిపించినారేమో? ఛీ! మూర్ఖుల కట్లెవరయినఁ గానవత్తురు గాని నావంటి తెలిసినవానికా? కానీ! పలుకరించెదను' అని తలఁచికొని యెవరు మీ రని యడిగెను. 'నేను మేఘనాదుఁడను. ఇది సౌదామని నాప్రియురమణి, ఇపుడు విద్యాధరు లందఱు మలయాద్రిపై నగస్త్యోత్సవము చేయు చున్నారు. మే మక్కడికిఁ బోవుచు నించుక విశ్రాంతి గైకొన నిందు దిగితిమి. ఇది మావృత్తాంతము. నీ వేల యీ భూతలమును దేవలోకముగాఁ జేయుచుంటివో వినఁగోరెదను' అని విద్యాధరుఁడు పలుక, నతఁడు 'నే నేమి ప్రత్యుత్తర మీయఁ దగును? ప్రాణావసానసమయమున నసత్య మెట్లు పలుకుదును?' అని తలఁచి 'అయ్యా! నేను సౌవీరరాజపుత్రుఁడను. నాపే రవిమారకుఁడు' అని నుడివె. మేఘనాదుఁ డా మాట విని మానవుల కిట్టియాకారసంపద గలుగ దని యూహించి యతనిమొగము లజ్జాక్రాంత మగుట గనిపెట్టి విద్యాశక్తిచే నతనినిజవృత్తాంతము దెలిసికొని 'అయ్యో! ఇతఁడు భగవంతుఁ డైనయగ్నిహోత్రునిపుత్రుఁడు. కాని తన్నుఁ

దానెలుంగ నుండె. ఇతఁడు కుంతిభోజతనయను గురంగిని బ్రే
మించి యామెతోఁ గొంతకాల మిష్టోపభోగములు సలిపి తన
యుదంతము కుంతిభోజునకుఁ దెలియఁగానే యక్కడనుండి
యీవలికి వచ్చెను. మరలఁ గురంగీప్రాసాదమునఁ బ్రవేశించు
నుపాయము లేక ప్రాణపరిత్యాగమునకుఁ దెగించి మరుత్ప్ర
పాతమునకై యీపర్వత మెక్కె. కురంగియు వియోగబాధచే
జీవన్మృతయై యనుభవించుచున్నది. నే నితని కీకార్యమున
సాహాయ్య మొనరించెదను' అని నిశ్చయించుకొని 'అవిమార
కా! మన మిప్పుడు మిత్రుల మైతిమి. మైత్రి నిష్కపటముగా
నుండవలెను. నీవు నాకడ నేమియు దాఁచఁదగదు. నీయు
దంత మంతయు నాకు గోచరమైనది. నిజముగా నీవు చావఁ
దలఁచి యిక్కడికి వచ్చితివా లేదా? చెప్పు' మన, నతఁ డంగీక
రించె. 'నేను నీకుఁ గురంగీగృహప్రవేశమున కుపాయము
చెప్పెదను. అట్లు చేసెదవా?' యని మరల నడుగ, నతిహర్ష
మున ననుమతించె. అంత మేఘనాదుఁడు తన వ్రేలియుంగర
ముఁ జూపి 'ఈయుంగరము కుడిచేతి వ్రేలికిఁ బెట్టికొనినవాఁ
డెవ్వనికిని గనఁబడఁడు. ఎడమచేతి వ్రేలికిఁ దాల్చిన నెప్పటి
వలె నందఱకుఁ గనఁబడును. ఇపు డీయుంగరము నాయెడమ
చేతివ్రేల నున్నది. నన్ను నీవు చూచుచుంటివిగదా! మఱి
చూడుము. కుడిచేతివ్రేలికిఁ బెట్టికొంటిని. నేను నీకుఁ గనఁ
బడుచున్నానా? అని యడిగి, లేదు లే దనెడు నాతనికి దానిపై
విశ్వాసము గలిగించి, తా నవల నాయుంగరము నెడమచేతి

వ్రేల నుంచికొని కనఁబడి, కొంచె మూరకుండి, యాయంగుళీయకము నాతని కిచ్చెను. అవిమారకుఁడు దాని నత్యంతాదరముతో గ్రహించె. అంత విద్యాధరుఁడు తనఖడ్గ మాతని కిచ్చె. దాని నవిమారకుఁడు చేతఁ బట్టి యిటునటు త్రిప్పి 'ఆహా! యేమి దీనిప్రభావము! ఇది వజ్రాయుధమా; మెఱుపుల గుంపా? సూర్యకాంతిని ధిక్కరించునిది దవాగ్నివలె వనము మీఁదఁ బడుచున్నది' అని దానిని నిశ్చయముగఁ బట్టి త్రిప్పి, మేఘనాదుఁ డానందించి, 'విద్యాధరులలోఁ గూడఁ గొందఱే ఖడ్గమును జేతఁ బట్టఁజాలరు. ఇతఁ డిట్టివాఁ డగుట నైశ్వరునిమహిమ గదా! యని విస్మయపడెను. అంత నతఁడు మరల ఖడ్గము నిచ్చినంత మేఘనాదుఁడు దానిని బుచ్చుకొని 'వయస్యా! ఈయంగుళీయక ప్రభావముచే నీయిష్టము నెఱవేఱును. ని న్నెవ్వరును జూడఁజాలరు. నిన్నే కాదు. నిన్నుఁ బట్టికొనినవానిని, వానిని బట్టికొనినవానిని గూడఁ జూడలేరు.

ఇది నిశ్చయము. మే మిఁకఁ బోయెదము. కాని నిన్నొక్కటి యడుగవలసి యున్నది' అనెను. దాని కతఁడు వినయవినమితగాత్రుఁడై 'మిత్రమా! నీవు నాకు జీవితదానము చేసినమహానుభావుఁడవు. నేను నీబోఁటివారికిఁ బ్రత్యుపకారము చేయునంతటివాఁడనా? అన్నివిధముల నేను నీవాఁడను. నీభృత్యుఁడను. అనుగ్రహించి యానతి' మ్మనగా, మేఘనాదుఁడు కృతజ్ఞతకు సంతసించి 'నీవు నామాట చేసెదవేని యిటు వినుము. మామిత్రురాలగునీప్రియురాలికి నన్ను నాపత్నిని

చెలువుము. మ మ్మెప్పుడును మఱవకుము. నీవు రాజపుత్రిని గూడి సుఖింపుము. కార్యాంతరముల నీకుఁ బార్శ్వమున నుండువాఁడ' నని చెప్పి, పునర్దర్శన మభిలషించునవిమారకునిచే సతికష్టమున ననుసుతుండై ధర్మపత్నిని గూడి యాకసమున కెగసి చనియెను. అవిమారకుఁడు మొగ మెత్తి వారి మార్గ మరయుచు వారిని పినవఁ బాలని ప్రేమమునఁ గనబడు సంతసమునకుఁ జూచి మనసు సరిపెట్టుకొని కొండ దిగి క్రిందికి వచ్చి యందలియొకరాతిపలకమీఁద నొకించుక విశ్రమించె.

అత్తఱి విదూషకుఁ డడవు లెల్లఁగలయ వెదకి వచ్చివచ్చి యలసి యచ్చటికి సమీపముననే యొకచోఁ గూలఁబడి నేల నొఱగి 'అకటా! సౌవీరరాజా యెంతభాగ్యహీనుఁడు? కొడుకులు లేక లేక విచారించి విచారించి నోములు నుపవాసములు జపములు తపములు సలిపి సలిపి, తుదకు దైవానుగ్రహమున మానవలోకదుర్లభుఁ డగుసుకుమారుని గనియు నపుత్రకుని యట్టివాఁ డయ్యె. నాజీవితకాలము సమాప్త మగుటచేతనో యాతనిబంధుగులదురదృష్టవశముననో నామిత్రుఁడు తప్పి పోయి యుండును. ఆ సహో రాజు 'తనకుమారుఁడు క్షేమము గానే యుండు' నని చెప్పెనుగాని, యేకాకి రాజకుమారుఁ డతిసుకుమారుఁడు కామపరవశుఁడు కానలఁ బడి బోయి యెట్లు కుశలముగా నుండును? కానీ నాశక్తికొలఁది దిరిగి చూచెదను. కనఁబడెనా, సరి. లేదా, పరలోకమున నామిత్రుని గలిసికొనియెద' నని విచారించుచు శయనించె.

అవిమారకుఁడు కొంతసేపట్లు విశ్రమించి లేచి, నాకు మంచియుపాయము దొరకె నని యెట్లు సంతోషింతును? రాజకన్యాంతఃపురమునుండి నేను సుఖముగా దాఁటివచ్చితి నని వినినా, సరి. లేకున్న నాకై యాబ్రాహ్మణుఁడు ప్రాణములు గోల్పోవును. అట్టిమిత్రుఁడు లేక నా యారంభము లేల? ఇష్టగోష్ఠియెడ హాస్యకారి, యుద్ధరంగమున మంచిజోదు, విచారసమయమున గురుఁడు, కార్యసాధనమున సాహసికుఁడు. వేయేల? నామనసులోని యానందమే యతఁడు, నా శరీరమే రెండవదై యుండె నని యాతనియెడ నాయభిప్రాయము' అని స్మరించుచు నడచుచునంత నొకచెట్టునీడఁ బండుకొని యున్న విదూషకుఁ డతనికిఁ గనఁబడెను. అతఁడు దగ్గఱకు వచ్చి 'హా వయస్యా!' యని కౌఁగిలించినంత, నతఁడు మేల్కాంచి చూచి పరమానందభరితుఁడై గాఢాలింగన మొసఁగెను. అంత నిరువురు కొంత ముచ్చటించుకొనినపిదప, రాజపుత్రుఁ డుంగరము గుడిచేతివ్రేలికిఁ బెట్టుకొని యదృశ్యుఁడై విదూషకునకు నాశ్చర్య విషాదములు గలిగించి మరల పొడగ్చి కనఁబడెను. అంత నతఁ 'డింతటిమాయలాఁడవు కన్యాంతఃపురమే ప్రవేశించి వచ్చితి' వన, రాజపుత్రుఁడు 'మిత్రమా! ఇది యిపుడే లభించినది. ఇది యంతయు నీయంగుళీయకప్రభావము. దీనివృత్తాంతము తరువాతఁ జెప్పెదను' అనుచు మరల నుంగరమును దక్షిణ కరాంగుళికి మార్చుకొని విదూషకునిచేయి పట్టుకొనియెను. అంత నిరువురును సహాస్యసంభాషణము గావించుకొనుచుఁ

జని పురమునఁ బ్రవేశించి పట్టపగ లనుశంకయు భయమును లేక రాజకులముఁ జొచ్చి యభ్యంతరమున కేగిరి.

ఆసమయమునఁ గురంగి యవిమారకుని స్మరించుచు నొక్కచోఁ బరితాపపడుచుండ, నళినిక 'అమ్మా! ఏల సంతాపపడియెదవు? ఈమేడ యెక్కి యందలి దర్శనీయవస్తువులపై దృష్టి మరలించి యానందింపవచ్చును. రమ్ము' అని చెప్పెను. అంతఁ గురంగియు 'ఓసీ! నాహృదయ మెఱింగితివా? చూచితివా? పరిజనము దెలియక నాయానందమునకై యిక్కడ మేఘకాలప్రసిద్ధము లయినవకులసరళకదంబనీపనిచుళాదులసురభికుసుమములు దెచ్చి యుంచిరి. మఱియు నీమయూరములు మనరాజకులమానసమున నతిపీతమర్దభావముఁ జేయుచున్నవి. చూడుము. వీనిని మన మెంత లాలించినవార మైనను దేశకాలజ్ఞత లేమి నివి సర్వజ్ఞభావమును జూపుచున్నవి. ఇది యుండనీ! మనశుకశారికయు నేదో పెద్దయాఖ్యానము చెప్ప నారంభించినది. నాక్లేశము నెఱుఁగక భూతికశారికయు లోకవృత్తాంత మంతయుఁ జెప్ప మొదలుపెట్టినది: పరిచారికావర్గము నీజబ్బె ట్లున్నదని యడుగ వచ్చుచున్నది. కావున నీవు చెప్పినట్లు రెండుగడియలందే విశ్రమింతము. లెమ్ము' అనుచు లేచి దానితో నటకు వచ్చి 'నళినికా! ఇక్కడఁ గూడ ననర్థమే సంభవించినది చూడుము. కాలమేఘుఁడు మెఱుపుఁగాఁగ షా చేతఁ బట్టుకొని బయలువెడలె. ఆహా! ఆకాశ మెంత చక్కఁగా నున్నదో చూచితివా? క్రొమ్మొగులుపిండు చండ

భానుని గప్పి నిరంతరజలధారలు గురియుచుండె. కానీ! యీ సొగసు చూచెదను' అనుచు గగనతలమునఁ జూపు నిలిపె.

ఆప్రాసాదముక్రింద నున్నయవిమారకుఁడు విదూషకుని జూచి 'వయస్యా! చూచితివా? అదిగో డాబామీఁద నాకురంగి. అనారోగ్యనిభమునఁ గాలాగురు చందనము పూసికొని తొడవులు విడిచి హావభావవిరహిత యయ్యుఁ గన్నుల పండువుగాఁ గానవచ్చుచుండె." అని చూపింప, నతఁడు "వయస్యా! సంతోషించితిని, లోకమున, నేనే సుందరుఁడ నని యింతకు నీవు గర్వించుచుందువు. ఇపుడు నీగర్వ మణఁగిన దని తలఁచెదను. నీమెడఁబాటుచేఁ జిక్కియు బాలేందురేఖవలెఁ గన్నులఁ దనుపుచున్నది." అని ప్రశంసించె. అంత రాజపుత్రుఁడు "మన మింక జాగు చేయరాదు. ఇంతవనుకఁ గుండ నెండతో యుండుటచేఁ బలుకరింప నదను దొరకకయే కదా యిక్కడికి వచ్చితిమి! ఇపుడ పోయి కనఁబడుదము రమ్మని" అని యాతని లాగికొనుచు సోపానము లెక్కుచుండ, విదూషకుఁడు "ఓరిబాబూ! నే నీమెట్లెక్కలేను. నే నిందే యుండెదను నీవు పొ" మ్మనెను "నేను విడిచి పెట్టినచో నీ వెల్లరకుఁ గనఁబడుదువు గదా!" యన, నతఁడు "అయ్యో! మఱచి పోయితిని. పద పద" అని కూడ వచ్చెను. ఇరువురు మేడ యెక్కిరి. ఆసమయమునఁ గురంగి నలినికతో నొక చంద్రకాంతోపలవేదికపైఁ గూరుచుండి మొగము చేతదీనవదనముఁ జేర్చి కందర్పదర్పసహాయ మగుకాలాంబుదంబుడంబుఁ జూచి

యోర్వఁజాలక యేకాగ్రదృష్టితో నాలోచించుచుఁ బొరలి వచ్చుకన్నీటి నడ్డగింపఁ బైకిఁ జూచుచుఁ దనలో నెందుకీజీవచ్ఛవ మని శరీరముపై రోసి "నలినికా! మాగధికతోఁ దలతుడుపుపలువ తీసికొని రమ్మని చెప్పు పో." అనిన నది యొక్క-తెను విడిచిపోవ సంశయించుచుండె. అంత హారిణిక వచ్చి "అమ్మా! అమ్మగారు మీతలనొప్పి యెట్లున్నదో యడిగి ర మ్మనిరి. ఈమందు కణఁతలకు రాచికొమ్మనిరి." అని యిచ్చిన దానిని ఫాలమునఁ గణఁతలను రాచికొని నలినికా! నీవు పోవేమి? ఇప్పుడు వర్షము వచ్చుచున్నది. ఈ క్రొత్తయాకాశగంగలో స్నానము చేయఁ దలఁచితిని. శీఘ్రముగాఁ బోయి యుపస్నానము దెప్పింపు"మని త్వరపెట్టిన, నది వెడలిపోయె. అంత హారిణిక "అమ్మా! అమ్మగారితో నేమి చెప్పుదును" అని యడిగిన, నామె "యిప్పటిమందువలన శిరోవేదన తగ్గిన దని చెప్పు" మని పంప, నదియు నిర్గమించెను.

ఈప్రసంగమంతయు వినుచున్న యువిమారకుఁడు కురంగి మన్మథావస్థను గని పెట్టి 'యిప్పు డిది యేమి చేయఁ దలఁచెనో? అందఱను బంపి వైచినది. వేఁడినిట్టూర్పు వుచ్చుచున్నది. బాష్పపూరితము లగువిశాలనయనముల నలువలఁకులుగల యఁజూచుచున్నది, చూడఁగా నిది యంతయు సంశయాస్పదముగా నున్న' దనుకొనుచుండఁ, గురంగి లేచి ద్వారము బంధించి 'ఈపైఁటకొంగి మెడకు గట్టిగాఁ జుట్టికొని ప్రాణము విడిచెదఁగాక' యని నిశ్చయించుకొని యట్లు చేయుచున్నం

తలో నాకస్మికముగ నొకచప్పుడయ్యుటయును వినవచ్చె. అప్పుడా కాంత యదరిపడి 'అయ్యో! పట్టుకొనుఁడు రక్షింపుఁ' డనుచు మూర్ఛిల్లె, నామె యవస్థను జూచుచున్న యవిమారకుఁడు వెంటనే తనయుంగర మెడమచేవ్రేలికి మార్చికొని భయము లేదనుచు నప్పుడామెను లేవనెత్తి, యత్యాశ్చర్యమునఁ గన్నులు తెఱచి చూచి నిశ్చేష్టురాలై యున్న యాతన్వంగిని కౌఁగిలించెను. కురంగియుఁ బ్రియస్పర్శసుఖమున నైమఱచి తనతాపశాంతి కచ్చెరువపడుచుండ, నవిమారకుఁడును బ్రియాలింగనసుఖమున కుప్పొంగుచుండెను. అంతలో నళినిక ద్వారమునొద్దకు వచ్చి తలుపు గెంటి 'హారిణికా హారిణికా! యని పిలిచి 'అక్కటా! పలుకదు. ఇది కూడ లేదు కాఁబోలు! తలుపులు బిగించికొని రాజపుత్రి యేమిసాహసము చేయుచున్నదో కదా! ఎంతపని! ఎంత పొరపాటు!! అయ్యో! ఇంక నేమున్నది? నిజముగా నేదో యపాయము జరిగియుండును' అనుచు మొఱ్ఱవెట్టుఁగా నళినికాకంఠస్వరము నెఱింగిన యవిమారకు నానతిచే విదూషకుఁడు వచ్చి తలుపు తీసెను. అందును విదూషకుని జూచి 'ఓహో సఖ్యా! మగవాఁడ విక్కడికెట్లు వచ్చితివి' యని యడిగెను, నతఁడు నవ్వుచు 'నే నాఁడుదానను గదా! నన్నుఁ జూచి మగవాఁడని యెవ్వ రందురు? నీవు నిద్రాణములోఁ గునుకుదానవు గావునఁ జక్కఁగా గుఱుతుపట్టితివి' యనెను. అందు కది తెల్లఁ బోయి చూచుచుండ, నవిమారకుఁడు నళినికా! యని పిలిచె. ఆపిలుపు విని యది పరమానందముతో నటు పరుగెత్తి

'భర్తృదారకా! వందనము. దైవానుగ్రహమున నేఁడు పరమ సంతోషము గలిగినది. కాని యీపురుషుఁ డెవఁడు?' అని యడుగుచుండ, విదూషకుఁ డం దేగి 'నేను పుష్కరిణి యను పేరు గలపరిచారికను' అనెను. అంత రాజకుమారుఁడు నవ్వి 'నేను మున్ను చెప్పుచుండెడివాఁడనే. ఆనావేడుక చెలికాఁడు సంతుష్టుఁ డనుపేరు గలబ్రాహ్మణుఁ డితఁడే' అని చెప్పెను. అంతఁగొంత సపరిహాససంభాషణము నడచినపిదప నళినిక, 'భర్తృదారకా! యీపగటివేళ మీ రెట్లు వచ్చితి' రని యడుగ, నతఁడు సర్వము నీకు నాసంతుష్టుఁడు చెప్పఁ గలఁ' డనెను. అదియు సంతుష్టునిచేయి పట్టికొని లాగి 'రావయ్యా బాపఁడా! చాతుర్మాస్యమునకుఁ బోయి యక్కడ నాచెలికత్తెలతో మాటలాడికొందము' అనుచుఁ దీసికొని పోయెను. తరువాత నాయకుఁ డాకసమువంకఁ జూచి 'ప్రేయసీ! చూడుచూడు. వర్షాకాలమేఘము లెంతదర్శనీయములై మనోహరములుగా నున్నవో? ఆహా! ఈనీలాంబుదములు వర్షాకాలమును బ్రకటింప వచ్చినయనేకరూపధారు లగు నర్తకులు; మేఘనాథునిపాఁడియావులు; నక్షత్రమండలమున కడ్డముగాఁ గట్టిన తెరలు; మెఱుపు లనెడిపాములు నివసించు పుట్టలు; నభోమార్గమున మొలచిన గుజ్జుచెట్లు; మన్మథబాణములనూరురాళ్ళు; కలహాంతరితలకు సంధి చేయుదూతలు; కొండలపై నభిషేక మొనరించునీటికుండలు; సముద్రుని వలన సలిలభిక్ష గైకొనినభిక్షువులు; సూర్యచంద్రులను మ

ముంగుపఱచుతలుపులు, దేవతలు పెట్టిననీటియంత్రములతోడి పానీయశాలలు' అనుచుఁ గొన్నిగిళ్ళను వర్ణించి యంతలో వాన యారంభింపఁగాఁ గురంగితో గదిలోఁ బ్రవేశించె.

అటుపిమ్మట నొకనాఁడు ధాత్రి తనలో 'ఆహా! దైవకృత్యము లవ్యవస్థములు. సౌవీరరాజు తొలుతఁ దనపుత్రుఁ డగువిష్ణుసేనున కీకురంగి నడిగెను. ఇపుడు నిరుపమానసౌందర్యరాశియు సుగుణగణవిభాసియు నైకులగోత్రములు దెలియనియొకమహాపురుషుఁ డీమెను గామించి సుఖించుచుండె. ఇట్టిస్థితిలో మంత్రిభూతికుఁడు కాశీరాజపత్ని యగుసుదర్శనాదేవిని గుమారుఁ డగుజయవర్మకొఱకుఁ గూఁతు నిక్కడికిఁ దీసికొని వచ్చెఁగదా! ఇఁక నేమి కానున్నదో తెలియదు. కానీ, చూచెదము గాక' అనికొనుచు నొకచోఁ గూరుచుండ వసుమిత్రయనునింకొకతె తనలో 'ఔరా! ఈ జ్యోతిషికు లెంత ప్రతికూలురు! వీరు మీనమేషములు లెక్కించువారే కాని కార్యగౌరవము నెఱుఁగువారు గారు. జయవర్మ రాజగృహమున నడుగు పెట్టెనో లేదో యపుడే వివాహసుముహూర్తము నిశ్చయించిరి. కానీ! ధాత్రి యేమో యాలోచించుచున్నట్లున్నది. దీని నడిగినచోఁ గొంత తెలియును అని తలఁచుచు సమీపించి 'జయదా! రాణిగారు నిన్నుఁ బిలుచుచున్నా' రనెను. అందుకు ధాత్రి 'సరియే కాని యీకార్యమున నమ్మగారి యభిప్రాయ మేమో తెలిసిననటే?' యని యడిగిన, వసుమిత్ర 'సరియే నీవే నన్నడిగితివా? తెలిసినది చెప్పె

డను. విష్ణుసేనుఁడు పెద్దమేనల్లుఁడు. అతనియవస్థ యేమో తెలిసికొనుటకే నేఁగా జరుగుచున్నదిఁ గూఁతురెప్పటి కామె కిష్టములేదు. నమహారాజుగారును సౌవీరరాజపుత్రుఁడగు విష్ణుసేనుఁడును గనుఁబడుచుండలేదని యిప్పుడు మిగులఁ బరితపించుచున్నారు గదా! పైని యింకి యేమగునో?' అని చెప్పి కూరుచుండెను. అంతలో విసుగుకొనుచున్న నలినిక యచటి వచ్చి యమ్మాతల్లి, వసుమిత్రతోడ నేనేమో గారాటలాడుచున్నది వినెద' ననుచు నాచెవి జేరి కూరుచుండెను. దానిని జూచి వసుమిత్ర 'ఓసీ! నీవు కించమునుపహాసముచే రాజకుమారవృత్తాంతముఁ జక్కఁగా నెఱిఁగి యుందువు. క్రొత్తవార్త లేమయినఁ జెప్పవటే?' యని యడిగెను, నలినికయు 'మా రాజపుత్రిక శత్రుఁడై ప్రచ్ఛన్నముగా మీనగరమున నున్నాఁడని మా గూఢచారులవలనఁ దెలిసినది. మీరా రాజవృత్తాంతము దెలిసి కొందుము గాక యని కోరుచున్నాము' అని సౌవీరరాజమంత్రులు మనమహారాజుగారికి వర్తమాన మంపిరి. ఆమాట వినఁగానే మహారాజుగారు నాలుగుదిక్కులకు నంపుటఁ బెట్టుకొని వారిని వెదకుటకై పరిచారకులోనక నియమించిరి' అని చెప్పఁగానే సంతోషించుచు ధాత్రీవసుమిత్రలు రాణిగారియొద్దకుఁ బోయిరి. నలినిక రాజపుత్రికడ కేగె.

అనంతరము కుంతిభోజుఁడు చిరకాలమునకుఁ గానవచ్చినబంధువు బాల్యమిత్రుఁడు నగుసౌవీరరాజును గౌఁగిలించి యత్యాదరము చూపి యభ్యంతరమందిరమునకుఁ గొని

వచ్చి యుచితాసనమున నాసీనుం గావించి యుత్తరీయముం గన్నుల నీరు గార్చుచున్న యాతనితో "వయస్యా! చిరకాలమునకుఁ గలిసికొంటిమి. ఇది యానందింపఁ దగినసమయముగదా! ఏల విచారించెదవు?" అనెను. "బావా! నేఁటికి నిన్నుఁ జూడఁ గలిగినందుకు సంతోషము మునుఁగుంపక పోలేదు. కాని, చిరకాలమిత్రుఁడవగు నీవు నింటఁ బడఁగానే పుత్రశోకము విజృంభించి మనస్సు గలఁచుచున్నది. ఏమిచేయుదును!" అని సౌవీరుఁడు కారణము దెలుప, నతఁడు "ఏమి! పుత్రశోకమా?" అని యాశ్చర్యముతో నడిగెను. ఆమాట విని దగ్గఱనున్న మంత్రిభూతికుఁడు "స్వామీ! యీసంవత్సర మంతయు నాతని యునికిపట్టు నెవ్వరికిని దెలియదని వింటిమిగదా! అనినంత, సౌవీరుఁడు "మిత్రమా! పుత్రస్నేహము బలవత్తరము గదా! బలశౌర్యసౌందర్యములు గలవాఁడు నాతనయుఁ డవిమారకుఁడు సింహాసనాధిష్ఠానమునకు ముఖ్యుఁడని తలఁచి నేను నాయంతటివాఁడు వాఁడగుఁ గదా యని యెప్పుడు డెందమునఁ జింతించుచున్నాఁడను" అని దుఃఖించెను. అంత భూతికుఁ డాతనిఁ బుత్రవిషయకసంతాపమునుండి మరలింపఁ దలఁచి "స్వామీ! నా దొకప్రార్థన. మీ కీప్రచ్ఛన్నావస్థ యెట్లు గలిగినదో మాఱేఁడు వినఁ గోరుచుండె" నని యడిగెన, సౌవీరుఁ డిట్లనియె.

"మిత్రమా! నాస్థితి భూతికుఁ డెఱుఁగును. అయినఁ జెప్పెద వినుము. అత్యంతకోపాత్ముఁ డగు చండభార్గవుఁ డను

బ్రహ్మర్షి లోకప్రసిద్ధుఁడే కదా! అతఁ డొకనాఁడు మాదేశమున కేతెంచుచుండఁగా మదీయకాంతారమున నాతనిశిష్యుని బెద్దపులి పట్టి చంపినది. ఆసమయమునకు నేను మృగయాపరతంత్రుఁడనై దైవికముగా నం దేగితిని. ఆముని నన్నుఁ జూచి కోపానలదందహ్యమానహృదయుఁడై కన్నులెఱ్ఱవడఁ బెనవు లదర సంరంభమునఁ బలుకులు తడఁబడ నన్నడుగకయే నామాట వినకయే యతినిష్ఠురముగా నన్ను దూషింప నారంభించె. భోక్తవ్యకర్మవశమున నేను నాతనిమాటలకు రోసి 'నిష్కారణముగా నిరపరాధుఁడ నగునన్ను, తూలనాడితివి. తపోధనుల కిట్టికోపము తగునా? నీవు బ్రహ్మర్షిరూపము దాల్చినశ్వపాకుఁడవు గాని తపస్వివి గా'వని నిందించితిని. దానిపై నతఁ డాజ్యధారాసంపాతజాజ్వల్యమానపావకుఁడునుంబోలె మండిపడి తెలుచూఁచి 'ఏమంటి వేమంటి' వనుచు లేచి 'తపస్విముఖ్యుఁడ నైననన్నుఁ జండాలుఁడ వని దూఱితివి గావున నీవు సపుత్రకళత్రుఁడవై చండాలత్వ మనుభవింపు'మని శాపమిచ్చె. అల్పమూల మైనయీయనర్థమునకు వగచియమునిపాదముల కెఱఁగి బతిమాలికొనఁగా నతఁడు ప్రసన్నుఁడై "ఒకసంవత్సరము నాశాపవచనమునఁ బ్రచ్ఛన్నుఁడవై యట్లుండి యనంతరము శాపముక్తుఁడవు గాఁగల"వని శాపవిముక్తి ననుగ్రహించి తపోబలమున మృతుఁడైనయానటువును జీవింపఁజేసి యాతనిఁగూడి యెందేని చనియె. నాఁటినుండి నేను దారపుత్రులతో శ్వపాకవ్రతము సలిపితిని. సంవ

త్సరము నిండినది. ఇప్పుడు శాపవిమోచన మయ్యె. ఇది నావృత్తాంతము” అని చెప్పినఁ గుంతిభోజుఁ డాశ్చర్యవిషాదమగ్నమానసుఁడై యాతనిశాపవిముక్తికి సంతసించి “ఎంతవారి కయిన నాపదలు రాకపోవు గదా! కానీ, యింతటితో నయిన నీకుఁ బూర్వస్థితి వచ్చినది. నీపూర్వపుణ్యము మంచిది. అనుహోత్సుఁడు నీకు శాశ్వతాపకారమొనర్పక యింతటితో విడుచుటయే నీసుకృతమునకుఁదార్కాణ’మని యాతని నూఱడించి ‘భూతికా! మాసోదరి యంతఃపురమునకు వచ్చెనా’ యనియడిగి, విష్ణుసేనజనని సపరివారంబుగ శుద్ధాంతముఁ జొచ్చి చిరకాలసుప్త మయిన బాంధవమును మేలుకొలుపుచున్న’దని యాతఁడు చెప్పినంత ‘సరియే కాని విష్ణుసేనున కవిమారకుఁ డను పే రెట్లు వచ్చె’ నని మరలఁ బ్రశ్నించె. అందుకు భూతికుఁ డిట్లనియె.

“ధూమకేతుఁ డను రాక్షసుఁడు గొబ్బిరూపము దాల్చి సకలలోకమారణమునకై పరిభ్రమించుచు నొకనాఁడు సౌవీరరాష్ట్రమును నశింపఁ జేయుతలఁపున నందుల కరుదెంచెను. ఆయవిరూపదానవుఁ జూచి ప్రజ లాకులపడి యార్తనాదములొనర్చుచుఁ బాలకుఁడె శరణ మని కోటవాకిట వచ్చి చేర, నీ మహారాజు ప్రతిక్రియ చేయువెరవు దోఁచక విషణ్ణుఁడై యుండె. ఆయుపద్రవము విని కుమారవిష్ణుసేనుఁడు తనతో నాడికొనుచున్న తోడిబాలుర విడిచి యారక్కసుఁ డున్న చోటికిఁ బరుగెత్తికొని వచ్చెను. అట్లు వచ్చిన యాబాలుని

ప్రియంగఁ దలఁచి యాఘాతకుఁడు చేర వచ్చునంత, ధైర్యశాలి యైన యారాజపుత్రుఁడు చిఱునవ్వు నవ్వి వాని ఱొమ్ముపై నొక్క గ్రుద్దు గ్రుద్ది చంపెను. దాన విష్ణుసేనున కవిమారకుఁ డను పేరు గలిగిన దని వింటి" నని చెప్పినఁ గుంతిభోజుఁడు 'సరియే. ఇతఁడు దైవాంశసంజాతుఁడు గాని మానవమాత్రుఁడు గాఁ డని నేను గజసంభ్రమమునాఁడే చెప్పితి ననెను. అంత సౌవీరుఁడు "బావా! నీవు వేయిచారనేత్రములవాఁడవు. అవిమారకునిగూర్చి యేమి విచారించితి" వన భూతికుఁ డందికొని "స్వామీ! పోఁదగిన దేశముల నెల్ల, చారులఁ ద్రిప్పి వెదకించితిని. ఎందును విష్ణుసేనుఁడు గానరాఁడయ్యె. కాని విశేషించి పరిశీలింపఁగా నతఁ డెందో మాయానుసారియై యుండె నని తోఁచుచున్నది'' అని విన్నవించె.

ఇట్లు వీరు విష్ణుసేనునిగూర్చి మాటలాడికొనుచుండఁగా "నే నధ్యయనమున బ్రహ్మను గానమున మాధవుని నానంద పెట్టుదును. నాకు లోకమునఁ గలహములు పెట్టుట యనినఁ బరమానందము. కుంతిభోజుని తండ్రి దుర్యోధనుఁడు నన్నుఁ జిరకాల మారాధించినవాఁడు. అతని తరువాత నితఁడును నాకు భృత్యుఁడై భక్తి సలుపుచున్నాఁడు. ఇపు డీతనికిని సౌవీరరాజునకును నవిమారకుఁడు గనఁబడకపోవుటచేఁ గార్యసంకటము గలిగినది. వీరి కాతనిఁ జూపించి కార్యసంఘటనము చేయ నిందులకు వచ్చితిని. వీరే సౌవీరకుంతిభోజులు'' అని యనుకొనుచు నారదుఁడు భూమి కవతరించి వారియెదుట

నిలిచెను. ఆరాజు లిరువురు సాష్టాంగనమస్కారము లొన
ర్చినపిదప నారదుఁడు వారిని దీవించి, 'శిష్యులారా! మీ రవి
మారకుని గూర్చి దుఃఖించుచుంటి' రని తెలిసికొని వచ్చితి
నని చెప్పెను, వారు పరమానందపడిరి. అంతట నుచితాసనా
సీను లైనంత దేవముని రాకవిని భూపాలకుఁడు వెడలి సుదర్శ
నాదేవిని దీసికొనివచ్చెను. ఆమెయుఁ దనపుత్రుఁడు జయ
వర్మకు నారదముని యనుగ్రహమున శుభము గలుగఁగల దని
యానందించుచు వచ్చి మునికి నమస్కరించెను, నామె
నాశీర్వదించె నా సమయమున నవిమారకునిగూర్చి
యడిగినసౌవీరకుంతిభోజుని ప్రశ్నము లన్నిటికి నారదుఁడు
సంగ్రహముగా నిట్లుత్తరము చెప్పెను. "భక్తులారా! విష్ణు
సేనుఁడు జీవించి యుండెను. అతఁడు దుర్యోధనపుత్రునికన్య
ను గూడి వైరంత్యపురమున నున్నాఁడు. ఇంకను రహస్య మేల?
ఈకుంతిభోజుఁడే దుర్యోధనపుత్రుఁడు. ఇప్పుడే మీ నైరంత్య
ము'అని చెప్పెను, కుంతిభోజుఁడు లజ్జించి తను ప్రీతుఁడు
కన్యాగృహము ప్రవేశింప నని యడిగెను. నారదుఁడును
'విధికర్తయైనయాకన్యను గజసంరంభమునఁ జూచి యవి
మారకుఁడు తొలుతఁ బౌరుషమునను దరువాత మాయా
సాహాయ్యమునను గన్యాంతఃపురమునఁ బ్రవేశించె'నని చెప్పి
నంత, మునివచన మప్రతిహత మని తలఁచి యారాజు 'మహ
ర్షీ! కురంగీవిష్ణుసేనులకు వివాహము గావింప నానతిమ్ము'అని
వేఁడికొనెను. అంత నారదుఁడు 'రాజా! ఉద్వాహమందువా'

క్షత్రియులకు గాంధర్వము విధివిహితము గావున నది మొదటనే యయినది. ఇఁక నగ్నిసాక్షికపరిణయ మందువా, నిత్యమతఁ డగ్నిసాక్షి యగుటచే నదియు నావశ్యకము గాదు. స్వజనసంతోషమున కందువా, అట్లయిన నుపాధ్యాయునిచే నభ్యంతరమందిరమున నుద్వాహసమయము మాత్రము గావింపఁ జేసి యాదంపతుల నిట రావింపుము' అని యానతీయ నట్లు గావించుటకై కుంతిభోజుఁడు భూతికుని బంపి, 'మహాత్మా! జయవర్మకు నాకూఁతు నిచ్చెద నని వర్తమాన మంపి మాసోదరి నీసుదర్శనను రావించితిని. ఇపు డేమి చేయఁదగునో సెలవిమ్ము' అని మరలఁ బ్రార్థించెను. అంత నారదుఁడా రాజు నించుకదూరమున నుండ నానతిచ్చి, సుదర్శనాదేవిని జేరఁజేరి 'కుమారీ! మామాటలు వింటివిగదా!' యనిన,నామె 'ఆఁ! సౌవీరరాజపుత్రునిగుణకీర్తనము వింటి' నని చెప్పెను. అందు కత్తపస్వి 'అమ్మా! నీవు మఱచితివి. విష్ణుసేనుఁడు నీపెద్దకొడుకే. నీ కగ్నిదేవునివలనఁ బుట్టినవాఁడు. నీ కీకుమారుఁడు పుట్టినయచిరకాలమునకే నీచెల్లెలు సుచేతనకుఁ గొడుకు పుట్టిపోయెను. ఆమె పుత్రదుఃఖిత యగుట యెఱిఁగి నీపుత్రు నామెకుఁ బెంచికొన నిచ్చితివి. ఈసౌవీరుఁడు మిగులఁ బ్రేమతోఁ బెంచికొనుచు నాబాలునికి విష్ణుసేనుఁ డని పేరు పెట్టెను' అనుచు నవిమారకునివృత్తాంత మంతయుఁ దెలిపి యిపు డేమి చేయఁదగునో నీవే యాలోచింపు' మని చెప్పిన, నామె 'మహాత్మా! జయసేనునకుఁ గురంగి భార్య యగు ననుకొం

టిమి. ఇపుడు వందనీయులరా లయ్యె. ఇఁక సంశయము లే' దనె. మఱియు నమ్మని ఁసుమూరి! మఱియొక్కమాట. ఇది కాశిరాజుతోఁ దప్పక చెప్పఁదగినది. కురంగి నీసుతునికంటె వయసునఁ బెద్దది. పెద్దపిల్లను చిన్నవానికిఁ గట్టిపెట్టుట ధర్మమా? నీపుత్రునకుఁ దగినది సుమిత్ర యను రెండవకూఁతురు దానిని జయవర్మకుఁ దప్పక యిచ్చును. నీ వీవిషయము కుంతి భోజునితో నిపుడే మాటలాడుము పొమ్ము' అన నామెయు నారదునిమాటలయెడ భక్తివిశ్వాసము లుంచి సోదరునికడ కేగెను. వా రిరువురును ముచ్చటించికొని నారదునిసన్నిధిఁ జేరిరి.

అంత వధూవర వేషములు ధరించిన కురంగీవిష్ణుసేనులు లజ్జావినయసంతోషములు ముప్పిరిగొన నక్కడికి వచ్చి మునివర్యునకు నమస్కరించి పిదపఁ బెద్దల కందఱకు వందనము లాచరించి వారివారియాశీర్వాదములు గొనిరి. అంతలో సుచేతనా దేవి యచ్చటికి రాఁగా విష్ణుసేనుఁడు తల్లి పాదములకు నమస్కరించె. ఆమెయుఁ బుత్రుని గౌఁగిలించికొని దుఃఖించి నారదునిచే బోధింపఁబడి కొడుకును గోడలును వెంట రా సోదరి యగుసుదర్శనం గూడి యంతిపురమునకు మరలె. అనంతరము నారదుఁడు సౌవీరరాజుతో శీఘ్రముగా నిజదేశమునకు నేగు మని చెప్పి కుంతిభోజునితో జయవర్మకు సుమిత్ర నిమ్మని చెప్పి యాకసమున కెగసి దేవలోకమునకుఁ జనియె. నాఁటినుండి యవిమారకుఁడు కురంగితో యథేచ్ఛముగ నిష్టోపభోగము లనుభవించుచు సుఖం బుండె

# 4 ప్రతిమా నాటకము

శ్రీమదయోధ్యాపురనాథుఁడును దేవాసురసంగ్రామ ప్రతిహతరథుఁడు నగు దశరథుఁడు, జ్యేష్ఠుఁడు ప్రియపుత్రుఁడు నగు శ్రీరామచంద్రునకు మూర్ధాభిషేకము గావించి తా నారణ్యకవ్రత మాచరింపఁ దలఁచి యొకశుభముహూర్తమునఁ గల్యాణమందిర మలంకరింపఁజేసి యందు భద్రాసనము ఛత్రచామరములుసదర్భకుసుమజలపూర్ణములగు హేమఘటములు పుష్యరథము మున్నగాఁ గలయభిషేకసంభారములు సిద్ధము చేయించి రామాభిషేకశ్రవణానందకందళితహృదయారవిందులగు వృద్ధామాత్య పురోహితమిత్రబంధుజనపౌరవరుల నెల్ల రావించి, మహాముని యగువసిష్ఠుని నభిషేకవేదికపై నధిష్ఠింపఁజేసె.

ఇది యిట్లుండ నింతలో నొకపరిచారిక రాజగృహము లలంకరించునేపథ్యపాలిని యగు రేవను మోసపుచ్చి పరిహాసమునకై యొకవల్కలాంబర మపహరించి సీతాగృహముచెంతకరుదేర, నామె దానిచేతిలోని నారచీర యడిగి తీసికొని తద్వృత్తాంతము తెలిసికొని యెట్లుండునో చూతు నని ముచ్చటకై స్త్రీచాపలమున దాని ధరించి, యెట్లున్న దని యచ్చటిచేటికల నడుగ, నొకతె 'ఇది నీదేహకాంతిచే బంగారు సరిగచీర యైనది' యనెను. ఇం కొకతె 'నేను నోటితోఁ

చెప్పఁ జాలను. ఇప్పటి నీశోభ యెట్లున్నదో నాపులకాంకురములే చెప్పును' అనుచుఁ దనమేనిగగుర్పాటు చూపెను. ఇట్లు వీరు ముచ్చటించికొనుచుండ, నింకొకపరిచారిక వచ్చి 'అమ్మా! కుమారరాజుగారి మూర్ధాభిషేక మిప్పుడు జరుగ నున్నదఁట. మహారాజుగారె స్వయముగా నభిషేకము చేయుదురఁట,' అని విన్నవించినంత సీత యానందించి 'ఒడి పట్టు' మనుచుఁ బసదనముగ దానియొడిలోఁ దనతొడవులు దీసి వైచెను. అంతఁ బటహధ్వానము వినవచ్చి వెంటనే యాఁగెను. అది యభిషేకమంగళధ్వనియే యని సూచించిన చేటి యొకతె 'యిది యేమి! ఒక్కసారి మాత్రమే మ్రోఁగి యాఁగిన'దని కొంకుచుఁ బలుక, జానకి 'ఏమి? పట్టాభిషేకమునకు విఘ్న మగునా?—ఏమో! రాజకులమున ననేకవిషయము లుండును' అనుచు దానిని బరిగణింపకుండె.

అట్టియెడ శ్రీరాముఁడు 'ఆహా! ఏమిది (మంగళధ్వని యారబ్ధమాయెనది. పెద్దలందఱు గూడుకొండిరి. నేనును భద్రపీఠ మెక్కితిని. సింహాసనమున కిరువంకల నిలిచినవారి భుజములమీఁద నున్న హేమకుంభములు నభిషేకతోయమును విడుచుటకు సిద్ధముగా నున్నవి. అంతలో మాతండ్రి నన్ను బిలిచి యొకమాట చెప్పినంతనే నాధైర్యమును జూచి సభ్యులందఱు నట్లు విస్మయపడిరేమో? తండ్రిమాటను గుమారుఁడు చేయు విషయమున నంతయాశ్చర్య మేల?) నాయనా! యించుక విశ్రమింపు' మని మానాయన చెప్పి

నన్ను విడుచుటచే నెత్తిమీఁద నున్నపెద్దబరువు దిగినట్లు నామన మాశ్వాసముఁ జెందినది. దైవానుగ్రహమున నేను రాముఁడనే నైతిని. మహారాజు మహారాజుగానే యుండె. ఇఁకఁ బోయి మైథిలిని జూచెదను' అనుకొనుచు నంతిపురమున కు వచ్చుచుండ, నొకచేటి 'అమ్మా! ఇంకను నారచీరతోనే యుంటివి. చూచితివా? భర్తృదారకుఁడు వచ్చుచుండె. వేష మట్లే యున్నది. పట్టాభిషేకము మాట యసత్యము గాఁబోలు' ననెను. అందుకు సీత 'పూజ్యులమాట లెన్నటికి నసత్యములు గావు—ఏమో!—రాజకులముల ననేకప్రసంగ ములు గలుగుచుండును' అనెను. అంతలో రాముఁ డచ్చటికి వచ్చి తన్నుఁ జూచి లేచినజానకిని దనప్రక్కఁ గూర్చుండఁ బెట్టికొని యేమి మాటలాడుచుంటి వని యడిగెను. 'ఏమ యేమియు లేదు. అభిషేక మభిషేక మని యీచేటి యేదో చెప్పుచున్న' దని మైథిలి పలుక, నతఁడు నీకుతూహలము తెలిసినది. అభిషేకోదంతము చెప్పెద వినుము' అనుచు నిట్లు చెప్పఁ దొడఁగె.

'మాజనకపాదు లిపుడు కోసలరాజ్య మంతయు నొక్క మొగి సంగ్రహింపఁజేసి బంధుమిత్ర గురుపురోహిత పౌర జానపదసమక్షమున నన్నుఁ దొడమీఁదఁ గూరుచుండఁ బెట్టి కొని మామాతృగోత్రమును బ్రేమతోఁ బ్రశంసించి నాయ నా! రాజ్యము స్వీకరింపుమని యానతిచ్చిరి. అని చెప్పుచుండ సీత 'నాథా! యపుడు నీ వేమంటి'వని యడిగె. 'నే నేమం

టినని నీ విపు డాలోచించుచున్నావో చెప్పు' మని రాముఁడనఁగా, నామె 'ఏమియు మాటాడక నిట్టూర్పు పుచ్చి యామహారాజు పాదములపై నొఱగితి నని తలఁచుచున్నదాన' నని చెప్పెను. అందు కతఁ డానందపడి 'ప్రేయసీ! చక్కఁగ నూహించితివి. సృష్టిలో సమానశీలు రగుదంపతు లెందఱో యుండరుసుమీ' యనుచు నభినందించి, మరలఁ జెప్ప మొదలుపెట్టె. 'నీవు చెప్పినట్లే కాళ్లమీఁదఁ బడితిని. ఆమహారాజు నన్ను లేవఁదీసి మెల్లగ ననునయించి తుదకుఁ దనముసలి ప్రాణముతో నొట్టు పెట్టికొనినంత, నేను మాఱు మాటాడక భద్రాసన మధివసించితిని. లక్ష్మణశత్రుఘ్ను లభిషేకకుంభములు మూఁపులఁ బూనిరి. ఆమహారాజు కన్నుల నీరు పెట్టుచు స్వయముగా ఛత్రము చేతఁ బూనె. అంతలోఁ దత్తఱపడుచు మంథర యేతెంచి మానాయనగారి చెవిలో మెల్లగా నేమో చెప్పినది. అంతే. అభిషేకము లేదు. నేను రాజను గాను.' ప్రియుని మాపలుకు లాలకించినజానకి 'నా కెంతయుఁ ప్రియము. మహారాజు మహారాజే, ఆర్యపుత్రుఁ డార్యపుత్రుఁడే' యని రాజ్యభారము లేమియే సుఖదాయక మనున ట్లానందము దెలిపె.

అంత రాముఁడు 'రమణీ! అలంకారములు తీసివైచితివేమి? తొందరతో లాగుటచే నలిగి యెఱ్ఱవాఱిన చవితమ్మెలును ముంజేతులమీఁది తెల్లనిమానవాళ్లును ఏడవుల నిపుడే యూడఁదీసినట్లు తెలుపుచున్నవి. మరల నలంకరించుకొనుము

నే నద్దముఁ జూపెద' ననుచు నాసెప్యము దెచ్చి ముందు పెట్టి యందు సీతాకారమును జక్కఁగ నిరీక్షించి 'ప్రేయసీ! ఉంచు ముందుము. ఈవర్ణమున సూర్యకిరణములఁ బోలి నారదారములు గానవచ్చుచున్నవి. ఎవ్వరికొఱకై తపస్వినీవేషము దాల్చితివా?' యనఁ, జేటిక 'సుకుమారరాజా! కట్టికొనినఁ జక్కగా నుండునో లేదో యని చూచుటకై యిప్పుడే ధరించెను.' అని చెప్పెను. ఆమాటలు విని రాఘవుఁడు 'జానకీ! ఇక్ష్వాకు వంశమువారి వార్ధకాలంకారము దాల్చితివా? నాకును గోరికగా నున్నది. ఇం కొకటి తెమ్మన, ఆమె 'మూఢము కూడదు. అమంగళవచనము పలుకవలదు. ఇప్పుడే పట్టాభిషేకము విడిచి వచ్చిన నీకిది యశుభప్రదముగా నుండును' అని పలికెను. అంత నతఁడు 'అట్లనెద వేల? ఇంతలోనే కోపమా? నైజముగానే కోపము తగదు. అందును బరిహాసమునెడ నెంతమాత్రము తగదు. ఇంతకును నాయర్ధశరీరమైన నీ వింతకుమున్నె నారగట్టితివి కాదా! ఇందుఁ గానిపని యే మున్నది?' అని చెప్పుచుండ, 'అయ్యో! మహారాజు; సుకుమారా! మహారాజును రక్షింపు రక్షింపు మని రెండుమాటలును వినవచ్చెను. ఇదేమి యుపద్రవము? ఇంతలో నేమి వచ్చినది? ఎవరివలన?' అని యనుచుండఁ, గంచుకి వచ్చి 'సుకుమారా! స్వజనమువలననే మహారాజున కాపద వాటిల్లినది. వచ్చి కాపాడు' మని తొందరతోఁ జెప్పెను. అది విని 'ఆర్యా! స్వజన మనుటచే దానికిఁ బ్రతీకారము లేదు. అయ్యో! యేమి యుపాయము! ఈమాట

శరీరమును మానసమును గూడ నెత్తురువుపతెఁ గత్తితోఁ గోయుచున్నది. నెల్లరకు లజ్జాకరముగా నున్నది. కానీ! ఎవరేమి చేసిరి? యని మెల్లగా నడుగ, నతఁడు 'పూజ్యురాలయిన కైకేయి — అని విన్నవించెను. 'మాయమ్మ కైకేయి — అట్లయిన నిం దేదో విశేషగుణ ముండును. లేకున్నఁ బురందరునివంటి మగఁడును, నాబోఁటికొడుకును గలయామెకు సామాన్య మైనకోరిక యేమి గలుగును?' అని పలుకఁ, గంచుకి 'కుమారా! చాలుఁ జాలు. ఆఁడువారి యాలోచనంబుల మార్దవము దెచ్చి పెట్టుచుంటివా? ఆమెమాట వలననే నీయభిషేక మడ్డినది.' అని మనోవైకల్యముఁ జూపె. దానిపై రాముఁడు "ఆర్యా! ఇం దెన్నో సుగుణము లున్నవి. మాతండ్రి యడవికిఁ బో నక్కఱ లేదు. నేనా తల్లిదండ్రుల చాటుననే యుండి బాల్యసౌఖ్య మనుభవింతును. క్రొత్తరాజు వచ్చె ననెడిశంక ప్రజలకుఁ గలుగదు. ఐహికభోగములు నా తమ్మునకును గాఁ అందెఁ గలుగను. కావున నది మంచియాలోచనమే' యన, నతఁడు 'కుమారా! ఆమె యిన్నియుఁ గూడఁ గోరలేదు. భరతునకు రాజ్యము గట్టు మని భూపతిని గోరినది' యని నిజము దెలిపె. అందు కతఁడు 'ఇది మఱియు మంచిది. నాయందలి పక్షపాతమున నీవు తప్పఁ దలఁచుచున్నావు గాని యిది నా కెంతో యుపకారము. ఆమె తన తనయునియభిషేకము గోరుట యనఁగా డబ్బిచ్చి రాజ్యభారము గొని తెచ్చుకొనుట. ఆమె కా లోభము తగును గాని భ్రాతృరాజ్య మపహరింప లోభము మనకు ముమ్మా

టికిని వలదు. ఇఁక మా తల్లియూహల విమర్శింప నిచ్ఛగింపను. మా జనకునివృత్తాంత మెట్లున్నదో చెప్పుము' అని నిశ్చలముగాఁ బలుక, నతఁడు 'చెప్పుట కేమున్నది? శోకాతిశయమున నోట మాట లేక యక్కడనే మూర్ఛపడెను. అని చెప్పె. 'అయ్యో! మూర్ఛపడెనా?' యని రాముఁ డనుచుండ, 'ఇంకను మూర్ఛపడెనా యనుచుంటివా?' యనుమాట వినవచ్చె. దాని విని 'ధైర్యసాగరుఁ డైనసౌమిత్రి కోపమునఁ గలఁతఁ జెంది వచ్చుచున్నట్లుండె' నని రాముఁడు తలఁచెను.

అంత 'మూర్ఛపడెనా యనుచుంటివా? జనకునిమూర్ఛను సహింపవేని విల్లు చేకొని రమ్ము. దయ యనుమాట తలపెట్టకు. మెత్తనివారి కిట్లే పరాభవము గలుగును. ఇది నీ కిష్టము గాదా, నన్ను విడిచి పెట్టుము' అని యుద్ధతితోఁ బలుకుచు ధనుర్బాణపాణియై లక్ష్మణుఁ డెదుటికి వచ్చెను, సీత మగనితో "నాథా! ఏపువఁ దగిన యీసమయమున నీ లక్ష్మణుఁ డు విల్లమ్ములు చేతఁ బట్టె నేమి? ఇట్టి యూనాస మెప్పుడును విన్నది గాదు గదా?" యనెను. రాముఁడును 'తమ్ముఁడా! యేమిది?' యనఁగ, నతఁడు కోపముతో "ఏమిది యేమిటి? క్రమముగా వచ్చెడిరాజ్యమూ, పోయినది. తండ్రియూ, మూర్ఛమునిఁగెను. ఇంకను సందేహ మేమి? ఈశాంతి యేమి?'' యనెను. అంతట రఘుపుంగవుఁడు 'సౌమిత్రీ! నా రాజ్యభ్రంశము నీ కిట్టియుద్యోగమును గలిగించెనా? ఎంత తెలివిమాలినవాడవు? నేనయిన నేమి, భరతుఁ డయిన నేమి, యెవఁడు రాజ

యినను సమానమేకదా? నీకుఁ గార్యకౌశలము గలదేని యాతనికి సహాయుఁడవై యుండుము' అని చెప్పుచుండ, నతఁడు కోపము పట్టఁజాలక బయలువెడలెను. వానికినుకఁ జూచి శంకించి వెనుకకుఁ బిలిచి "సోదరా! మహాత్ముఁడు సత్యసంధుఁడు నయినతండ్రిపై విల్లెక్కిడుటకా? లేక, తనసొమ్ము దాను గైకొనిన తల్లిపై నమ్ము విడుచుటకా? కాక, యేదోషము నెఱుఁగనిభరతుని బ్రహరించుటకా? ఎందుకీయుద్యమము? ఈమూఁడుపాతకములలో నీరోషమున కేది రుచించునో చెప్పుము. నీకెట్లయిన స్థైర్యము గలిగింప నేనెంత చెప్పినను జెవిని బెట్టకుంటివి గదా! నీయభిప్రాయ మేమి?" యని గట్టిగఁ బలుక, నతఁడు కన్నుల నీరు నింపి "క్లేశదాయక మయినరాజ్యమునెడ నాకు మనోరథము లేదు. పదునాలు గేండ్లు నీ వడవిపాలు గావలసియున్నది గదా యని విచారించుచున్నాఁడ" నని తనముఖ్యాభిప్రాయ మెఱిఁగించెను. పిదప రాముఁడు, వెఱ్ఱివాఁడా! ఇందుకా విచారము? అని పలికి, జానకిని జూచి 'దేవీ! వల్కలాంబరములు దెప్పింపుము' అనిన, నామె 'నేను గూడ వచ్చెద' ననెను. రాముఁడెన్నోవిధముల నామెను నివారింపఁ జూచిన నన్నిటికిఁ దగినట్లుగా 'నేను సహధర్మచారిణిని; ఏకాకివై యరణ్యమునకుఁ బోవునిన్ను విడిచియుండఁ జాలను. నాకు వనమే యుత్తమప్రాసాదము, అత్తమామలసేవకై దేవతల కొక్కనమస్కారము

చేసెను. నన్నుఁ గూడఁ దీసికొని పొమ్ము' అనుచు నాపె పట్టుపట్టెను. అంతట నతఁడు 'నీ వట్టియెడ నీమెయు ననుసరింపు' మని లక్ష్మణునకుఁ జెప్ప, నాతఁడు 'అన్నా! ఆమె మంచి పని చేయుచున్నది నే నెట్లు నివారింతును? రాహువునోటిలోఁ బడుచున్నప్పుడు గూడఁ జంద్రుని వెనుకనే తార యుండును. విడిచిపోవుచున్నప్పుడు చెట్టునీడఁ గూడఁ దీఁగె పడును. అడవులో పడఁబడినప్పుడు గూడ గజేంద్రుని గరేణువు విడవదు. సాధులకుఁ బతులంటె నెక్కుడేమి? కావున రానిమ్ము' అని బదులు చెప్పెను.

అంతట నౌకరి చేటికి వచ్చి 'అయ్యా! సంగీతశాలనుండి యింతకు మున్ను వల్కలాంబర మొకటి యువదాసిక యెత్తికొని వచ్చియున్నది. దాని నీవు గైకొంటివి పని పిని యింతకు మున్నుపయోగింపనక్రొత్తచీరలు ముట్టికొన్న నేపథ్యపాలిని యగు రేవ నాచేతి కిచ్చి, కావలసిన యెడల నన్నుగా నుపయోగించికొనవచ్చునని చెప్పెను' అని వానిని జూపి "మేలు మేలు సమయమునకు వచ్చినవి తెమ్ము" అని వానిని రాముఁడు తీసికొని కట్టికొనెను. అంతట లక్ష్మణుఁడు 'అన్నా! అన్నివస్త్రములలోను నాకు నగలు మెచ్చుచుండునవి యేవియు. నాకిప్పుడు నాకట్టు యీవాయక నీ వొక్కఁడవు కట్టికొంటివా?' యన రామునియభిమానము ననుసరించి సీత 'లక్ష్మణా! నీ వుండు' మనెను. అందు కతఁడు 'ఆర్యా! నాయన్నకుఁ బాదసేవ నీ వొక్కతెవే చేయఁ దలఁచితివా? నీవు కుడిపాదము పట్టెదవు.

నే నెడమపాదము పెట్టితిని. నన్ను కాపాడుము" అని ప్రార్థింప, నామె 'ఆర్యపుత్రా! సౌమిత్రి నమస్కరించుచుండె. దానిమ్ము' అని చెప్పెను. దానిపై రాముఁడు 'సౌమిత్రీ! వల్కలము మాకుఁగా నేమనుకొంటివి? తపస్విజనసంరక్షణమునకుఁ గవచము, నియమములనెడి యేనుఁగులకు కంకుశము, ఇంద్రియములను నెడి గుఱ్ఱములకుఁ గళ్లెము, ధర్మమునకు సాధకమునగు సాధనము, ఇవిగోఁ దీసికొనుము' మని యిచ్చెను. అతఁడును నారలు గట్టికొనిరి వప మువ్వురు బయలుదేరి వీథిలోనికి వచ్చిరి. ఈవృత్తాంతము విని పౌరు లందఱు వీథులలోఁ గిక్కిఱిసి యుండిరి. లక్ష్మణుఁడు త్రోవ చేసికొని ముందుగా నడచుచుండ, రాముఁడు సీత మేలిముసుఁగుఁ దీయించి 'ఓ పౌరులారా! ఇదిగో నా భార్య. వంచిన మోము నెత్తికొని మీరు కన్నులారఁ యథేచ్ఛముగాఁ జూడుఁడు, యజ్ఞములందును వివాహములందును కష్టకాలమునను వనవాసమునను స్త్రీలను నిస్సంకోచముగాఁ జూడవచ్చును. ఇది తప్పు గాదు" అని పలుకుచు నడచుచుండఁ గంచుకి పరుగెత్తికొని వెనుక వచ్చి 'మహారాజా! మహారాజు మీ వనప్రయాణము విని మూర్ఛనుండి లేచి దుఃఖము క్రమ్మిన మేనితో మెల్లగా నడచి వచ్చుచుండె" నని చెప్పెను.

ఆమాటపై సౌమిత్రి 'అన్నా! నారవస్త్రములు మాత్రము గట్టికొని పోవుమనలఁ జూడఁ దగిన దేమున్న' దనఁగా, రాముఁడు "మనము వెళ్ళినతరువాత మన్మహారాజు మనముఖ్య

నివాసమందిరములఁ జూడఁ గలఁడు" అనుచు సరణ్యామునకుఁ జనిరి.

సీతా రామలక్ష్మణులు వనమునకు వెడలినపిదప నయోధ్య యంతయు శూన్యముగా నుండెను. పౌరులకు నిద్రాహారములు లేవు. గజతురగములు మేఁత మాని యేడ్చుచు నిలిచి యున్న వనిన నిఁక రాజసేవకులఁ జెప్పవలసిదేమి? వారివిచారమే చెప్ప నలవి గానిదిగా నుండఁ గన్నవారిగతి యాలోచింపఁ దగియుండునా? కొడుకులను గోడలిని జూడవలెనని లేచి మెట్లో నాలు గడుగు లిడి మరలఁ బడిపోయినదశరథుని లేవఁ దీసికొనిపోయి పరిచారకులు సముద్రగృహకములోఁ బరుండఁ బెట్టిరి. కౌసల్యాసుమిత్రలు వచ్చి పుత్రదుఃఖము గూడ గణింపక భర్తకుపచారము చేసినంత నెట్టకేలకు మాట వచ్చినది గాని పూర్వస్థితి రాలేదు. అతనిబుద్ధి యంతయు రామమయమయ్యెను. 'హా రామా! హా లక్ష్మణా! హా సీతా! నన్ను విడిచి పోయితిరా! నాకుఁ గనఁబడరా? నాతో మాటలాడరా? నా మొగముఁ జూడరా? హా సత్యసంధ! జితక్రోధ! లోకప్రియ! గురుశుశ్రూషణా! రఘుకులభూషణా! ఎక్కడ నుంటివి? నాయనా! ముదుసలితండ్రిని విడిచిపెట్టి పోవుట తగునా? హా దైవమా! మాకు బిడ్డలు లేకుండఁగఁ జేసి రాము నింకొక నరనాథునకుఁ బుత్రునిగా నిర్మించి కైకేయిని గానలో నాఁడుపులినిగాఁ బుట్టించిన నెంత చక్కఁగా నుండును? హా కుమారా! సూర్యునివలె నీవు, సీతోఁ బగటివలె లక్ష్మణుఁ

డును, వీరాయిరువురను గూడి నీడవలె సీతయుఁ గనఁబడకుండఁగఁ బోయితిరా? ' అని విలపింపఁ దొడఁగెను. అంతఁ గౌసల్య 'ఇంక నెంత యేడ్చినను బ్రయోజనము లేదు. శాంతింపుఁడు. సీతాలక్ష్మణసహితుఁ డగునాప్రియపుత్రుఁడు మీ రేర్పఱచిన వనవాససమయము సమాప్తి నొందఁగానే కనఁబడును.' అని యూఱడించె. ఆమాటలు విని ప్రక్కకుఁ దిరిగి కౌసల్యా సుమిత్రలనుజూచి మఱింత విలపించి 'రాముని విడనాడి నే నిఁక జీవింతునా? రాముని విడువ కుండినసుమిత్రకొడుకే కొడుకు. అట్టికొడుకులను బతివ్రతాతిలక మగుకోడలిని విడిచిననాఁ బ్రతుకేల కాల్పనా?' యని దశరథుఁడు దుఃఖించుచుండె.

అంత సీతారామలక్ష్మణులను రథముమీఁద నెక్కించి కొనిపోయినసుమంత్రుఁడు రథముతోఁ దిరిగి వచ్చి రాజగృహమంతయు శోకమగ్నమై యుండుటఁ జూచి క్రమముగా దశరథుని సమీపించి మహారాజా! యని పలుకరింపఁ 'గుమారులు కోడలు నేరి?' యని యడిగి, యాతఁడు నిరుత్తరుఁ డగుట గని దశరథుఁడు మఱల మూర్ఛిల్లి సుమంత్రుని శాంతివచనములఁ దెప్పిఱిల్లి 'సుమంత్రా! నాకొడుకు లెక్కడ నున్నారు? నాయనుఁగుఁగోడ లెక్కడ నున్నది? వా రేమనిరి? ఆతపశ్శాలులవృత్తాంత మేమి?' యని యడుగ, నతఁ డిట్లనియె "అయ్యా! శృంగిబేరపురమున వారు మువ్వురు రథము దిగి మహారాజునకు నమస్కారపూర్వకముగా నేదో విన్నవింప నారంభించి బాష్పస్తంభితకంఠులై మాటాడఁ జాలక యట్లే

యడవికిఁ బోయిరి, అని చెప్పెను. అమ్మాటకుఁ గౌసల్యా సుమిత్రలు శోకలీనమానసలై కన్నులొత్తికొనుచు నుండ, దశరథుఁడు గొంతెత్తి యేడ్చి 'హా రామా! నీకుఁ బట్టము గట్టి ప్రజలను సంతోషపెట్టి నీచే నీతమ్ములకుఁ జక్కఁగా ధనగృహగజతురగాదిసంపదలు పంచిపెట్టించి యెంతో చేయుదు నని యానందించుచుండఁ గైకేయి నాయాలోచన మంతయు నొక్కక్షణములో నిర్మూలము గావించె. ఇప్పటికి నామనుగడ లాభము సమాప్తి గాంచినది.' అని పలికి, "రాముఁడడవిపాలయ్యె. నాప్రాణములును బోయినట్లే. ఇఁకఁ ద్వరగా భరతుని రావింపుము. నీపాపము సఫల మగును" అని కైకేయికిఁ జెప్పి సుమంత్రుని బంపి, పైకిఁ జూచి 'ఓ దిలీపా! వాసవసఖా! ఓ రఘుమహారాజా! ఓజనకా! అజనరపాలా! పుత్రదుఃఖమునఁ బరితపించు నన్నాశ్వసింప వచ్చితిరా? మీతోఁ గూడి స్వర్గమున నివసించుటకు నాకు సమయము వచ్చినది. హా రామా! మనోఽభిరామా! హా సౌమిత్రీ! సోదరమైత్రీ! హా సీతా! పరమపతివ్రతా!' అనుచుఁ బ్రాణములు విడిచె. కౌసల్యా సుమిత్రలు పరిజనులును బెద్దపెట్టున శోకించిరి. చేటికలు విలపించుచు రాజపత్నుల నంతఃపురమునకుఁ గొనిపోయిరి.

అంత నొకనాఁడు భరతుఁడు రథారూఢుఁడై వచ్చుచు "సూతా! మామేనమామగారియింట నుండుటచే నాకయోధ్యావార్త లేవియుఁ దెలియకున్నవి. మానాయనగారి కనారోగ్యముగా నున్నదనిమాత్రము దెలిసినది. జబ్బేమి? వైద్యు

లేమి చెప్పిరి! ఆహార మేమి! భయము లేదు గదా!' యని యడుగ, సూతుఁడు పై ప్రశ్నములకు సరిగా 'మనోవేదన యుఁట మంచివైద్యులే లేరు. భోజనమే లేదు. దైవమెఱుఁగును' అని సమాధాన మిచ్చె. అంతట సూతుఁడు 'నామనసులో బెంగగా నున్నది. రథము వేగముగాఁ దోలుము' యనఁగ, సూతుఁ డట్లుగావించెను. ఆరథ వేగముఁ జూచి భరతుఁడు "ఆహా! రథాశ్వవేగమున నిరూపింప రాక పార్శ్వద్రుమములు వెనుకకుఁ బారిపోవుచున్న ట్లున్నవి. ధూళి ధూసరి వచ్చు రంగిలవలె భూమి చక్రనేమివివరములపైఁ బడుచున్న ట్లున్నది. కఁద్దయూకలు విడివిడిగాఁ గనిపింప కున్నవి. చక్రపాలు ననము జనాతిరేకమున నిశ్చలమైన ట్లున్నది. అశ్వపాదాహతిని రేఁగినదుమ్ము ముందు గనఁబడుచున్నది గాని వెంబడింపఁజాల కున్నది' అనుచుండ, సూతుఁడు 'అదిగో! అయోధ్య' యని రథగతి నించుక తగ్గించె. భరతుఁడును ముందు చూచి 'ఆఁ! బందుగుల నగరాత్తిని జూచి నామనసు శ్రమించుచున్నది' యనఁగా సూతుఁడు మనమున 'అయ్యో! ఎంతకష్టము! ఇతఁ డిట్టి ప్రసంగ మేమియు నెఱుఁగక యుండె. తండ్రిమరణమును పట్ల శోకమును, అన్నప్రవాసమును దెల్పినచో నితఁడు దుఃఖము నట్టఁజాలఁడని నేను జెప్పకుంటిని' అని యాలోచించికొనుచుండె. అంతలో నొకభటుఁ డెదురుగాఁ బరుగెత్తికొని వచ్చినవానిని జూచి భరతుఁడు 'భద్రా! శత్రుఘ్నుఁడు వచ్చుచుండెనా?' యని యడిగె. వాఁడును 'వచ్చుచుండెనేమో' యని సమా

రాజా! ఇం కొకగడియమాత్రము కృత్తిక యున్నది. రోహిణి ప్రవేశింపఁగానే పురములోనికి రావచ్చును. అంతవఱకును పురమువెలుపల నుండఁదగును' అని యుపాధ్యాయులు సెల విచ్చిరి. అని నుడివి వెడలె. అంత సూతుఁడు రథము నిలిపిన, భరతుఁడు దిగి, రథమును గొంచె మావలికిఁ దోలికొని పోవ సూతునకు నానతిచ్చి యచ్చటికి దగ్గఱ నున్న చెట్లగుంపుకడ కేగెను.

అతని కంటి కొక దివ్యమందిరము దృష్టిగోచర మయ్యె. అది దేవాలయ మని యతఁడు భ్రాంతిపడెను. దాని చుట్టును బువ్వులు పేలాలును జల్లఁబడి యున్నవి. దానిగోడల మీఁద నఱచేతులతో నద్దినమంచిగంధమునానవాళ్లు మనో హరముగా నుండెను. ద్వారములఁ బూలమాలికలు వ్రేలు చున్నవి. దాని యెదుట ధ్వజస్తంభాదిదేవాలయచిహ్నము లేవి యు లేవు గాని క్రొత్తచూపఱ కది క్రొత్తగానిర్మించుచున్న గుడి యని తోఁచక పోదు. అందు నాలుగు జాతివిగ్రహము లున్నవి. అవిమానవరూపముల నొప్పుచున్నను, దేవతాప్రతిమ లని భ్రాంతి గలిగింపక పోవు. ఆప్రతిమలశోభ శిల్పవిద్యా నైపుణ్యమును వేనోళ్లఁ జాటుచున్నది. ఆ గుడిబాహ్యాలంకర ణముఁ జూచి భరతుఁడు, నాఁడు పర్వదినమో లేక యది దేవ తల కొనరించునాహ్నికారాధనవిశేషమో యని తలఁచి, కొంతసే పందుండి దేవారాధనయు విశ్రాంతియుఁ గూడఁ గావించికొనవచ్చు నని యందుఁ బ్రవేశించి, యాప్రతిమలఁ

జూచి వీ రేదేవతలో యని యూహించి, తెలిసికొనఁ జాలక యెవ రయిన నేమి? దేవత లనుబుద్ధితో వీరికి నమస్కరించెద నని యుత్సాహపడి, మంత్రహీన మయిన దేవతాప్రణామము శూద్రకృత్య మని శంకించియు, దేవతలను దర్శించినప్పుడు నమస్కరింపక పోవుట యనుచిత మని భావించి 'మహాదేవత లారా! నమస్కారము' అనెను. అంతలో దేవకులికుఁ డరుదెంచి 'నమస్కరింపరాదు' అని నిషేధించిన, నతఁ డేమి కారణ మని యడిగెను. అంత నా దేవలుఁడు "ఏమియు లేదు. దేవత లనుశంకతో బ్రాహ్మణులు వీరికి మ్రొక్కఁ గూడ దని పరిహరించితిని. వీరు దేవతలు గారు. క్షత్రియులు" అని చెప్ప, నతఁ డచ్చెరుపాటుతో నేక్షత్రియులు వీరు? అని ప్రశ్నించె. అంతఁ బూజారి, ఏ రిక్ష్వాకురాజులు. అని తెలుప, నతఁ డానందముతో "ఏ రయోధ్యానాథులా! దేవాసుర యుద్ధముల దేవతలకు సహాయు లైనవారా? ఇంద్రలోకమున నివసించువారా? ఆహా! నాకు యాదృచ్ఛికముగా మహా ఫలము సంభవించినది. ఏ రెవ రెవరో చెప్పు" మనెను. అంతఁ బ్రతిమాదర్శనమున నీక్రింది ప్రసంగము జరిగెను.

దేవకులికుఁడు—ఇతఁడు విశ్వజిద్యాగ మొనర్చిన ధర్మప్రదీపుఁ డగు దిలీపుఁడు.

భరతుఁడు—ధర్మపరాయణా! వందనము.

దేవ—ఇతఁడు సర్వదా బ్రాహ్మణసహస్రపరివృతుఁడై వారిపుణ్యాహఘోషమును వినినరఘుమహారాజు.

భర — ఆహా! అట్టివారిని గూడ మృత్యు వతిక్రమించెనా? ఓభూసురగణావేదితరాజ్యఫలా! నమస్కారము.

దేవ — ఇతఁడు ప్రియావియోగనిర్వేదమున రాజ్యము విడిచి నిత్యక్రతుస్నానప్రశాంతుఁడైనయజమహారాజు.

భర — ఓశ్లాఘనీయపశ్చాత్తాపా! నమస్కారము.

దేవ — ఇతఁడు — అని నాల్గవప్రతిమను దెల్పుచుండ, భరతుఁడు కడు నాకులపడి ‘ఓయీ! గౌరవబుద్ధితో వినుటచే నేను వీరిని జక్కఁగా జ్ఞప్తియం దుంచుకొనలేను. మరలఁ జెప్పుము’ అని యడిగిన, నతఁడు మరల మొదలుపెట్టెను.

దేవ — ఇతఁడు దిలీపుఁడు.

భర — మాపితామహునకుఁ బితామహుఁడు.

దేవ — ఇతఁడు రఘువు.

భర — సరియే. మాతండ్రికిఁ బితామహుఁడు.

దేవ — ఇతఁ డజుఁడు.

భర — సరియే మాపితామహుఁడు. అని, నాల్గవ ప్రతిమఁ జూచి భయపడి-ఉండు. ఉండు. మొదటినుండి రానీ!-ఎవ రెవరు? దిలీపుఁడు-ముత్తాతతండ్రి, రఘువు-తాత తండ్రి, అజుఁడు-తండ్రితండ్రి-సరియే. కాని, జీవించియున్న వారిప్రతిమలు గూడ స్థాపింపఁబడునా?

దేవ — లేదు లేదు గతించినవారివి మాత్రమే.

అతఁ డామాట యనినంతనే భరతుఁడు క్రిందఁ జతికిలఁ బడి నిర్విణ్ణుఁడై యుండ, నప్పూజారి “ఏమయ్యా! నాకీ

శుల్కమునకై ప్రాణములను రాజ్యమును గూడ విడిచిపెట్టిన యీదశరథునిప్రతిమను గూర్చి ప్రశ్నింపవేమి?" యనెను. ఆమాట వినుచునే భరతుండు హా తాతా! యని మూర్ఛిల్లి కొంతవడికిం దెలివొంది "హా హృదయమా! అనిష్టమును శంకించి శంకించి తుదకు జనకునిమరణవార్త వింటివిగదా! నీకోరిక తీరినదిగదా? ఇంక శాంతించి ధైర్యపడుము. హా దైవమా? ఏమిది? శుల్కశబ్దము నామొద తెరియించుచున్న దేమి? ఇది సత్యమా? అకటా!-ఆర్యా! నిజము చెప్పుము" అని పరితపింప, దేవకులికుం డాతనిం గైకేయీతనయునిగాం దెలిసికొని యూఱడించి, యాతం డడుగంగా దశరథమరణమును సీతారామలక్ష్మణులవనప్రవాసమును దెలిపెను. అన్నగారివనగమనవార్తకు మఱింత శోకించి భరతుండు "అక్కటా! ఎండిపోయినయేటికిం బిపాసార్తునివలెం బితృభ్రాతృపరిత్యక్తమై యరణ్యమైనయయోధ్యకుం బోవుచున్నాను" అని తలంచి నిజవృత్తాంతమును దెలిసికొన నాచిత్తము స్థిరమయినది. సవిస్తరముగా జరిగినకథ చెప్పుమని యడుగ, సద్దేవలుండు కైకేయికోరికనుబట్టి రామునిపట్టాభిషేక మాగుటయుం దదనంతరవృత్తాంతమును దెలిపె. తల్లి చేసినయకార్యమును విని యాతండు దుఃఖభారమున మూర్ఛిల్లె.

అంతలో దశరథపత్నులను దీసికొని సుమంత్రుం డా ప్రతిమాగృహమునకు వచ్చి లోపలం బ్రవేశించుచు నందుం బడియున్నపురుషుని జూచి శంకింప, దేవకులికుండు భరతుండే

యిట్లు పడియుండె' నని చెప్పి వెడలె. తమ ముసుఁగులు దీసికొని యా రాజాంగనలు విలపింప, సుమంత్రుఁడు వారి నాశ్వాసించుచుండె. ఆసందడిలో భరతుఁ డించుక దెలిసి 'ఆర్యా!' యనఁగా, సుమంత్రుఁడు 'ఔరా! స్వరసామ్యము! ఈదశరథప్రతిమయే మాటలాడిన ట్లున్న' దనికొని యాతని సమీపించె. భరతుఁ డాతనిఁ జూచి 'తాతా! సుమంత్రా! నీవా?' యన, నతఁడు, 'కుమారా! బ్రహ్మ నాకుఁ జిరాయువు పోసినదోసమునఁ గృతఘ్నుఁడనై నా రాజుతోఁ గూడఁ బోలేక శూన్యరథముఁ బెట్టికొని యిట్లు జీవించియున్నాను. నీ తల్లు లిట్లు, విలపించుచున్నారు' అని చెప్ప, నతఁడు 'తాతా! ఏరి?' యని లేచి తలలు వంచికొని యున్నవారిని జూచి సుమంత్రుఁడు చూపఁగాఁ గౌసల్యాసుమిత్రలకు నమస్కరించి వారిదీవనల నంది, పిదపఁ గైకేయిమాట రాఁగానే మండిపడి ఛీ! పాపాత్మురాలా! గంగాయమునలనడుమ మురికినీటి వెల్లువవలెనే మా తల్లులనడుమ నీవు ప్రవేశించితివా?' యని నిందించె. అంత నామె 'కుమారా! నే నేమి చేసితి' ననఁగా, నతఁడు 'ఏమి చేసితివా? నాయన్నకు నారచీర కట్టఁబెట్టితివి. నా కపకీర్తి గట్టితివి. మాతండ్రిని గృహమృత్యువునోటఁ బెట్టితివి. అయోధ్యను రోదనాగ్నిఁ బెట్టితివి. సౌమిత్రి నడవిమృగముల తోడు చేసితివి. కోడలికై వగచుమాతల్లుల కేడుపు తోడు చేసితివి. వేయేల? అయోధ్య నటవి గావించితివి. నీవు ఛీ యనిపించికొంటివి. ఇంతకన్న నేమి కావలయు' ననె. అంతఁ

గౌసల్య 'నాయనా! గతించినదానికి విచార మేల? అన్ని యాచారములు దెలిసినవాఁడు మాతృవందన మాచరింపకుండ నగునా?' యన, నతఁడు 'తల్లీ! నీవే తల్లివి. నా కీమె మున్ను తల్లియే కాని యిప్పుడు గాదు. పదివేలకు నీవే నా తల్లివి. నీకుఁ బదివేలవందనములు. ఒక్కమాట చెప్పెదను వినుము. దుశ్శీలురై పితృభక్తిని విడిచినపుత్రులు పుత్రులు గారని యిదివఱకే లోకమున నొకధర్మ మేర్పడి యున్నది. నే నిపు డొకసనాతనధర్మమును స్థాపించుచున్నాను వినుము. భర్తృద్రోహ మొనరించినతల్లి తల్లి గాదు' అని పల్కె. అంతఁ గైకేయి 'కుమారా! మీతండ్రిసత్యవచనమును సంరక్షించుటకై శుల్కలుబ్ధనై—నాకుమారునకు రాజ్య మిమ్మని యడిగితిని గాని వేఱు గాదు' అనఁగా, నతఁడు 'సరియే. అట్లయిన నాయన్న నీ కేమగును? అతఁడు నాతండ్రి కొడుకుఁడు గాఁడా? కులక్రమాగతరాజ్యమునకుఁ దగఁడా? అట్లయిన మే మందఱము గలసి యుండమా? మమ్ముఁ జూచి లోకము హర్షింపదా? శుల్క మని వింటిని. ఇ దేమిశుల్కము? కులజ్యేష్ఠుఁడు జగత్ప్రియుఁడు నైన శ్రీరాముఁడు రాజ్యము విడిచి నారచీరలు గట్టి పాదచారియై భార్యతో వనవాసము చేయుట గూడ నీశుల్కమున నుదాహరింపఁబడినదా? ఎంత పని చేసితివి? రాజ్యలోభమున మగని బ్రతుకు నరకుచేయవైతివి. పెద్దకొడుకు నడవికిఁ దోలితివి. నారగుడ్డ కట్టుకొనిన యాపతివ్రత జనకతనయ సీతను జూచినపుడైన నీకు జాలి పుట్ట లేదు.

గదా? క్రూరా! సృష్టికర్త నిన్నే యమునకు గులిక కరిసముగా నిర్మించెనా? నీకు రాజ్యమే కావలసివచ్చిన నీ తండ్రి యీయక పోయెనా? అయ్యో! రామునివలెనే నీకు లోభము గలిగిన నా వేరేల తలపెట్టవలెను? పోనీ, రాజమాత ననిపించికొనవలయు నని నీకు గోరిక పుట్టెనా! అట్లయిన నిజము చెప్పుము. సర్వజనస్తోత్రపాత్రుఁ డగు శ్రీరాముఁడు నీకుఁ బుత్రుఁడు గాకపోయెనా? అకటా! ఎంతకష్ట మెంతకష్టము!' అని పరితపించె.

'కుమారా! సమయము వచ్చినపుడు నీ కంతయుఁ దెలియఁ గలదు. నే నిప్పుడేమి చెప్పినను నీ చెవి కెక్కదు' అని కైకేయి పలుకుచుండునంతలోఁ బ్రకృతివర్గముతో వసిష్ఠవామదేవాదు లక్కడికి వచ్చుచున్నారని తెలిసికొని సుమంత్రుఁడు 'కుమారా! రాజ్య మరాజకముగా నున్న దని నీ కభిషేకము చేయఁ గోరి నిన్నుఁ గొనిపోవఁ బెద్దలే తెంచుచున్నా' రని చెప్పె. 'అంతయు నశించుఁ గాని! అభిషేకము కేకయరాజపుత్రికిఁ గావింపనీ! ప్రకృతివర్గము మాత్రము నన్ననుసరింపనీ! అయోధ్యాపురి యుఁ [illegible]రామచంద్రుఁ డెక్కడ నుండెనో యదియే నా కయోధ్య. నే నక్కడికే పోయెద' నని బయలు వెడలె. సుమంత్రుఁడును రాణులను గొనిపోయి యంతఃపురములఁ బ్రవేశపెట్టి వెంటనే రథము దోలికొని వచ్చి భరతు నెక్కించికొని వెడలె.

భరతుఁ డట్లు రథారూఢుఁడై జగదానందకారణుఁ డగు రెండవచంద్రుఁడో యనఁ దగు శ్రీరామచంద్రుని దర్శింపఁ

బోవుచు "హా, ఆర్యా! మహారాజప్రతినిధీ! యశోనిధీ! సత్యవ్రతా! జగన్నుతా!' అని తదేకనిష్ఠతో రామనామస్మరణము చేయుచుండ, సూతుఁడు 'కుమారా! ఆశ్రమము సమీపించితిమి. ఇందే సీతారామలక్ష్మణులు శీలసత్యభక్తులవలె నివసించి యున్నారు,' అని చెప్పి యరదము నిలిపెను. భరతుఁడును దిగి సవినయముగా ముందు నడచి 'ఓ తపోవనవాసులారా! కృతఘ్నుఁడు ప్రాకృతుఁడు ప్రియసాహసుఁడు భక్తిమంతుఁడు నగువాఁ డెవఁడో యొకఁడు వచ్చె నని పితృవాక్యపరిపాలకుఁడగు రఘువీరునకు విన్నవింపుఁడు' అని కేక వైచె. దానిని విని రాముఁడు 'లక్ష్మణా! మేఘనాదమును బరిభవించునీ కంఠస్వరమెవనిదో కాని మననాయనగొంతువలె వినవై బంధుశంకతో నామది కానందము గలిగించుచున్న' దన, నతఁడు 'ఆర్యా! నాకు నట్లే యున్నది. మృదుమధురధీరగభీరమును విస్పష్టోచ్చారణమును నగు నయ్యాకంఠస్వరము చాతుర్వర్ణ్యమునకు నభయదాన మీయ నుద్యోగించుదానిని బోలి శ్రావ్యమై శ్రుతిరుచిరమై నాకు బాంధవబహుమానమును గలిగించుచున్న' దని వచియించి, యంత రాముని యానతిచే నద్దెసఁ దెలిసికొన వచ్చె. అతనిఁ జూచి సుమంత్రుఁడు 'సౌమిత్రి యిటు వచ్చుచున్నాఁ'డన, నతఁ డెదురేగి * యాతనికి నమస్కరించె. సౌమిత్రియు నతనిఁ జిరాయువుగా దీవించి, తాను ముందేగి "ఆర

*ఇందు భాసకవి భరతునికంటె లక్ష్మణుఁడు పెద్దవాఁ డని తెలిపె.

ర్యగత మయినసీరూపమో యన భ్రాతృవత్సలుఁ డైనభరతుఁ డరుదెంచె”నని రామునకుఁ జెప్పె. ఆమాట విని తండ్రి పరలోకగతుఁ డయ్యె నని తెలిసికొని యాతనిఁ దీసికొని వచ్చుటకు మైథిలిని బంపె. ఆదేవియు వచ్చి తనకు మ్రొక్కినకైకేయీనందను నాశీర్వదించి యాతనిఁ దోడ్కొని వచ్చె. అతఁడును సవినయముగా రాముని జేరి సాష్టాంగపడ, నతఁ డాతని లేవనెత్తి కౌఁగిలించి తండ్రి స్వర్గస్థుఁ డగుటకుఁ జింతించి భరతు నూఱడించె. అంతలో దశరథుఁడు పరలోకగతుఁ డయినపిదప రాముని జూచుట కదియే మొద లగుటచే శంకించి యించుకసేపు వెనుకఁ బడియున్న సుమంత్రుఁ డరుదెంచి రాముని జూచి ‘కుమారా! మహారాజుమరణమును నీప్రవాసమును భరతునివిచారమును వంశమునాథత్వమును గన్నులారఁ జూచెడికష్టము నాకీచిరాయుస్సువలనఁ గలిగినది’ అనుచు, విచారపడుచున్నసీతారామలక్ష్మణుల నుపశమింపఁ జేయుచు నించుక ప్రసంగించె. అంత భరతుఁడు ‘అన్నా! నే నిందే యుండి నీపేర నక్కడ రాజ్యము చేయుట కనుగ్రహింపు’ మని కోర, నతఁడు ‘వత్సా! ఇది యుక్తము గాదు. నేను జనకునినియోగమునఁ గానకు వచ్చితిని గాని భయదర్పవిభ్రమములవలనఁ గాదు. నీ విట్లు తప్పుత్రోవ త్రొక్కితివేని సత్యధన మైనమనకులమునకుఁ గలంకము సంభవించును జుమీ!’ అని హిత ముపదేశించె. దానిపై సుమంత్రుఁడు ‘అటయిన నభిషేకోదకమునకు స్థాన మేది?’ అని యడిగిన,

«నాతల్లి నిర్దేశించినదియే' యని రాముఁడు నుడివెను. అంతట భరతుఁడు «ఆర్యా! పుంటిమీఁదఁ గొట్టకు. తల్లిదోషము నను దోషముగాఁ బరిగణింపకు. నన్నుఁ దొంటియట్లనురాగమునఁ జూచి నాకోరిక చెల్లింపు' మని వేఁడికొనఁ నతఁడు «వత్సా! నిజముగాఁ జెప్పుచున్నాను. నీయం దేమియు దోషము లేదు. నీసుగుణసంపదకు మెచ్చికొంటిని. మనతల్లి కోర్కె మిక్కిలి యుచిత మని నమ్మితిని. పితృవాక్యమును మనము మృషా గావింపఁ దగదు. నీవంటిపుత్రుని గనియు మనతండ్రి మిథ్యావాది గాఁ దగునా? నీవు నీరాజ్యమును పాలింప కుంటివేని మనపిత కుత్తమగతి గలుగదు. దానం జేసి నీవు శాపపాత్రుఁడ వయ్యెదవు' అని బోధించె. అందు కతఁడు నిరుత్తరుఁడై «ఆర్యా! అట్లయినఁ బదునాలుగేండ్లయినపిదప నీ రాజ్యమును నీవు గైకొనుటకు సమయ మొసర్చితి వేని నీయాజ్ఞ ననుసరింతు' నన; నతఁ డట్లియ్యకొనెను. అంత నతఁడు సంతసించి, «నీపాదుకలు దయతో నొసంగితి వేని వానికి విధేయుఁడనై నీవు వచ్చునంతకు నాకార్యమును నెఱవేర్చికొందు' ననఁగా, సీత యాతనిప్రార్థనను బలపఱుపఁగా రాముఁ డాతనికిఁ బాదుక లిచ్చె. అంత నతఁ డాపాదుకల కభిషేకముచేయుటకై రామునను మతిఁ బడసి తనలో «ఆహా! నాకృత్యము సార్థక మైనది. దీనిచే బంధుమిత్రసచివపౌరబృందమున కిష్టుఁడ నైతిని. స్వర్గస్థుఁ డగునాతండ్రి నన్నుఁ బ్రేమించును. సోదరులయాదరమునకును గీర్తికిని పాత్రుఁడ

నై చేసి. లోకమంతయు నీసుజనులగోష్ఠికి భాజనమైనది' అని గారాబు
నుపలికె. తన సౌభ్రాత్రమును బ్రసన్నవదనుండై నతమ్ముని
జూచి శ్రీరాముండు 'నాయన్నా! రాజ్యమనునది యొకముహూర్త
కాల మయిన నుపేక్షింపం దగినది కాదు. కావున నిపుడే
విజయముకొఱకుం బోవలయును' అని యుపదేశించె. భర
తుండు 'నా పాదుకలు శిరసావహించి, యిదిగో! ఇపుడే పోయి
నిన్నుం గోరుచున్న పౌరులకుం గన్నులపండువు గావించెద'
ననుచు లేచి విధాహృష్టుండై చనియె.

పిదప శ్రీరాముండు సీతాలక్ష్మణసహితుండై దండ
కారణ్యప్రదేశములం బర్యటనము గావించి జనస్థానముం జేరి,
యందుం దాపసాశ్రమమునం దుటజము నిర్మించికొనియుండెను.
ఒకనాండు రామలక్ష్మణులు సమిత్కుశఫలాహారార్థ మెందేని
చని యెంతకుం రాకయుండ, సీత కాననమునయం దొకతాప
సితో రాముని రాకను గూర్చి ప్రసంగించుచుండెను. అంతలో
రాముండు మఱలి దెంచి యుటజసమ్మార్జనము నాశ్రమప్రదేశసేచ
నము చేసి యుండి యున్నసీతను జూచి గారామెక్కష్టమునకు
నోర్చుకొని సిగ్గుపడి వచ్చి పలుకరించినంత, నామె యత
నిం జూచి 'ఆర్యపుత్రా! నేండు నీముఖశోభ మఱియొక
లాగున నున్న దేమి?' యని యడిగెను. 'రేపు మా
నాయనగారి ప్రత్యాబ్దికము. కల్పోక్తప్రకారముగా శ్రాద్ధ
విధి జరిగింపవలసి యున్నది. ఎట్లు నెఱవేఱునో యని తోం
చకున్నది' యని రాముండనంగా నామె 'భరతుండు సర్వ

సమృద్ధిగాఁ బితృకార్యము చేయును గదా! అవస్థకుఁ దగి నట్లుగా ఫలోదకదానమున నీ వారాధింపవచ్చును. నీకింత చింత యేల?' అనెను. అంత రాముఁడు 'జానకీ! యీ వృక్షముల మీఁద నున్న ఫలములు చూచి నావనవాసమును స్మరించి కొని నాతండ్రి విలపించును గదా! యని వగచుచున్నాఁడ' నని చెప్పుచున్నంతలో, ఖరాదులఁ జంపినకసి దీర్చుకొన జానకి నపహరించి రాముని వంచింపఁ గృతనిశ్చయుఁడై పరి వ్రాజకవేషమున రావణుఁ డచటికి వచ్చె. శ్రీరాముఁ డాస న్న్యాసిని జూచి యాతిథేయసత్కారము లాచరించినంత, సన్న్యాసి యిట్లనెను. 'ఓయీ! నేను గాశ్యపగోత్రుఁ డను. సాంగోపాంగము లైనవేదములను మనుధర్మశాస్త్ర మును, మాహేశ్వరయోగశాస్త్రమును, బార్హస్పత్యార్థశా స్త్రమును మేధాతిథిన్యాయశాస్త్రమును బ్రాచేతసశ్రాద్ధ కల్పమును జదివినవాఁడను.' అన, రాముఁ డాపలుకులు విని 'స్వామీ! పితృకార్యమున వినియోగింపఁ దగిన శ్లోకోక్తము లైనముఖ్యపదార్థము లేవి' యని యడిగిన నతఁడు 'దర్భలు తిలలు, కలాయశాకము, మహాశకరము, గండభేరుండము, వృషభము, ఖడ్గము, ఇంకను గొన్నిమృగములు సర్వ జాతిపదార్థంబులలో నుత్తమము' లని చెప్పె. తరువాత రాముఁడు 'తక్కిన మృగములను గూడఁ జెప్పుము. చాపతపములలో దేనికి సాధ్యమైన దయినను నేను మున్నను దెచ్చెద' ననఁగాఁ గపటసన్న్యాసి 'హిమాలయమునస్తను

శృంగము మీఁదఁ బ్రత్యక్షశివునిజటాజూటమునుండి పడెడి నీటిధారలను ద్రాగి జీవించుచున్న కాంచనపార్శ్వము లను మృగములు గలవు. దానిపలలముతో వైఖానసవాలఖిల్యాది మునులు పితృశ్రాద్ధ మాచరించుచుందురు. దానిచేఁ బితృదేవతలు తృప్తులై దేవతలతో సమానముగా విమానము లెక్కి తిరిగి స్వర్గలోకసుఖ మనుభవింతురు' అని నుడివె. దానిపై రాముఁడు సీతతో 'మనము హిమవంతమునకే పోవుదము. నీ వెంచిన విహగహరిణతరులతాదులసెలవు తీసికొనుము' అని చెప్పిన, విని యా రావణుఁడు 'రాజకుమారా! తొందరపడకు. అవి మానవులకుఁ గానరా' వనెను. అందుకు రాముఁడు "స్వామీ! అవి హిమగిరిమీఁద నేకదా యుండును? అట్లయినఁ జూడుము. హిమాలయుఁడు నాకు హైమహరిణములను జూపిన సరియే. లేకున్న నా బాణప్రహారమున భిన్నుఁడై తప్పక క్రౌంచత్వమును బొందక పోఁడు" అని పలికిన, నమ్మాయావి యతనిధైర్యమున కచ్చెరువడి యిటునటుఁ జూచి 'ఇదిగో! చూచితివా? నీపుణ్యము మంచిది. పర్వతరాజు నీపై దయదలఁచె. మెఱుపుఁగాంతులఁ బ్రసరించుచుఁ గాంచనపార్శ్వ మిం దరుదెంచె. అదియే నేఁ జెప్పినమృగము' అని యొకబంగరులేడిని జూపె. దానిని జూచి జానకీపతి 'మునీంద్రా! ఇది నీయనుగ్రహమే' యని, సీతను జూచి 'రమణీ! మానాయనగారిభాగ్యము మంచిది. అనాయాసముగా సిద్ధి లభించినది. ఈతాపసోత్తమునకుఁ బూజ గావింపవలసి యున్నది. కావున

సౌమిత్రి నామృగమునకై పంపు' మనఁగా, నామె "తీర్థ యాత్రనుండివచ్చుచున్న తాపసకులపతి నెదుర్కొని తీసికొని వచ్చుటకై వెడలినసౌమిత్రి యింకను రాలేదు గదా!" యనెను. అంత నాతఁడు 'ఈభిక్షువునకు సేవ చేయుచుండుము. నే నిపుడే దానిని బట్టి తెచ్చెద'నని సీతతోఁ జెప్పి ధనుర్ధరుఁడై వెడలె.

పిదప రావణుఁడు "మాయామృగముచే రాముఁడు దారి తప్పి దూరముగా నాకర్షింపఁబడెను గదా! ఇఁక నీసీతను మంత్రహీన మైనయాహుతి మాడ్కి నపహరించెదను." అని తలఁచుచు నిజరూపము దాల్చి, తన్నుఁ జూచి భయపడి మొఱ్ఱ లిడుచున్నసీతతోఁ దనపరాక్రమముఁ జెప్పుచు "నీవు రాముని బిలువుము. లక్ష్మణుని గేక వేయుము, స్వర్గమందున్నదశరథుని శరణుచొరుము. ఏ మయినను సరియే నిన్ను విడువను. బెబ్బులిని లేడిపిల్ల లేమి చేయఁగలవు?" అని యామెను స్పృశించుచు నామెచే శప్తుఁడై యొడ లెల్ల మండ, దానికిఁ బ్రతిక్రియ గావించుకొని యామె పాతివ్రత్యమహిమ కచ్చెరువడియు,మూఢత్వమున బలాత్కరించి,మూర్ఛపడి యున్నయాసాధ్వీమతల్లి నెత్తికొని పోవుచు 'ఓజనస్థానవాసుల రగుతపస్విలారా! దశగ్రీవుఁడు సీతను దీసికొని పోవుచుండె. క్షాత్రము గలిగనేని రాముఁడు దీనికిఁ బ్రతిక్రియ చేయుఁగాక' యని బొబ్బ లిడుచు నాకాశ మానమునఁ జనుచుండ, సీతయార్తనాదమును రావణుని కేకలను విని జటాయువు 'ఉండు ముండుము

నీచా! నావాఁడిగోళ్ళతో నీయొడ లెల్లఁ జీల్చి నీరక్తము కంటఁ జూచెదను’ అనుచు వాని నెదుర్కొనెను. వారిరువురమహాసంగరమును జటాయువు నేలఁ గూలుటయుఁ గన్నులారఁ జూచిన యిద్దఱు తాపసు లతివిచారముతో నివ్వార్త రాముని కెఱిఁగింపఁ బోయిరి. *

ఇది యిట్లుండ, నయోధ్యలో భరతుఁడు చీరవల్కలవసనుఁడై జటాపుంజపింజరితోత్తమాంగుఁడై రామాజ్ఞ ననుసరించి శత్రుభూపతుల వశపఱచికొని ప్రజారంజకుఁడై పరిపాలించుచు, రామాదులు జనస్థానమున నివసించి యున్నారను వార్త దెలిసికొని వారిని జూచి వచ్చుటకై యొకసమయమున సుమంత్రుని బంపెను. అతఁడు తిరిగి వచ్చుట యించుక తడ వయినకతమున నొకనాఁడు భరతుఁడు భ్రాతృకుశలవార్తాశ్రవణకుతూహలవ్యగ్రనిజహృదయ ముత్తలపడ నొకించుక యనిష్టమును శంకించుచుండ, హృదయాగ్నిశోషితవక్త్రుఁడైనసుమంత్రుఁ డరుదెంచి కుమారా! జయ మనుచు ప్రోల నిలిచె. మార్గాయాసఖిన్నుఁ డైనట్లున్న యాతనిఁ జూచి భరతుఁ డత్యాదరముతో ‘తాతా! ఆజగద్విదితపితృస్నేహమును, ద్విధాభూత మైనయాయరుంధతీచారిత్రమును, నిష్కారణవనవాస మైన యానిరుపమానసౌభ్రాత్రమును జూచివచ్చితివా?’ అని యడుగ, నతఁడు గ్రుడ్ల నీరు గ్రుక్కుచు నూరకుండెను.

---

* దీనిపిదపఁ గిష్కింధా సుందరకాండకథలును, ఇట్లే కొంచెము ముందు యుద్ధకాండకథయును భాసకవిచే నీనాటకమున విడువఁబడినవి.

అందుకు సంశయించి ఏమి? ప్రతివచనము లేదు. తాతా! మార్గమధ్యమునుండియే వెనుక మరలితివా? లేక లజ్జాక్రోధముల వారు నీకు దర్శన మీయరు లేరా?' యని మరల నడిగె. అంతట సుమంత్రుఁడు 'కుమారా! నీ యానతీ చేయక నడిదారినుండి మరలి వత్తునా? ఎంతమాట! ఇది యట్లుండనీ! ఆవినయశీలురకుఁ గోప ముండుట యసంభవము. స్థిరచిత్తులగుటచే వారు సిగ్గుపడువారు గారు. ఇఁక జరిగిన దేమందువా? వినుము. నేను జనస్థానమునకుఁ బోయి తిరిగి తిరిగి వారియాశ్రమము చేరితిని. అది శూన్యమై యుండెను. అక్కడి వారి నడుగఁగా, వారు కిష్కింధ యను వానరనగరికి వెళ్ళిరని తెలిసినది.' అనెను. అంత భరతుఁడు 'అయ్యో! వానరుల లోనికిఁ బోయిరా? అక్కడ నేమి కష్టపడుదురో కదా?' యనఁగా, సుమంత్రుఁడు "తిర్యగ్జంతువులు గూడ నుపకారము చేయుచున్నవి.' మన రాముఁడు తనవలెనే కష్టములపాలై ఋష్యమూకాద్రిఁ జేరిన సుగ్రీవునితో మైత్రి యొనరించెను" అని చెప్పి యూరకుండెను. దానిపై భరతుఁడు మఱియుఁ జింతాక్రాంతుఁడై "తాతా! అదేమో వివరించి నిజము చెప్పకుంటివా, స్వర్గములో నున్న మానాయనగారిపాదములకుఁ దప్పినవాఁడవే" యని యొట్టుపెట్టినంత, సుమంత్రుఁడు గాభరించుచు సీతాపహరణము సుగ్రీవస్నేహము వాలివధ మొదలుగాఁ గలసంగతులను దాను విన్నకొలఁది వినిపించె. ఆమాటలు విని కైకేయీపుత్రుఁడు మోహావిష్టుఁడై నేల నొఱగె. కొంత

సనకఁ దెప్పఁదల్లి 'అయ్యో! ఎంతకష్టము! ఏమిమాయ! ఎక్కడిరావణుఁడు! ఆమహాసాధ్వి నపహరించెనా? వా రంతటి దుఃఖ మనుభవింప నేమిపాపము చేసిరి? అయ్యో! ఎంత యప్రతిష్ఠ! ఎంతటిమోసము! ఎట్టిపరాభవము! హా హా! కష్టము కష్టము! తండ్రిని గోల్పోయి తల్లికి దూరుఁడై యడవుల నిడుమలఁ బడుచుఁ దుదకు భార్యావియోగదుఃఖముగూడ ననుభవించెనా?' యనుచు దుఃఖించి లేచి, ముందుగాఁ దన రాక తెలియఁజేసి కైకేయియొద్దకుఁ జనియె. ఆమెయు నెన్నఁడు లేనిది నేఁడి దేమివింత యని కొంకుచు భరతుని జూచి 'నాయనా! రామునియొద్దనుండి సుమంత్రుఁడు వచ్చినాఁ డని యిప్పుడే విని సంతోషించితి' ననఁగా, నతఁడు 'నీ కింతకంటెను బ్రియ మయినవార్త చెప్పెదను. నీనియోగమున రాజ్యము విడిచి కానలపా లయిన యామహాత్ముని భార్యను రావణుఁ డపహరించె నఁట. నేఁటికో నీమనోరథము సిద్ధించినది నీవంటికోడలు సంభవించుటచే మహాతేజశ్శాలు లగునిక్ష్వాకురాజులకు భార్యను గోల్పోవుట యనునప్రతిష్ఠ సిద్ధించినది చాలు నిఁక సంతసింపుము' అని పలికెను. ఆమాటలు విని కైకేయి విచారించి "కుమారా! నిజము తెలుపుట కిప్పుడు సమయము దొరకినది. నీవు పసివాఁడవు. మహారాజునకు సంభవించిన శాప మెఱుఁగవు. ఈసుమంత్రుఁడే నీ కావృత్తాంతము తెలియఁజెప్పును విను" మన నామె యానతిని సుమంత్రుఁ డిట్లు చెప్పె. కుమారా! తొల్లి

యొకనాఁడు నీతండ్రి వేఁటకై యడవికిఁ జని యం దొక చెఱువులో మునికుమారుఁ డొకఁడు కమండలముతో నీరు ముంచుచుండఁగాఁ గలిగిన చప్పుడు విని యది కరిబృంహితముగా భ్రమసి శబ్దవేధిచేఁ గొట్టిన నబ్బాలుఁడు తల్లిదండ్రులఁ జేరొ్కనుచు హా యని నేలఁ గూలె. ఆ యార్తధ్వని విని యతఁడు పశ్చాత్తప్తుఁడై యం దేగి యాబాలుని గొనిపోయి యంధులు వృద్ధులు నగు నాతనిజననీజనకులకడ నుంచి యెఱుఁగక చేసినతనయపరాధమును మన్నింపుఁ డని శోకించుచుఁ బలుక, నమ్ముని పుత్రశోకమున వివశుఁడై ‘నీవు గూడ నావలెనే పుత్రశోకమున మృతినొందుదు’ వని శపించె.

ఆ శాపము విని భరతుఁడు మాఱు పలుకఁజాలక యేమో ధ్యానించుచుండఁగ గైకేయి ‘కుమారా! యీ శాపము నిమిత్తముగా, ఈ నిష్కారణమయిన యపయశస్సున కొడిగట్టి రాముని వనమునకుఁ బంపితిని’ అంతియ కాని రాజ్యలోభమునఁ గాదు. అపరిహార్యమయిన యామహర్షి శాపము పుత్రప్రవాసమునఁ గాని శాంతింపదుగదా!’ అని చెప్పె. అప్పుడు భరతుఁడు ‘అట్లయిన న న్నేల యడవికిఁ బంపినావు కావు? అని యడుగ ‘నీవు మాతులగృహమున నుండుటచే నెట్లయినఁ బ్రవాసమున నున్నవాఁడవే యైతివి. నీ తండ్రికిఁ గాలమాసన్న మగుటచే నపు డదియే యుపాయ మయినది.’ యనెను. ‘అట్లయినఁ బదునాలుగేండ్లు నియమింపఁ గారణ

మేమి ?' యని మరల నడుగఁ 'బదునాలుగు దినము లని చెప్పఁ దలఁచి మతిభ్రమణమున దైవికముగాఁ బదునాలుగు వత్సరము లంటిని. ఇది నా చేసినతప్పు' అని బదులిచ్చె. "ఈ వృత్తాంతమంతయు వసిష్ఠవామదేవాదు లెఱిఁగినది. వారును మతించినది. ఇందు సందియములేదు" అని సుమంత్రుఁడు పలికె. అంత భరతుఁడు పశ్చాత్తాపపడి 'అమ్మా! నాయన్న యందలి భక్తిచేఁ గోపము పట్టఁజాలక నిన్ను నిందించితిని. క్షమింపుము.' అని పాదములపైఁబడిన, నామె కుమారా! లోకములో నేతల్లి తన కొడుకుతప్పును మన్నింపదు ? లెమ్ము నీ దోష మే మున్నది? అనుచు లేవ నెత్తెను. భరతుఁడును రామునకు సాహాయ్య మొసర్పఁ జతురంగబలమును బంపఁ దలఁచి లేచినంత, నంతిపురమునుండి రోదనధ్వని వినవచ్చె. అది కౌసల్యాసుమిత్రలయార్తనాద మని తెలిసికొని వారి నోదార్చుటకై భరతుఁడు తల్లి వెంబడి వెడలెను.

తరువాత నొకనాఁడు శారదరాకాసుధాకరాభిరాముఁ డగు శ్రీరాముఁడు లోకత్రయవిద్రావణుఁ డగురావణుని సంహరించి సుగుణమణివిభూషణుఁడగు విభీషణుని లంకారాజ్యమున కభిషిక్తుఁ జేసి దేవదేవర్షిసంస్తూయమానచారిత్ర యగు భూపుత్రిని దీసికొని ఋక్షరాక్షసవానరప్రధానపరివృతుఁడై సానుజుఁడై విమానారూఢుఁడై వచ్చుచున్నాఁడని తెలిసి కులపతి యానతియఁ దాపసాశ్రమమునందలి మునులందఱు తమ శక్తి కొలఁదిని దత్కాలోచితసత్కారమునకుఁ దగిన పదార్థము

లను సజ్జీకరించికొని యుండిరి. అంత యథోక్తముగా రఘువీరుం డచ్చటికి వచ్చి విమానము దిగి యాతిథేయసత్కారము లందె. మునులు నాతనిం గొనియాశీర్వదించి గౌరవించి 'పితృవాక్యపరిపాలనవ్రతము సమాప్తి నొందినది గావున నిక నేకచ్ఛత్రాధిపత్యమున భూతలమును బరిపాలింప దీక్ష గైకొను' మని యాశాసించిరి.

ఇంతలోం బూర్వపరిచితలైన మునిపత్నులను జూడంబోయి వారితో ముచ్చటించుచు జానకి కొంచెము జాగు చేయ 'నింకను రాలే దేమి?' యని రాముఁడు తొందర పడుచుండె. ఆమెయు నొకతాపసితో మాటాడుచు వచ్చుచున్నంత రాముం డెదు రేగి 'మైథిలీ! నీవు పెంచినపక్షి మృగశాబకములను బూలతీంగెలను జూచితివా?' యని వానిని జూపి, యవు నవు నని యామె యానందించుచు నన్నియు సాభిజ్ఞానముగాం జూచుచున్నంత, 'మనతపస్సునకు సాక్షి భూతమైన నందివృక్ష మిదియే సుమీ! దీనిక్రిందం గూర్చుం డియే నాండు మనము జనకపాదులనివపనక్రమము గూర్చి యాలోచించుచుండం గాంచనపార్శ్వ మను మృగము గనం బడినది' అని చెప్పె. ఆమాట విని యామె యాపత్ప్రసంగము స్మరింపవల దని శంకాభయములు మానె. అంత లక్ష్మణుఁడు సమీపించి 'ఆర్యా! మనభరతుఁడు జననీత్రయమును దమ్ముని గూడి సపరివారముగా వచ్చె' ననుచుండ వారును నచ్చటికే తెంచిరి. అంత సీతారామలక్ష్మణులు తల్లులకు

ప్రమొక్కి వారిదీవన లందుటయు, భరతశత్రుఘ్నులు వీరికి నమస్కరించి యాశీర్వాదము లొందుటయు మున్నుగా నాప్తబంధుజనోచితశిష్టాచారము నడచినంత, భరతుఁడు 'అన్నా! రాజ్యభారము గైకొను' మని ప్రార్థించె. కైకేయియు 'నాయనా! మాయభిలాషము దీర్పు'మని పలికె. అంతలో వసిష్ఠమహర్షియు వామదేవమునియుఁ బ్రకృతివర్గము గొని వచ్చినయాభిషేచనికద్రవ్యములతో వారిని దారసిల్లి వారి వందనము లంది దీవించి యక్కడనే మూర్ధాభిషేకమహోత్సవము జరిగించిరి. ఆసమయమున నాకాశమునుండి 'ఓజనస్థానవాసితాపసులారా! వినుఁడు. ఇనకులభూషణుఁ డగు శ్రీరాముఁడు తనప్రతాపకిరణముల రావణతమము నిర్మూలము గావించి పవిత్రచరిత్ర యగుభూపుత్రిని నిజచ్ఛాయను బోలి తోడ్కొని వచ్చి మహీమండలమునందనాయమానుఁడై జగజ్జేగీయమానుఁడై రాజ్యలక్ష్మీసమాలింగ్యమానుఁడై వెలయుచుండె. చూడుఁడు' అని వినిపించె. అమ్మాటలు విని రాముఁ డాకాశమున దృష్టి నిలిపి 'తాతా! విచారము విడిచి స్వర్గమున నిర్గళానంద మనుభవింపుము. నీయభిలాషము నెఱవేఱినది. భూభారవహనమున రాజ నయితిని. ధర్మపరిపాలనము కరతలగత మయ్యె' నని వచించె. అంత ఛత్రచామరాదిరాజచిహ్నముల విలసిల్లు రామభూపాలునకుఁ దమ్ములును బకృతివర్గమును బాదాక్రాంతు లైరి. విభీషణసుగ్రీవనీలమైందజాంబవదాంజనేయాదిపరమభక్తవర్గము చేతులు

మోడ్చి పురోభాగమున నిలువ రాముఁడు వారి నెల్ల నభినందించె. తల్లులు మువ్వురు రాజయినరాముని జూచి మహానందమగ్నలయిరి. అంత సంకల్పమాత్రసన్నిధానమగు పుష్పకము పుడమికి దిగఁగా రామునానతి నందఱు దానిపై నెక్కిరి. ఆవిమానమును నిమిషమాత్రమున నయోధ్య కేతెంచి వారల దింపెను. పౌరు లందఱు జయజయనినాదములు మంగళకీర్తనములు వేదఘోషము శుభతూర్యధ్వానములు దిక్కులఁ బిక్కటిల్ల శ్రీసీతాసమేతుఁ డగుశ్రీరాముని దోడ్కొనిపోయి ధర్మాసనమునఁ బ్రవేశపెట్టిరి. శ్రీరామునిపరిపాలనమునఁ బ్రజ లెల్లరు సర్వసంపదల సుఖం బుండిరి.

---

## 5. అభిషేకనాటకము

అయోధ్యానాయకుఁ డగుశ్రీరామచంద్రుఁ డరణ్యవాసము చేయుచున్నతఱిఁ గపటతాపసవేషధారి యయినరావణాసురునిమూలముగా సీతాదేవిని గోల్పోయి లక్ష్మణసహాయుఁడై యడవులఁ బడి తిరుగుచు నెందును సీతను గానక దుఃఖసంతప్తహృదయుఁడై యెట్టకేలకు ఋష్యమూకపర్వతముచేరె. అందు హనుమదాదిసహితుఁడై నివసించి యున్న వానరేంద్రుఁ డయినసుగ్రీవుఁ డారాఘవుని జూచి యథోచితముగా నతిథిసత్కారము గావించి యాతనికిఁ గలిగిన కష్టదశ

నెఱిఁగి, తనయన్న యగు వాలిదౌర్ధత్యమును వాఁడు తనభా
ర్యను వశపఱచికొని తన్నుఁ గిష్కింధాపురమునుండి వెడలఁద్రో
చినయుదంతమును దెలిపినంత వారిరువురకు మైత్రి గలిసె.
పిదప దాశరథి వాలిని సంహరించి కిష్కింధారాజ్యమునఁ
సుగ్రీవు నభిషిక్తుఁ జేయుటకును, సుగ్రీవుఁడు సీతాన్వేషణమునఁ
గావలసినంతసాహాయ్యము శ్రీరామునకుఁ జేయుటకును బ్రతిజ్ఞ
లొనరించిరి. అనంతరము వాలిని సంహరింపఁ గలతనపటుత్వ
మును జూప జానకీశుఁడు సప్తతాళములను గూల్చినంత సుగ్రీ
వుఁడు మెచ్చికొని 'దేవా! నాసంశయము వాసినది. నాకు
వానరరాజ్యము చేకూరుటకు నడ్డు లేదనుచు నెల్లరతోఁ
గూడి కిష్కింధోపాంతమునకు వచ్చి రఘురామునను జ్ఞ వడసి
'వానరరాజా! నిరపరాధుఁడ నగునన్ను నవమానించి యిల్లు వెడ
లఁగొట్టితివి. యుద్ధమున నే నిపుడు నీశుశ్రూష చేయఁ దలఁచి
యున్నాఁడ' నని హుంకరించుచు నొక పెద్దబొబ్బ వెట్టి వాలిని బిలిచెను.
ఆపెద్దబొబ్బ వినినవాలి తనభార్యయగు తార తనయుత్తరీయ
ముఁ బట్టికొని నిలుపఁగను వలదని వారించుచున్నను,
“భామినీ! నీ వుండుము. ఒకేదెబ్బకు నాపై వచ్చుసుగ్రీ
వుని భగ్నగ్రీవుని జేసి వానిరక్తము కంటఁ జూచెదను. బ్రహ్మేం
ద్రాదులు మొదలగువారు సంగరమున నన్నెదుర్కొనఁ జాలరనినిఁక
నీక్షుద్రునిమాటఁ జెప్పనేల? తొల్లి యమృతమంథనమున
సురదానవాదులను బట్టి యొకప్రక్క నిల్చిననన్నుఁ జూచి వా
రెల్ల నిశ్చేష్టులయిరన నీయధము నణఁగఁ ద్రొక్కుట నా

కొక లెక్కయా? నీ వింటిలోనికిఁ బో'' మ్మని దానిని బంపి వే
వేగ వచ్చి 'యోరీ! త్రిమూర్తులు నీకు శరణము గాని! నా
కంటఁ బడిన నీ విపుడు ప్రాణములతోఁ మరలి పోవు. గార'మ్మ
నుచు సమీపించె. అంత సుగ్రీవుఁడును గొంచె మీవలికి వచ్చి
యన్నతోఁ గలియఁబడెను. అట్లు వా రిరువురు బాహుయుద్ధ
మారంభించినంత, రాముఁడు వాలిని జూచి యాతనియాకా
రమును వర్ణించుచుండ, సౌమిత్రి 'అన్నా! భయంకరముగ
భుజసంగరము సలుపుచున్న సుగ్రీవుఁడు వాలిచే దెబ్బతిని పడి
పోయెను జూచితివా' యనెను. అంత శ్రీరాముఁడు హనుమం
తుని ప్రార్థనమున నొక్క బాణము విడిచి వాలిని నేలఁ
గూల్చెను.

వాలియు రుధిరకలితగాత్రుఁడై కన్నులు తిరుగుడుపడ
నొకించుకసేపు మోహము చెంది కుదలఁ దెలివి తెచ్చికొని
తనకు నాటినయమ్ము మీఁది చేయి వదివికొని 'రామా! రాజ
ధర్మము నెఱిఁగిననీకు నిస్క్రమముగా మోసమునఁ గొట్టు
ట యుచిత మగునా? ఉత్తమక్షత్రపాత్రుఁడవయు నీవు ఛల
మున నన్నుఁ గొట్టి యపయశస్సుపాలయితివి. నీవు చేసిన
పని యెంతయు నధర్మ' మని నిందింప, రామచంద్రుఁ
'డోరీ! యీవధ యధర్మము గాదు. వల పన్ని మాటున నిలిచి
మృగములఁ జంపుట వేఁటధర్మము. వధ్య మయినమృగము
నగుట నిన్నిట్లు కొట్టితిని: ఇందు దోష మేమి' యనెను. నేను
దండ్యుఁడ నగుటకుఁ గారణ మే మని వాలియడుగ, రాముఁ

డు 'నీవగమ్యాగమనము గావించితివి గావున శిక్షకర్హుఁడ వయితి'వనెను. దానిపై వాఁడు మాకిది ధర్మమే'యన రాఘవుఁడు మంచిది. నీవు ధర్మాధర్మము లెఱిఁగియు సోదరపత్నినపహరించుటకు మృగత్వము నుపయోగించుకొంటివిగదా! ఇఁక నిన్నుఁ జంపుట యెట్లధర్మమో చెప్పు'మనెను. అంత వాలి 'రామచంద్రా! యిఁక నాకు మాఱు వలుక నోరు రాదు. నీదండనమున నేను విగతదురితుఁడ నైతి'ననుచు మరణబాధ నొందుచుండ సుగ్రీవుఁడు విలపింపఁజొచ్చె. ఈ యార్తనాదము వినిన తారాదిస్త్రీజనము రోదనము గావించుచు వచ్చుచుండ వాలిచే నియోగింపఁబడి సుగ్రీవుఁడు వారిని లోనికిఁ బంపివైచె. అంత నంగదుఁడు తండ్రిదురవస్థను విని యచ్చటికి వచ్చి భూశయనుండగు నున్నవాలిని జూచి దుఃఖించుచు నేలపైఁ బడె. వాలి యంగదునిఁ జూచి 'నాయనా! విచారింపవలదు; లోకధర్మ మిట్టిదే. సుగ్రీవా! నాతప్పు సైరింపుము మఱచిపొమ్ము. శ్రీరామా! నాతమ్ముఁడు నా పుత్రుఁడు నెట్టితప్పులు చేసినను వీరివానరచాపలమును మన్నించుచుండుము' అనుచుఁ బలికి సుగ్రీవునకుఁ దనహేమమాల నిచ్చి యాంజనేయునిచే నీరు దెప్పించి యాచమించి 'నాప్రాణములు పోవుచున్నవి. ఇదిగో విమానము వచ్చినది' అనుచు శరీరమును విడిచి పరమపదముఁ జెందెను. సుగ్రీవుఁడు నాతని కగ్నిసంస్కారాదిక్రియలు గావించినతరువాత శ్రీరాముఁ డాతనిఁ గిష్కింధారాజ్యమున కభిషిక్తుఁ గావించె.

అటుపిదప సీతను వెదక నలుదిక్కులకు వెడలినవానరులలో నంజనానందనుఁడు సంపాతివలన రావణుఁడు సీతను లంకలోనికిఁ గొనిపోయినవార్తఁ దెలిసికొని సాగరమును దాఁటి లంకఁ జొచ్చి యందెల్లెడలు పరిశోధించి యొక్కచోఁ బ్రమదవనమున నశోకభూరుహముక్రిందఁ గూరుచుండి భర్తృవియోగమునకు శోకించుచున్న జానకిని గని 'రాక్షసాంగనలచేఁ జుట్టఁబడినయీనారీమణి నీలజీమూతమధ్యగత యయిన విద్యుల్లేఖవలెఁ గనఁబడుచున్నది. ఈమె శిరోజము లన్నియు నొక్కవేణిగాఁ గూడినవి. పతివియోగార్తయై నిద్రాహారములను బరిత్యజించుటచేఁ గాఁబోలు నీవనితయొడలెల్లఁ జిక్కిపోయినది కావునఁ దప్పక యీసతియే శ్రీరామపత్ని యగు' నని తలఁచుచు, నంతలోఁ గొనిఁబడినదీపకాంతిఁ గని దాని వెలుఁగున వచ్చుచున్న దశగ్రీవు నవలోకించి యొకయశోకపాదపముకొమ్మలనడుమ నిలిచియుండెను.

అంతట దశకంఠుఁడును నిశాచరాంగనలు చుట్టును నడచుచుండ హరిణీమధ్యగతమయినహర్యక్షము మాడ్కి నేతెంచి సీతను సమీపించి 'యోరమణీ! దేవదానవులకు శాసకుఁడ నయిననన్ను వరింపక యొకక్షుద్రమానవునియెడ బద్ధానురాగవై యుండుట తగదు, నన్నాశ్రయించి నాయైశ్వర్య మంతయు ననుభవింపుము. ఉగ్రమయినవ్రతమును విడిచిపెట్టుము వృథాకాలయాపనము చేయకు' మనుచుఁ బలుక, శ్రవణకఠోరము లయినయాపలుకుల కులికి యాసతి, ఛీ! వీఁడు సుభా

మహాసాధ్విని గూడ నెఱుఁగని మూఢుఁ'డని మనస్సున నేవగించుకొనియెను. హనుమంతుఁడును వానిమాటలకుఁ గినిసి వీనిని జంపక విడువరాదు. వీనిని బరిమార్చినంతనే రామకార్యము సిద్ధించు నవకాశము సత్యమే కాని దైవప్రాతికూల్యమున నేనే యితనిచేఁ జిక్కినచోఁ గజ్జము చెడిపోవును గావున వేగపడ రాదనుకొని యూరక శాంతించెను.

అంతట రావణేంద్రుఁడు వెండియు 'నేమి సీతా! బదులు చెప్పవు? బహురత్నభూషితాంగుఁ డయిన యీదశగ్రీవుని వరింపు'మన, నామె 'చోరా! నీచమతీ! నిన్ను శపించితి'ననెను. అంత నా దుర్మార్గుఁడు 'కటకటా! పతివ్రతా తేజ మెంతతీవ్రమాయెనకట! ఎల్లలోకములను జయించిన నాకీసీత శాపవచనము మోహము నిర్బంధించుచున్నది గదా!' యని శోకించుచు స్నానవేళ యగుటచేఁ బిలువ వచ్చిన పరిచారికలతోఁ గూడి యింటికిఁ బోయెను. తాఁనున్న చెట్టుననే హనుమంతుఁడు రాక్షసాంగనలు నిద్రించుచుండ నదను పట్టి చెట్టుదిగి సీతను సమీపించి 'తల్లీ! దేవీ! నీభర్త పంపించియుండె. నీకై పరితపించుచు శ్రీరామరఘునాథుఁడు నిన్ను వెదక నన్నుఁ బంపె'నన, నప్పతివ్రత తనలో 'నీఁడెవఁడో రాక్షసుఁడే వానరరూపము దాల్చి వచ్చి నన్ను వంచింపఁ దలపోయుచుండె. కానీ! యూరకుండు'మని బదులు చెప్పక యుండె. ఆంజనేయుఁడును సీత తన్ను నమ్మమి శంకించికొని 'దేవీ! నీవిభుఁడు వానరేంద్రుఁ డయినసుగ్రీవునితో బద్ధసఖ్యుఁ డయియుండె. వా రిరువురును నన్నుఁ బంపిరి. నేను

హనుమంతుఁ డను పేరు గలవాఁడను. నీవు సంశయింపక నా మాట వినుము. రామచంద్రుఁడు నిన్నుఁ బాసినది మొదలుగా నిద్రాహారములు విడిచి యొడ లెల్లఁ జిక్కి తెల్లవడ జీవముతో నున్నాఁడు. నిక్కముగా నే నాతనిదూత' యని పలుక, నామె యామాటలు విని పతిదుఃఖంబునఁ దనశోక మినుమడింపఁ గడుఁ గలఁత పడియు మగనివార్త నెఱుఁగుట కానందించి మెల్లగా 'భద్రా! మీతో నార్యపుత్రునకుఁ బరిచయ మెట్లు కలిగెనో చెప్పు'మనెను. అందుకుఁ గపీశుఁడు 'భవతీ! సుగ్రీవున కపకృతి చేసినవాలిని సంహరించి యతనికి గిష్కింధారాజ్య మిచ్చి యాతనిమైత్రి నడసి పిదప నిన్ను వెదక వానరులను నలువంకలకుఁ బనిచె. వారిలో నేను సంపాతివచనమున నిలంక కరుదెంచితి. దేవి! నీవు విషాదపడ నక్కఱ లేదు. దాశరథి వి ల్లెక్కు పెట్టికొని కపిసేనతో లంకాపురమునకు రాఁగలఁడు. ధైర్య మవలంబింపు నామాట నమ్ము. శ్రీరామునియంగులీయక మిదిగో, పరిగ్రహింపు'మని సమర్పింప, జానకి యత్యానందమున దానిఁ గైకొని 'భద్రా! యింతదనుక నిది స్వప్న మేమో యని తలఁచితిని గాని యిపు డంతయు సత్య మయినది. నాయవస్థను విని యార్యపుత్రుఁడు శోకపరవశుఁడు గానియట్లుగా నాయుదంత మాతనికి వినిపింపు. శీఘ్రముగఁ బొ'మ్మనెను. హనుమంతుఁడును సెలవు గైకొని యీవలికి వచ్చి 'నారాక రావణుని కెఱిఁగింపక యూరక పోనేల? ఈయుద్యానము నెల్లఁ బాడు చేసి పో

యెవఁగాక'యనుచుఁ బుష్పితలతాపాదపముల నెల్లఁ బెఱికి గుట్టలు వెట్టుచుండె.

ఆంజనేయునిచేష్టలను వానిబలదర్పములను బ్రమదవన నాశనమును గాంచినవనపాలకులలో నొకఁ డగు శంకుకర్ణుఁడు మొఱ్ఱవెట్టుచు వచ్చి యావృత్తాంతము రావణునికిఁ దెలుప, నతఁడు వెఱఁగుపడి కోఁతి యేమి! పోతుటీఁగ కయినను జొరరానినాపూలతోఁటఁ జొచ్చి నాప్రియసతి గూడ స్నేహమున నొక్కచిగు రైనఁ జిదుమనిపూలతీఁగెల నాఁడుఁ బెఱుకుట యేమి! ఇంద్రశత్రునియశోకవనమునం గలిలేఁతచెట్లు లాగి వైచెఁ గదా! కానీ, యాదుష్టజంతువును గట్టి తీసికొని రమ్మని యానతిచ్చె. అందుకుఁ దోఁటమాలి "అయ్యా! ఆకోఁతి ననుబోఁటివాండ్రకు లొంగునదిగా'దని విన్నవింప, నాతఁ "డట్లయిన నామాటచే వేయిమందికింకరులఁ దోడ్కొని పోయి దానిని బట్టికొని ర'మ్మని సెలవిచ్చె. వాఁడు సల్లే యని వెడలి తిరిగి వచ్చి "దేవా! వెళ్లినవా రందఱు మృతు లయిరి. ఇఁక ముందుపని యేమో సెల వి'మ్మన నద్దేవారి యచ్చెరువొంది, యట్లయిన నక్షకుమారుని బిలిచికొని పొ'మ్మనెను. వాఁడును సరి యని వెడలి మరలివచ్చి 'స్వామీ! కుమారుఁడు నతనితో వచ్చినయైదుగురు సేనానాయకులుఁ గూడ నవ్వానరునిచేతి లోనిగుదియచే నేలఁ గూలిరి. అక్షకుమారునిచిత్రవధ చూచిన నామేనివణఁకు ఇంకను వదలలేదు. దేవా! యావనచరునిపరాక్రమ మేమి చెప్పుదును? మెడ పట్టుకొని వంచ యొక్కగ్రుద్దు

గ్రుద్దినంతనే మనయక్షకుమారుఁడు ముక్కుల నోట నెత్తురు గాఱఁ బుడమిపైఁ బడి ప్రాణములు విడిచె'నని విన్నవింప, సురారి క్రోధపరవశుఁడై 'యింద్రజిత్తును దోడ్కొని పొ'మ్మనెను. వాఁడును 'చిత్త' మని పోయి వచ్చి 'దేవా! జయము జయము. తుములయుద్ధమున మనయింద్రజిత్తు, ఆవానరుని బట్టి పాశముల బంధించి యిచ్చటికిఁ దీసికొని వచ్చుచున్నాఁ' డనెను. అంత రావణుఁడు 'దీని కాశ్చర్య మేమి? అతఁడు వచ్చులోపుగా విభీషణుని దీసికొని ర'మ్మని చెప్ప, వాఁడు వెడలి యాతనిఁ బిలిచికొని వచ్చెను. విభీషణుఁడును సోదరుని సమీపించునంతలో నింద్రజిత్తు గూడ హనుమంతునితో నచ్చటికి వచ్చె. అచ్చటివా రందఱు నక్కపివరుని జూచి విస్మితు లగుచుండ, హనుమంతుఁడు 'రావణా! నన్ను నీకొడుకు పట్టికొనలేదు. నేనే నిన్నుఁ జూచెడితలఁపున నితనికిఁ బట్టువడితిని. నీవు కుశలముగా నుంటివిగదా!' యని పలుక, నతఁ 'డోరీ! నీ వెవఁడవు? ఎందు కిందు వచ్చితి' వనెను. ఆంజనేయుఁ డామాట విని రాక్షసరాజా! నే నంజనాదేవిపుత్రుఁడను మారుతునియౌరసుఁడను. రాఘవరామునియానతిచే నిచ్చటికి వచ్చితి'నని చెప్ప విభీషణుఁడు 'సరియే కాని యామహనీయుఁ డేమి చెప్పి నిన్నంపె'నని యడిగె. అందు కతఁడు 'రామశాసనము దెల్పెద వినుఁ' డనుచుండ, రావణుఁడు కోపముతో 'రామశాసనమా? ఛీ! వీనిని జంపివేయుఁ' డనెను. అందుకు విభీషణుఁ 'డన్నా! దూతలనుఁ జంపుట ధర్మము గాదు. అది గాక రామవచన

మ్మును బూర్తిగా విని పిదప నీకుఁ దోఁచినట్లు చేయు'మని వారింప, రావణుఁ 'డేమి చెప్పెను మీమానవుఁ'డని యడిగె. దానిపై మారుతి 'శంకరుఁ డడ్డపడనీ, రసాతలమున దాఁగియుండనీ, బాణఘాతముల మే నెల్లఁ దూటువడఁ జేసి రావణుని యమమందిరమున కతిథినిగాఁ జేసెద నని శ్రీరాముఁడు దృఢప్రతిజ్ఞుఁడై యుండె'నని వివరింప, రావణుఁడు నవ్వి 'యుసీ! దేవదానవాదులు నాకు జంకి లొంగిరే. అట్టియెడ నీమానుషాధముఁడు నాకెదురగునా?' యని ధిక్కరించె. అంత వాయుపుత్రుఁడు 'సరియే నీ వంతటిశౌర్యశాలి వైన దొంగతనముగా సీతను దెచ్చితివేల'యనియడుగ,విభీషణుఁడు 'మహారాజా!వానరునివచనము యుక్తముగా నున్నది. నీవు రాముని మోసపుచ్చి సన్యాసివేషమున జానకి నపహరించినమాట నిక్కము గదా!' యనెను. అంత రావణుఁ 'డోరి! నీవు శత్రుపక్షమునఁ జేరితివా?' యన నతఁడు 'సోదరా! అనుగ్రహింపుము. నాహితవచన మాలకింపుము. రాఘవుని కాంతనిధర్మపత్ని నిచ్చి రాక్షసవంశమును రక్షింపు' మని బోధించె. అందు కాదుర్మతి 'తమ్ముఁడా! నీకు భయము వలదు. సింహమును లేడియు, మదపుటేనుఁగును నక్కయుఁ జంపఁ గలుగునా? సంశయింపకు' మనఁ గపివీరుఁడు 'నక్తంచరాధమా! భువనైకనాథుఁ డయిన శ్రీరామచంద్రుని దూఱ నీ వెంతటివాఁడవు. నోరు మూసికొని పడియుండు' మనెను. అంత నారక్కసుఁడు 'శంకుకర్ణా! దూతవధ యుచితము గాదు గావున నీనీచునితోఁకకు నిప్పంటించి విడిచిపెట్టు' మని

యానతిచ్చి 'యోరీవానరా! భార్యావియోగమునఁ గ్లేశపడి యవమానమున వనరుచున్న యామానవాధమునకు శక్తి గల దేని సంగ్రామమునకు రమ్మని చెప్పు'మనెను. పిదప రక్క-సులు హనుమంతు నావలికిఁ గొంపోయి వానివాలమునకు నూనెగుడ్డలు చుట్టి యగ్గి ముట్టించి విడువ, నతఁడు దానితో లంకాపుర మంతయుఁ గాల్చి యావార్త వినినసీత సల్పిన యగ్నిధ్యానమున నగ్నిబాధ శాంతింప సుఖముగా సముద్రము దాఁటి వచ్చి రామసుగ్రీవులను గలిసికొనెను.

అట్లు హనుమంతుని నిశాచరులు తీసికొనిపోయిన పిదప విభీషణుఁడు తనశక్తికొలఁది రావణునకు హితము పదేశింప నతఁడు' కినిసి ఛీ! శత్రుపక్షావలంబీ! నాయెదుట నుండవలదు పో! నీవు వలచినయెడకుఁ బో నాకంటఁ బడకు' మని నిందింప, విభీషణుఁడు 'సోదరా! నాచెప్పిన పథ్యవచనములు నీచెవి కెక్క-నవి గావు. నే నిపుడ పోయి రఘుకులాలంకారు నాశ్రయించి నశించినరాక్షసవంశమును మరల నుద్ధరించెద'నని చెప్పి వెంటనే బయలుదేఱెను.

సీతాదేవి లంకలో నున్నదనెడివార్తను హనుమంతుని వలన వినినంతనే రామలక్ష్మణసుగ్రీవులు కపిసైన్యమును నడిపించికొని సముద్రతీరమునకు వచ్చి సాగరతరణమున కుపాయమాలోచించుకొనుచున్నంతలో నాకసమునుండి విభీషణుఁడు క్రిందికి దిగెను. వానిని జూచి వానరులు 'రాక్షసుఁడు వచ్చెనని కేకలు వేయుచుండ, హనుమంతుఁడాతని సమీపించి

వానివృత్తాంతమంతయుఁ దెలిసికొని యాతనిఁ దోడ్కొని పోయి 'దేవా! రావణసహోదరుఁ డయినవిభీషణుఁ డన్నచే నవమాన మొంది శరణార్థియై నీకడకు వచ్చె'నని రామునకుఁ జూప, నతఁ డానందించి 'లక్ష్మణా! యీతనికిఁ దగినసత్కారము గావించి మనమిత్రబృందములోఁ జేర్పు'మనెను. అంత సుగ్రీవుఁడు 'దేవా! రక్కసులు మోసగాండ్రు. వారిని నమ్మనలదు. ఈతనిఁ బరీక్షింపక మనలోఁ జేర్చుకొనుట ప్రమాదకర'మని నుడువ, హనుమంతుఁడు 'మహారాజా! అట్లు గాదు. నేనీతనియుద్దేశమును రాక్షససభలోనే కనిపెట్టితిని. మనవలెనే యీతఁడును శ్రీరామచంద్రునకుఁ బరమభక్తుఁడు, సందియపడ నక్కఱలే'దని గట్టిగాఁ జెప్పె. అంత రాముఁడు 'విభీషణా! నేఁడే నీకు లంకారాజ్య మిచ్చితిని. నేఁటినుండి నీవు లంకేశ్వరుఁడవు. మామిత్రుఁడ'వని సాదరముగఁ బలికినంత, నతఁడు మహాప్రసాద మనుచు నమస్కరించి తన్మిత్రగణనీయుఁడయ్యె.

అనంతరము రాముఁడు పారావారతరణంబున కుపాయమే మని చింతించుచుండ, విభీషణుఁడు 'దేవా! సరిత్పతి మనకు దారి చూపఁడేని యొకదివ్యాస్త్రము ప్రయోగించుటయే పని'యని విన్నవించె. దాని విని యతఁడు 'మంచిసాధనము చెప్పితి'వనుచు లేచి సముద్రముపైఁ గోపమున శరము సంధించునంత'! వరుణదేవుఁడు ప్రత్యక్షమై 'త్రైలోక్యకారణా నారాయణా! నమస్కారము. మీకు మార్గము సిద్ధముగా నున్నది చూడుఁ'డని పలికి యంతర్హితుఁడయ్యె. అంత సముద్రము

పాయ యిచ్చుట గని లక్ష్మణుఁ 'డాహా! యేమి యీచిత్రము! కువలయశ్యాముఁడై మణికిరీటము దాల్చి వచ్చినదివ్యపురుషుఁ డేఁడి? జీవలోకంబునఁ గనదివ్య తేజము వెదచల్లునమ్మహానీయుఁ డెవఁడో' యన, విభీషణుఁడు 'కుమారా! యతఁడు వరుణుఁడు. చూడుము మదిగో సాగరము శాంతతరంగమై రెండుగాఁ గనఁబడుచున్న' దనెను. పిదప రాముఁడు సంతుష్టహృదయుఁడై 'యాంజనేయా! నడు; ముందు నడు; లంకకుఁ బోయెద'మన నతఁడు దారి తీయ నందఱు సింధువు తరించి లంకఁ బ్రవేశించిరి. రాముఁడును లంకాపురము నవలోకించి 'యకటా! యీపుర మనెడియోడ రావణుఁ డనుకర్ణధారుని దోషమువలనఁ గపివరసైన్యతరంగతాడితమై మదీయబాణచండమారుతసముద్ధూతమై పగిలి పోవ నున్నదిగదా!--సుగ్రీవా! మన సైనికుల నీసువేలాద్రిపై నించుక సేపు విశ్రమింప నిమ్ము' అని యట్లు గావించినంత, నీలుఁడు వచ్చి 'దేవా! యెవరో యిరువురు వనవాసులు మనశిబిరములఁ బ్రవేశించిరి. వీరి నేమి చేయఁదగునో దేవర సెలవీయఁదగు'నని వారి నిద్దఱిని దోడ్కొనివచ్చి చూపఁ, బుస్తకహస్తు లయియున్నవారిని విభీషణుఁడు సావధానముగాఁ జూచి 'దేవా! వీరు వనవాసులుగారు. రావణుఁడు పంపినకపటవేషధారు లగుశుకసారణు లనురక్కసులు. తప్పక వీరు దండ్యులనెను. అందుకు రాముఁ డంగీకరింపక 'యోరీరక్కసులారా! మిమ్ము శిక్షించిన నాకుఁ గలుగులాభము లేదు. నాకు మహోపకారము గావించినమీరాజును రణమునకు

రమ్మంటి నని నామాటగాఁ జెప్పుఁడు పొం'డని వారిని విడిపించెను. వారును విభీషణుఁడు త మ్మెఱుఁగుటకు లజ్జించి శ్రీరాముఁడు చేసినయుపకృతి కానందించి రావణునిచెంత కేగిరి.

అనంతరము నిశాచరబలమును గపిసైన్యమ్మును దలపడి పోరు సలుప నారంభించినవి. ఆమొనఁ బ్రహ స్త కుంభకర్ణాదిమహావీరు లందఱు మడిసిరి. కడపట నింద్రజిత్తు సేనను బురికొలిపి యనిమొననిలిచి రణము గావించుచుండె. ఇట్టితఱి నైనను రావణుఁడు శ్రీరామునకు సీతను సమర్పించి పాదాక్రాంతుఁడు గాక పైగాఁ గామపరవశుఁడై విద్యుజ్జిహ్వుని బిలిచి 'రామలక్ష్మణులతలలవంటితలలు రెండు తెమ్మని నియోగించి తాను సీతను సమీపించి భామినీ! నీనిమిత్తముగా నిద్రాహారములు విడిచి కృశించితిని. నీ విఁక రామునిపై నాస వదలుము. నన్ను వరింపు' మని దురాలాపములు పలుక, నామె ఛీ! మూఢా! యచిరకాలమున నీవు రణరంగమునఁ గూలుట విన కుందునా?' యని తలఁచుచుఁ దలవంచికొని యుండె. అంతలో విద్యుజ్జిహ్వుఁడు రెండుశిరస్సులు చేతఁ బట్టికొని యొక్కపరుగున వచ్చి 'మహారాజా! యీమానవాధములమస్తకము లివిగో చూడు'మనుచు రావణునిముందఱఁ బెట్టె. అంత వాఁడు 'సీతా! నీపతిదేవరులశీర్షములు చూచితివిగదా ఇంకను గొంకేల?' యని మూదలింప, నాదేవి వానిని జూచి 'హా! ఆర్యపుత్రా! నన్ను దుఃఖసాగరమున ముంచి నీవు పోయితివా? యని పలవించుచు 'నో రాక్షసా! నానాథుని

జంపినకత్తితో నా గొంతు కోసి నాకు మే లొనరింపు' మని చెప్పుచు శోకపరిభూతయై మూర్ఛిల్లె. ఇంతలో నింకొకఁడు సత్వరముగ వచ్చి 'మహారాజా! శ్రీరాముఁడు' అని యేదో చెప్పుచుండ జానకి యులికిపడి లేచి 'భద్రా! చిరంజీవివి కమ్ము' అని దీవించె. అంత రావణుఁ డేమిరా! శ్రీరాముఁ డేమి?——యని యడుగ, నారక్కసుఁడు 'స్వామీ! మహాబలశాలియు సానుజుఁడు నగు శ్రీరాముఁడు నిన్నయిన గణింపక యింద్రజిత్తును దెగటార్చె' నని చెప్పె. ఆమాట విని యాపాపి 'హా కుమార మేఘనాదా!' యనుచు మూర్ఛిల్లి సేవకులసోపచారవచనములఁ దెలివిచెంది యీకఠినాత్మురాలుమూలముగా నాకులమున కింత గతి పట్టినది. దీనిని జంపి పోయి యావానరుల నఱుకువాఁడ ననుచుఁ గత్తి దీయఁ, బరిచరులు 'దేవా! స్త్రీవధ కర్తవ్యముగా' దనుచు వారించిరి. అంత నాతఁడు కసుఁ గుపితుఁడయ్యు సన్నాహము పూని యరదమెక్కి రణరంగమునకుఁ జనెను. సీతయు రామలక్ష్మణులు జీవించి యుండుట కానందించి వారికి జయము గలుగుఁగాక యని యీశ్వరుని బ్రార్థించుచుండె.

చిత్రరథాదివిద్యాధరు లాకసమున నిలిచి రామరావణయుద్ధము చూచుచుండిరి. రణరంగము చూపఱకు భయంకరముగ నుండె. కపివీరులపిడికిటిపోటులచే హతశేషు లయిన రజనీచరులు గతప్రాణులై నేలఁ గూలుచుండిరి. కొందఱు రాత్రించరవీరులును వానరులను మ్రింగ నోళ్లు తెఱచికొని వారి

పైఁబడుచుండిరి. అట్టియెడ రావణుఁడు కాలాంతకతుల్యమయి నశక్తిని రామునిపైఁ బ్రయోగింప, నతఁడు నవ్వుచు దాని నొక్కబాణమున రెండుముక్కలు చేసె. అంత లంకేశుఁడం పవాన గురియింప, జానకీశుఁడు వాని నెల్ల నడుమనే ఖండించి పాదచారిగనే ముందు చని నిశితబాణముల వాని నొవ్వఁ గొట్టి, యంతలో నింద్రునియానతిచే మాతలి దోలుకొనివచ్చిన రథ మెక్కి త్రిపురవధకాలమందలియీశ్వరునికై వడి శోభిల్లు చు సూర్యుఁడు తనవేఁడివెలుఁగులఁ బుడమిని దహించునట్లు శస్త్రాస్త్రనిచయముల వానిని దపింపఁ జేయుచుండె. అట్లు పరా క్రమించి తనరథరథ్యకేతువులఁ జూర్ణము చేయుచున్న రాముని బాణములకుఁ బ్రతిక్రియ లొనరించుచు రావణుఁడును విజృం భించి యనేకఖరశరములు విసిచియు ఫలమునొందఁడయ్యె. శ్రీరాముఁడును వీని కింతయోల యనుచు నొకదివ్యాస్త్రము నభి మంత్రించి ప్రయోగించినంతఁ బ్రలయకాలాగ్నిని బోలి ప్రజ్వ లించుచున్నయది రావణునిపదిశిరముల మొదలంటు నఱికి మరలఁ దూణీరముఁ బ్రవేశించె. రావణుఁడును ఱెక్కలు దెగినపర్వతముకైవడి రణభూమిఁ బడియె. అంత నాకసమున దేవదుందుభులు మ్రోఁగినవి. రామునిపైఁ బూలవాన కురిసిన ది. అంతరిక్షమున సురగంధర్వాదులు సోత్సాహముగ రాము ని బొగడిరి.

లోకకంటకుఁ డయినరావణు నట్లు పరిమార్చి శ్రీరాముఁ డు సీత నూఱడింప సపరివారముగ బయలువెడలియు స్సౌ

మిత్రీ! రక్కసునిచే నపహరింపఁబడి కలంకితయై యున్న జానకిని నేను జూడఁజాల'నని పలుక, విభీషణుఁడు 'దేవా! పరమపతివ్రతయెడ నిట్టిశంక యుచితము గాదు. నిన్నే నిరంతరము ధ్యానించుచు నిరాహారయై ప్రాణమాత్రావశిష్టయై యున్న యాసతీతిలకము నాశ్వాసింపు' మనుచు విన్నవించె. లక్ష్మణుఁడును 'మహారాజా! నీయభిప్రాయ మిట్లుండు నని తలఁచి యాదేవి యగ్నిశుద్ధిఁ గాంచ నార్యునియనుమతిని గోరుచున్న దఁట,' యని పలుక, రాముఁ డట్లే కానిమ్మనెను. పిదప సౌమిత్రి యగ్నిసన్నాహము గావించి వచ్చి 'అన్నా? హంసి పద్మవనమును జొచ్చునట్లుగా మైథిలి పావకమునఁ బ్రవేశించుచున్నది. చూడు' మన, నతఁడు నిర్వేదపడి 'తమ్ముఁడా! నివారింపు నివారింపు'మనెను. అంతలో హనుమంతుఁడు వచ్చి 'దేవా! నీధర్మపత్ని పుటపాకమున నున్నఁ గెక్కిన మేలిమిబంగారువలె వైశ్వానరుని జొచ్చి వర్ధితప్రభయై నిర్వికారముగా వెడలి వచ్చినది చూచితివి గదా!' యని హెచ్చరించె. పిదప సుగ్రీవుఁడును జెంతకు వచ్చి 'దేవా! చూడుము. అంకములో నున్న జనకరాజపుత్రిని బురస్కరించుకొని యగ్నినుండి వెడలిన యొకదివ్యపురుషుఁ డిటు వచ్చుచున్నాఁ'డన సౌమిత్రి సాశ్చర్యముగా 'నిజముగా నీతఁ డన్యుఁడు గాఁడు. హుతాశనుఁడే' యనెను. ఇట్లు వీరు ప్రశంసించుచుండఁగా జానకితో నగ్నిహోత్రుఁ డచ్చటికి వచ్చి 'శ్రీమన్నారాయణా! రామదేవా! సర్వలోకనమస్కృతయు నిర్దోషురాలు పరిశుద్ధురాలు నగు నీ జానకిని బరిగ్రహింపుము. ఈమె భ

గవంతుఁడె వచ్చి నన్ననుసరించి మానుషదేహము దాల్చిన లక్ష్మి గాని మానవాంగన గాదని విన్నవింప, నాతఁ డాతనికి నమస్కరించి 'మహాత్మా! ఇది మహాప్రసాదము. జానకి శుచిత్వమును నే నెఱిఁగియు లోకమునకు విశ్వాసము గలుగుటకై యగ్నిశుద్ధి కొడంబడితిననుచుఁ బ్రశంసించె. అంత 'శ్రీరామచంద్రా! బ్రహ్మ నీహృదయము, రుద్రుఁడు నీకోపము, చంద్రదివాకరులు నీకన్నులు, భారతి నీ జిహ్వ, ముల్లోకములను సృజించినవాఁడవు నీవ. ఈసీత సాక్షాల్లక్ష్మి; నీవు ప్రత్యక్షనారాయణుఁడవు. మత్స్యకూర్మవరాహవామననరసింహాదులు నీయవతారములు గాదా! రావణసంహారమునకు దాశరథివై యవతరించిననీవు జనార్దనుఁడవు గావా! ఇఁక లక్ష్మియైనసీతయెడ లోకాపవాదము గలుగునని యనుమానింపనేల? జానకిని బరిగ్రహింపుము' మని యనేకరీతుల వినుతించెను. అనేకు లాశ్చర్యనిమగ్నులై హాహాకారములు సేయుచుండ, నగ్ని 'రామా! దేవదేవర్షిసిద్ధగంధర్వాదులు నిన్ను బ్రశంసించుట సీతామహాసాధ్విత్వమున భాగ్యసిద్ధి గంటివిగదా!' యనఁ, రాముఁడు, పరమానందనిమగ్నుఁ డయ్యెను. అంతఁ గౌశికుఁడు మంత్రపూతజలములచే శ్రీరామున కభిషేకము గావించె. అంత రాముఁడు 'వత్సా! లక్ష్మణా! మన తండ్రి నన్ను సింహాసనమునఁ గూర్చుండఁ బెట్టి చేతికిఁ గంకణము గట్టియు, మనమధ్యమాంబకుఁ బ్రియము చేయఁ గోరి యప్పటికినాయభిషేకమునకు విఘ్నము గలిగించె. దేవత్వము నొందినయాతఁడే యిపుడు మరలఁ బావకరూప

మున వచ్చి నా కభిషేకము గావించె'నని ప్రశంసింప, వీతి హోత్రుఁడు 'శ్రీరామా! భరతశత్రుఘ్నులును సీతల్లులును నీప్రజలును నీరాకకై యెదురుచూచుచున్నారు. ఇఁక జాగు చేయక యయోధ్య కేగి వారికి నేత్రానందము గలిగింపుము. నీపాలనమున ధరిత్రి సకలసంపత్సమృద్ధయై వెలయుఁగాక. సకలభోగముల నీవు తులఁదూఁగుదువు గాక, యని యాశీర్వదించి యంతర్హితుఁ డయ్యె. శ్రీరామమూర్తియు ధర్మపత్నీ పరిగ్రహణమున నానందించి 'యామెతో' సపరివారముగ నయోధ్యకు వచ్చి సకలజనరంజకముగఁ బరిపాలన మొనరించుచు సుఖం బుండె.

---

# 6 చారుదత్తము

---

ఉజ్జయినీనగరమునఁ జారుదత్తుఁ డను బ్రాహ్మణుఁ డొకఁడు గలఁడు. అతఁడు వాణిజ్యమున విశేషధన మార్జించి నసార్థవాహపుత్రుఁడు, విమలచరిత్రుఁడు; సత్యవ్రతుఁడు, పరోపకారరతుఁడు; అతిథుల నభ్యాగతులను మృష్టాన్న దానమునఁ దనుపుటయే కాక బంధుమిత్రులను బెక్కుతెఱఁగులఁ బోషింప విశేషించి ధనము వెచ్చపెట్టినవాఁడు. అట్టివాఁడు కొండొకసమయమునకుఁ గర్మవశమునఁ దనధన మెల్లఁ గోలుపోయి

యు, సుగుణధనమునకుఁ గొఱఁత లేక, యున్నదానితో నే యతిథిపూజ గావించుచుఁ గాలము గడపుచుండె. అతనికి మైత్రేయుఁ డను విప్రుఁ డొకఁడు పరమమిత్రుఁడు. విశ్వాసపాత్రుఁ డైన యాతఁడు హాస్యకారియై చారుదత్తునకుఁ దోడునీడవలె నుండెను. కలిమి గలకాలమునఁ జారుదత్తునియింటఁ బడి పిండు లారగించి త్రేన్చుచు ముఖస్తుతులు చేసి ధన మొడిసిన మిత్రు లా కలిమితోనే పోయిరి గాని, లేమి వచ్చినయత్తఱి మైత్రిని కృతజ్ఞతను మఱవక ప్రాణమిత్రుఁడై మైత్రేయుఁడు మాత్ర మాతని నంటిపెట్టుకొని యుండె.

ఆ యూరనే వసంతసేన యను నొకభోగముది గలదు. అది జాతిచే వేశ్య యయ్యు [illegible] త్తికి లొంగక బోలిన ది. ధనాశ లేనిది, [illegible] వచ్చినను [illegible] సి సంతో[illegible] గన్నెఱికి మొల్లక కన్నెఱికమున నున్న [illegible], చారుదత్తుఁడు దరిద్రుఁడయ్యెనని యెఱిఁగియు, [illegible]పసౌందర్యసౌశీల్యాదిసుగుణములకు వలచి యెట్లైనను వానిని జేపట్ట యత్నించుచుండె.

చారుదత్తుఁ డొకనాఁడు కొంచెము చీకటిపడిన తరువాత రదనిక యను పరిచారిక దీపముతోఁ దోడ రా మైత్రేయుఁడు తోడుగా నభ్యంతరగృహము వెలువడి యీవలికి వచ్చి గృహదేవతలకుఁ బూజ నొనర్చి ముంగిటివాకిట నిలిచి నిట్టూర్పు విడిచి "వయస్యా! దారిద్ర్య మనఁగా మనస్వియైన మానవునకు నాడుపుతోఁడిమరణము సుమీ! ఆహా చూచితివా?

మున్ను మనయింటి వీధిగడపలప్రక్కలఁ బడినభూతబలి యందలి పుష్పములను హంసలును సారసపక్షులును వేఱు పఱచుచుండెడివి. ఇపుడో, మునుపటి యవధాన్యపుమొలకల జెన్నగు నాభాగములయందుఁ బుట్టగు నాకినగింజలు బలిగాఁ బడుచున్నవి'' అని పరితపింప, సవిదూషకుఁడు "నీ విందు విచారింపవలసినపని లేదు. పునపయౌవనముఁబోలి గృహ యౌవనము దశావిశేష మనుభవించుచుండును. బహుళ పక్షచంద్రునకుఁ గౌముదీపరిక్షయము మనోజ్ఞ మైనవిభవ క్షయము రమణీయముగానే యున్నది" అని చెప్పెను. నాయకుఁ డాపలుకులు విని 'మిత్రమా! నేను బోయినదానికై వగ చుట లేదు. నాకీ [illegible] గలుగుచున్న వ్యస నము నన్ను [illegible] బాధించుచున్నది. [illegible] వెలుఁగునట్టి సద్గుణములు [illegible] గమ్యముగా [illegible] నష్టమగుట మాత్రము చాలే నుమీ!' యని నాయకుఁడు 'అనర్ఘమైన సీధనసంచయ మంతయు నెట్లు పోయిన దయ్యా!' యని యడిగె. అందుకుఁ జారుదత్తుఁడు 'ఏ మనిచెప్పుదు? నా భాగధేయ మెక్కడికిఁ బోయెనో యదియు నక్కడికే పోయెను. నా సొమ్ము తయు మిత్రకార్యములకు వ్యయపెట్టితిని. నా మున్నసల నందనివాఁడు లేఁడు. అయిన నేమి? సంపద యనుగంటినను దానియందలి విశ్వాసమువలన సంపాదింపఁబడిన నాసత్త్వము మాత్రము నశింప లేదు. నే నిపుడు నిజము చెప్పుచున్నాను.

అర్థనాశమునఁ గలిగినచింత యిసు మంతయు నాకు లేదు. దైవ మనుకూలించనేని యంతకంటె నెక్కుడుసంపద మరల రాఁగలదు. కాని కేమి? కాని నేను రిక్తుఁడ నగుటచేఁ దొంటి స్నేహము లన్నియు విడిపోవుచున్నవి గదా యని మాత్రము నాకసు పుసికి పోవుచున్నది. ఔరా! లేనివానిమాట బంధుగులు చెవి కెక్కదు గదా! వాని యుత్సాహమూ, హాస్యపాత్రము. వాని శీలమూ, నిష్ఫలము. వాని స్నేహితులా, వైరకారణము లేకయే పెడమొగము పెట్టుదురు. ఆపదలా, నిరంతరాయముగ నావరించును. వేయేల? ఇతరు లేమి తప్పుపని చేసినను దానిపాపము వచ్చి వానిమీఁద దొర్లును. ఇంతకంటె లేమి చేయఁదగినహాని యేమో చెప్పుము.' అనుచుఁ జింతింప మైత్రేయుఁడు 'వయస్యా! ఇపుడు నీధనవ్యాపారము లన్నియు దోమలకు భయపడిన గొల్లపిల్లలవలెఁ బాఱిపోయినవి. ఇఁకనో వసంతకాలమున శుష్కించినకొల్లుఁగట్టుకు మరల వర్షాకాలమున మొలకలపై మొలకలు బయలువెడలు నట్లే నీకును మరల ధనోద్యోగములు సంభవింపఁ గలవు. కావున దీనికై యింక నంత వగలుము' అని యుపశమనవాక్యములు చెప్పె. అంత, నతఁడు 'నా కేవిచారమును లేదు. ఇదిగాక నాస్థితి ననుసరించి పోవుభార్యయు, నాతో సుఖదుఃఖము లనుభవించు మిత్రుఁడవు నీవును స్థిర మయినయుత్సాహమును గలుగ నాకు లోప మేమి? ఈమూఁడును దరిద్రులకుఁ గడు దుర్లభ

ములు. ఇవి నాకుఁ గలుగుట నాభాగ్యమే' యనుచు మాట లాడుచునుండె.

ఇది యిట్లుండ మున్ను చెప్పినవసంతసేన చారుదత్తుని యింటికి పోవలయుననే వచ్చుచుండ, దారిలో దానిని విటుఁడును శకారుఁడు ననునా రిరువురు వెంబడించిరి. వారు వెనుక వచ్చుచున్నా రని తెలిసి ప్రమాదము లేకుండ దాఁగుటకై యది వడిగా నురుకుచు నడచుచుండె. దానిని జూచి శకారుఁడు 'వసంతసేనా! నిలు నిలు. పరుగెత్తిపోవుచున్నావా? భయము లేదు. నిన్ను గొట్టను. నా సంతాపమును నా మోహ మిప్పు లోఁ బడినగొలుసుకుక్కవలె మాఁడిపోవుచున్నది. దయ యుంచి యుండు ముండుము' అని పిలిచెను. వానితో నున్న విటుఁడు 'వసంతసేనా! వెనుక వచ్చువారిని జూచి భయపడిన లేడి పిల్లవలెఁ గాళ్ళు తొట్రుపడఁ జూడ్కి బెదర వడివడిగాఁ బోవుచున్నావా?' యనుచు హెచ్చరించె. అంత విద్యాగంధ మెఱుఁగని శకారుఁడు విటునితోఁ 'బావా! ఇదిగో వసంతసేన. ఇది నన్నుఁ జూచి పోతుకుక్కలు వెంబడించిన నాఁడుకుక్క వలెఁ బాఱిపోవుచున్నది' యనె, నంతను 'వసంతసేనా! ఏమా గేందుకు [illegible] నతివేగముగాఁ బోవుచున్నావా? నేను నిన్నుఁ బట్టికొనఁ జాలనా?' యనెను. వీరిమాటలు వినిన మూఁగవోక భయాక్రాంతయై 'ఓపల్లవకా! మధుకరకా! పరభృతికా! శారికా!—అయ్యో! నాపరిజనమే మయ్యెనో? ఇచట నాకు నేనే దిక్కు. ఏమి యుపాయము?' అనుచుండ

శకారుఁడు 'ఏడు—ఏడు, ఇంకను పిలు పిలు. వసంతమాసమంతయుఁ బ్రోగుచేయుము. నిన్నెవఁడు కాపాడునో చూతము. త్రిపురనాథుఁడయిన నాదేవుఁడు గాని, కుంతీకుమారుఁడయిన జనమేజయుఁడు గాని, ఎవఁ డడ్డపడినను సరియే. సీతను దాశ్యాసనుఁడు లాగికొని పోయినట్లుగా నిన్నుఁ గొప్పుఁ బట్టి యీడ్చుకొనిపోయెదను.' అనెను. ఇట్లు వీరు వసరుచు వెన్నఁ దగిలికొని వచ్చుచుండ నవ్వెలఁది భయసంశయసంభ్రమములు ముప్పిరిగొన లేనిధైర్యము దెచ్చుకొని మఱియొక పక్కకుఁ బరుగిడఁ జూచి, విటుఁడు 'ఓసీ! నాకుఁ గోపము హెచ్చుచున్నది. నిష్కారణముగా నీవు చచ్చి నాకు స్త్రీహత్యాపాతకము తెచ్చిపెట్టకు.' అని కేకవైచెను. శకారుఁడు ఒట్లే 'నా బావమాట వింటివా? తలపగిలి చచ్చిపోకు. ఉండు' అని పిలిచెను. వారియుక్తులు విని యా వేశ్య నిలిచి 'అయ్యా! నేను గొప్పకులమువారికొడుకుల నాశ్రయించుదానను. నా జోలి మీ కేల?' యనిన విటుఁడు 'కావుననే నేను గోరితిని' అనెను. 'నేను రాజపుత్రుఁడను' అని శకారుఁడు చెప్పెను. 'అయ్యా! మీకుఁ గావలసిన నానగ లిచ్చెదను గాని, నన్ను ముట్టికొననీయను. నన్ను విడిచిపెట్టుఁడు' అని యా గణిక పలుక, విటుఁడు 'వసంతసేనా! వేశ్యజాతికి విరుద్ధముగా మాటలాడెదవు నాఁడగ్గనా? భోగము దారిలో నున్న పూలతీఁగవంటిది. దానిశరీరము విక్రయించుట కంగడిలోఁ బెట్టినపదార్థమువంటిది. దానియిల్లు పడుచువారి కునికిప

ట్టు. అట్టియెడ నీ వేమో పెద్దపెద్దమాటలు చెప్పెద వేమి?' అనె
ను. అంత నది 'అయ్యా! నాకుల మెఱుఁగుదువు గాని గుణ
మెఱుఁగవు. నన్ను విడిచి పొమ్మ' అని పలుక, శకారుఁడు
'బావా! ఈ వీథి యంతయుఁ గటిక చీకటితోఁ నిండిపోయినది.
దీనిని దాఁటిపోనియకు. ఇది నాఁటికాము దేవోత్సవము మొద
లు గాఁ గట్రి చాగుసత్తునిమీఁదఁ గన్ను వేసి యున్నది. ఇదియే
వానిగృహద్వారము." అని చెప్పె. ఆమాటలు విని గణిక
తనలో 'దైవికముగా నీయప్రియసంభాషణమునఁ బ్రియుని
యిల్లు చేరునుపాయము గంటిని. ఇది గదా కాంతునిగృహము?
అనికొని చల్లఁగాఁ ద్రోసిలి బాగుమ్ముముఁ జేరి ద్వారబంధముఁ
గమ్మికి నొత్తుచెక్కకు సందున నిఱికికొని భూషణములు పూల
మాలిక దీసికొనుచుండెను. అంత శకారుఁడు 'అద్యో!
దాఁటిపోయినది. వెదకు వెదకు 'నాస' విటుఁడు విస్మయపడి
'అకటా! కాముక వర్షించినట్లుగాఁ గాఢగ్రమ్మియున్న యీచీ
కటిచే మోసపోయితిమి. దుర్జనసేనవలెఁ జూడ్కియు నిరర్థక
మయ్యెను. గాఢారణ్యమట్లు గాఢాంధకారము భయంకర
మైన దైనను, సమయవిశేషమున నిది భయపడువారిని భయ
పెట్టువారిని గూడ రక్షింపఁగలదు. ఆహా! దానిజాడఁ దెలిసి
కొన నాకన్ను లెంత యెంచినను మూసికొనియున్న ట్లున్న
వి.' అనుచు శకారునితోఁ సందే తిరుగుచుండెను.

ఇంతలోఁ జారుదత్తుఁడు "మైత్రేయా! నీవు పోయిచతు
ష్పథమున గ్రామదేవతలకు బలిహరణము గావించి ర' మ్మన,

నతఁడు 'అబ్బా! నా కంత శ్రద్ధ లేదు. మఱియొకరిని బంపు' మనెను. అతఁ డేమికారణ మని యడుగ, విదూషకుఁడు 'అదేమో కాని యద్దములోని ప్రతిబింబమువలె నాబుద్ధి కుడి యెడమ, యెడమకుడిగా నున్న'దని, మరల నతఁడు 'కానీ శక్తి కొలఁదినే పూజించిరమ్ము. భక్తిచేతనే దేవతలు తృప్తిపడుదు'రని చెప్ప, నే నొక్కఁడను బోఁజాల' నని నిషేధించె. చారుదత్తుఁడంత రదనికను దోడుగాఁ బొమ్మని నియమింప, మైత్రేయుఁడు తాను దీపము దీసికొని, పూజాద్రవ్యములను రదనికను బుచ్చుకొనుమని చెప్పి, యది ముందు నడవఁ దాను వెనుక నడచుచు వీథితలుపు దీయు మని దానితోఁ జెప్పె. అదియుఁ గవాటము తెఱచుసంతలో నావలనున్న వసంతసేన చీరచెఱఁగు విసరి విదూషకుని చేతిలోని దీప మాఱిపి వేసెను. అంత విదూషకుఁడు 'అయ్యో! పాడుగాలి తగిలి దీప మాఱిపోయినది' అని కేక వేయఁ జారుదత్తుఁడు ఛీ! మూర్ఖా! యని కసరెను. అంత విదూషకుఁడు రదనికతోఁ, నీవు పోయి నడివీథిలో నుండుము. నేను మరల దీపము వెలిఁగించికొని వచ్చెద' నని చెప్పి దానిని బంపి తాను లోపలికిఁ బోయెను. రదనికయు గుమ్మము దాఁటఁగానే యిదే సందని వసంతసేన లోనికిఁ బ్రవేశించెను.

ఆసమయమున రథ్యలో నిట్టటు తిరుగుచున్న విటుఁడా రదనికను జూచి తనలో 'ఈనిర్భాగ్యనెకారుని గొంచెమునే పాడించెద'నని యాలోచించి 'ఆహా! మంచివాసన వచ్చు

చున్న' దనెను. శకారుఁడును 'ఔనౌను. నే నీపరిమళము విన్నాను గాని చీకటితోఁ నిండిపోవుటచే ముక్కుతోఁ జూడ లేకపోయినా' ననెను. అంతట విటుఁడు 'ఉండు ముందును పోకు పోకు' మనుచు రదనికను బట్టికొని యిదిగో వసంతసేన యనెను. శకారుఁడును 'రంజకుఁడను బోనియకుము. ముం దుగాఁ దల సుఖకై తోఁకవాతఁ జంపెదఁగ' అనుచు దగ్గఱకు వచ్చి యేదేది యనుచు దానిజుట్టుపట్టికొని లాగఁగా, అయ్యో లారా! నన్నేమిచేయఁ దలఁచితిరి?' అని యఱచెను. ఆమా ట విని శకారుఁడు 'బావా! దీనిగొంతు వేఱుగా నున్నది. ఇది వసంతసేన గాదు సుమీ!' యనఁగా, విటుఁడు 'నీ వే మెఱుఁగుదువు? దీనిని విడిచి పెట్టకు. ఇదే వసంతసేన. ఇది యనేకవేషములు వేసి వేఱువేఱుగొంతులతోఁ సంగీతమున సభినయింప నేర్చినది' అనుచుండెను. ఆ తఱిలో దీపము పట్టు కొని విదూషకుఁ డీవలికి రాఁగానే చూచి రదనిక 'తలఁకు పోకక తన్ను తన్ని మోఁపుచు 'మైత్రేయా! దుర్మార్గులఁబోలు తమును జూడుము' మని కేకవేయఁగా, నతఁడు సమీపించి కత్తు లు చేతులఁ బట్టికొని యున్న విటశకారులను జూచి జంకించి నిలు వఁబడెను. విటుఁడును 'మైత్రేయా! మే మొకదాసికై వచ్చి తిమి. అది మెల్లగా నెట్లో తప్పించికొని పోయెను. అదేమో యనికొని దీనిని బట్టికొంటిమి, కాని గర్వముచేఁ గాదు. మహా బ్రాహ్మణా! క్షమింపు' మనెను. శకారుఁడును దీపపువెలుఁ గున దానిని జూచి 'బావా! ఇది దరిద్రచారుదత్తుని పరిచారిక.

ఛీ! వసంతసేన గాదు—ఓసీ వసంతసేనా? మేలు మేలు. చీకటిచే మాంగావ మోసపోయినాఁడు. ఈమోసకత్తెచే నేను మోసపోయితిని. సరేలే' యనెను. అంత విదూషకుఁ డిది తెగనపని యని యడలింప, విటుఁడు చేతులు మోడ్చి '(బ్రాహ్మణోత్తమా! బతిమాలికొనుచున్నాను నమస్కారము మన్నింపుఁడు' అని వేఁడికొన, శకారుఁడు 'బావా! దరిద్రసార్థవాహపుత్రుఁడు చెప్పిన నీ కంతభయ మేమి?" యని యడిగెను. అందుకు వాఁడు 'నీ కేమి తెలియును? అతనిచేసిన నిజముగా నాకు భయమే. అతనిసుగుణసంపద యట్టిది. నాబోఁటివారితో మైత్రి యొనర్చియో కాంతఁ దుస్థితికి వచ్చెను. ఆ మహాత్ముని సొమ్ము తినని వాఁడొక్కఁడును లేఁడు. వసంతుని తృష్ణ దీర్చి మనుఁ గండిన్లే యాశ్రితులతృష్ణ దీర్చి యతఁడు లేనివాఁడయ్యె—విప్రవరా! ఈవృత్తాంతము నార్యచారుదత్తునకుఁ జెప్పవలదు.' అని బతిమాలి వేడెను. శకారుఁడును 'ఓమారిషా! మైత్రేయా! దరిద్రచారుదత్తునితో నామాటగా నిట్లు చెప్పుము. రాజస్యాలుఁడును విటుఁడును వెంబడించి వచ్చుచుండ వసంతసేన యనువారకాంత సువర్ణాలంకారముతో నీయిల్లు చొచ్చినది. దానిని రేపే పంపివేసి నీకును మాకును వివాదము లేకుండఁ జేయవలయును. మఱియును దలుపుసందునఁ బెట్టి నొక్కనవెలగపండువలె నీతల ముక్కలు గాకుండఁ జేసికొనవలయును.' అనుచుఁ బోయెను. అంత విదూషకుఁడు రదనికతో నిప్పటిప్రసంగము లోపలఁ జెప్పఁ

గూడ దనిచెప్పుచు నింటిలోనికిఁ బోవుచుండెను.

ఇంతలోఁ జారుదత్తుఁడు ద్వారమువంకఁ జూచి రదనిక వచ్చిన దని భ్రాంతిపడి వసంతసేనతో 'భద్రా! దేవకార్య మయినదా? దేహము చల్లగాలిని గోరుచున్నది. ఈయుత్తరీయము తీసికొ' అని పలికెను, వసంతసేన లోలోన 'నన్నుఁ జూచి రదనిక యని తలఁచుచున్నాఁడు' అనుకొనుచు నాతని పైబట్టు తీసికొని 'ఆహా! యీతనిపైనుండుజవ్వాదిసుగంధపరిమళము చక్కఁగాఁ దెలుపుచున్న' దని సంతసించెను. అంతట నాతఁడు 'రదనికా! లోపలినుండి బాలునకు దారి తీయుదువుగాక', వసంతసేన లోలో 'అయ్యో! నాకు నభ్యంతరగృహముఁ బ్రవేశించుట కధికారము లేదు గదా!' యని యూరకుండెను. 'ఓసీ రదనికా! జాగు చేసెదవు? రావేమి' యనుచుండ, రదనిక వచ్చుచు 'అయ్యా వచ్చితి' ననెను. అంత నాయకుఁడు విస్మయముతోఁ దెలియక యిచ్చినయుత్తరీయమును జూచి వేసికొని శరత్కాలమేఘమునఁ గప్పఁబడిన చంద్రరేఖవలె నున్న యీమె యెవతె?' యని యడుగుచున్నంత, వసంతసేన దీపమువెలుఁగున నాతనిఁ జూచి 'ఆఁ! ఎవనికొఱకు నేను బ్రాణముతోఁ నుంటినో యతఁడే యితఁడు' అనుకొనెను. అంత విదూషకుఁడు వచ్చి 'చారుదత్తా! నాటకస్త్రీ యయినవసంతసేన సువర్ణాలంకారములతో మనయింటికి వచ్చిన దఁట. దానిని రేపు పంపవలసిన దని రాజస్యాలుఁడు చెప్పినాఁడు' అని పలుక, వసంతసేన 'గానీలే. వానికిఁ గాదు పరాధీన మయిన' దనుకొని 'అయ్యా! శరణు

చొచ్చితి' ననెను. అంత నాయకుఁడు 'భయము లేదు భయము లేదు. వసంతసేన యా?' యన, విదూషకుఁడు 'వయస్యా! ఔను వసంతసేనయే. నాఁడు కామదేవోత్సవమునుండి వచ్చినది మొదలుకొని దేనిని బొగడుచుఁ గామపరవశుఁడవై స్మరించుచుఁ గుందుచుంటివో యదియే. కన్నారఁ జూచి యానందింపు' మనెను. అంత నతఁడు 'మిత్రమా! లేమి వచ్చినతరి దేని మెడఁ గాను ముడియుంచి నీమనిరోషము పూడ్కి నెడఁద లోనే యణఁగుచున్నదో యూరకమణిసి జూచితి' ననునంత, నగ్గణిక 'నీయాజ్ఞ లేక యిల్లుచొచ్చి తెలియకుండ నీయుత్తరీయము గైకొన్నానాయపరాధము మన్నింపు' మని వేఁడికొనెను. దానిపై నతఁడు 'నిన్నెఱుఁగక నీకుఁ బని చెప్పినందుకు మన్నింపు' మనఁగా విదూషకుఁడు 'సరియే కాని ఎలిసిన యెద్దు లొండొంటితో సరిపడక బండి నిట్టటు లాగి క్లేశపడునట్లుగా మీరిరువురు పెనఁగులాడుచున్నారా? మీలో నెవరిని నేను బలియావలెనో చెప్పుఁడు' అని పరిహాసించెను. అంత నాయకుఁడు 'సుందరీ! నాయింట దనురాఁగ మున్నదిగదా!' యన, నది 'నాయెడ ననుగ్రహము గలదేని యీయలంకారము నీయొద్ద నుంచుము. దీనికై పాపాత్ములు నన్ను వెంబడించుచున్నారు. దీని నీవు దాఁచితివేని నేను సుఖముగా నింటికిఁ బోఁగలను' అని చెప్పెను. అది విని యాతఁడు దానిని గైకొనుట మంచిపని గాదని తలఁచియు మైత్రేయునితోఁ దీసికొమ్మని చెప్పెను. అతఁడును దానిని

దీసికొని నీవు వస్త్రిన వస్త్రములలో నీసువర్ణభూషణము ధరించుము. అస్తమి యసధ్యాయనము. నాఁడు నేను దాల్చెదను' అని చెప్పి రదనిక చేసికచ్చెను. అదియును వస్త్ర యానగ దీసికొని యింటిలోనికిఁ బోయెను. అంతఁ జంద్రోదయము కాఁగా నించుక వెలుఁగు వచ్చుటఁ జూచి చారుదత్తుఁడు, మైత్రేయుఁ డనుయాయిగా నిజగృహమునకుఁ బొమ్మని వసంతసేనతోఁ జెప్పి తా నింటిలోనికిఁ బోయెను.

తరువాత నొకనాఁడు వసంతసేన తనయింటిలోఁ గూరుచుండి యేదో యాలోచించుచు విమనస్కురాలై యుండ దాసిచేటిక దగ్గఱకు వచ్చెను. వా రిరువురి కీక్రింది సంభాషణము జరిగెను.

చేటి___నీ వెవనికొఱకో పరితపించుచున్నా వని తెలిసికొంటిని గాని యతఁ డెవఁడు రాజపుత్రుఁడా ?

వసం___నేను సుఖము గోరుచుంటిని గాని సేవగాదు.

చేటి___విద్యాభూషణుఁ డగుబ్రాహ్మణపుత్రుఁడా ?

వసం___అట్టివిప్రుఁడు పూజనీయుఁ డని నాకట్టి నమ్మకము.

చేటి___అట్లయినఁ గ్రొత్తగా మనయూరికి వచ్చిన వణిక్పుత్రుఁడా ?

వసం___చీచీ! ఇంతలోనే యాశాభంగము గావించెద వేల ?

చేటి___అట్లయిన నీవే చెప్పుము.

వసం—కాను దేవోత్సవమునాఁడు నీవు గూడ వచ్చితివిగదా! నాఁడు సార్థవాహపుత్రుఁడగు చారుదత్తుని జూచితిని.

చేటి—మున్ను శరణుచొచ్చిననిన్ను రక్షించిన యతఁడా? ఛీ! అతఁడు దరిద్రుఁడు గదా!

వసం—కావుననే కోరితిని. అతిదరిద్రుని గామించిన గణిక స్తోత్రపాత్ర మగును గదా?

అని యిట్లు వీరు మాటలాడికొనుచుండ, సంవాహకుఁడు పరుగెత్తుకొనుచు 'శరణు శరణు' అనుచు లోపలికి వచ్చి వసంతసేనను జూచి 'ఆర్యా! నీవు జూదముచే వేశ్యవయ్యును శీలమునను పరిశుద్ధవు గావు. కావున నే నిన్ను శరణువొచ్చితి'నని భయముతోఁ బలికె. భయపడకు, నిశ్చింతగా నుండుమని యుచితాసన మిచ్చి కూర్చుండఁబెట్టి నీవృత్తాంత మేమి? యని యడిగె. వాఁడు నా వృత్తాంత మంతయు నిట్లు చెప్పఁదొడంగె. 'పాటలీపుత్రము నాజన్మభూమి. స్వభావముచే నేను వణిజుఁడను. దైవవశమున సంవాహకవృత్తి నవలంబించి జీవించుచున్నాఁడను. ఈయుజ్జయినికి రాఁగానే నా కొకసార్థవాహపుత్రుఁడు లభించెను. అతఁడు సుందరుఁడు నిగర్వుఁడు మృదుశీలుఁడు చతురుఁడు దయాళువు. ఇచ్చి పొంగఁడు. అపకారమును స్మరింపఁడు. వేయేల? ఒకవేసవికాలపుదిన మంతయుఁ జెప్పినను నాతనిసుగుణములలో నాల్గవవంతయినఁ గాదు. పరులకై యాతఁడు శరీరము ధరించెననుట నిక్కము. ఉజ్జయినిలో నిట్టిసుగుణశాలి

యెవఁడని సంశయించుచుంటివేమో? నీ వెఱుఁగనివాఁడు గాఁడు గాని చెప్పెదను. అతని పేరు చారుదత్తుఁడు. నీసితో నీ సంశయము వాయవచ్చును. గ్రహచారవశమున నాతఁడు దరిద్రుఁ డయ్యెను. లేమింజేసి పరిచయులాతనివశము దప్పు, న తఁడు భార్యాపుత్రులభరణమును విడిచి సచ్చరిత్రమాత్రావశేషుఁడై సార్థవాహకులమున నివసించియుండెను. నేను నాతని యనుజ్ఞ వడసి విడిచిపోయి యాతనిఁ బోలినయుత్తముఁడ [illegible]భింపక యాతనికోమలదేహమును [illegible] నాకాని, [illegible]స్త్రముల నింకొకనా[illegible] [illegible] పిసుకి నుపయో యోగింప[illegible] [illegible] [illegible] కే[illegible] లేక [illegible] [illegible] [illegible] [illegible]. [illegible] [illegible]ములు [illegible] [illegible] [illegible]. నీ బో[illegible] [illegible], [illegible] [illegible]. [illegible] నిను జూచి [illegible] [illegible]. [illegible] [illegible]త్తాంతము.* ఆ [illegible] [illegible] చా[illegible] [illegible] [illegible] [illegible]తికి మనమునఁ బొంగి [illegible] [illegible] [illegible] [illegible] [illegible] లిచ్చి యాజూదరిని బంపి వేయుమని చేటికఁబంపి, సంవాహకునితో 'నీ విందుకుఁ జింతింపవలదు. ఇవి చారుదత్తుఁడు గా రిచ్చినట్లే భావింపు'మని చెప్పెను. చేటిక తిరిగి వచ్చి నయాజూదరిని బంపివైచితి నని చెప్ప, సంవాహకుఁ డానందించి 'నాసంవాహనకల నీ పరిజనమునకు నేర్పఁగునేని యది సార్థకమగు' నని తనమది తెలుప, వసంతసేనయు 'నీ వెవరి

కొంత విద్య నేర్చికొంటివో యది వారికే యుపయోగించుట మంచి'దని చెప్ప, అతఁడును “మంచియుపదేశము చేసితివి. ఇప్పు డెక్కడికే పోయెద” ననుచు వెడలె.

అంత నొకచేటుఁడు పరుగెత్తికొని వచ్చి “ఎక్కడ డెక్కడ? వసంతసేన యేది?” యనుచు వసంతసేనను సమీపించెను. అది వానిని జూచి ‘యేమీ సంతోష’ మన, నతఁ డిట్లు వాకొనెను. “రాజుగారిమదపుటేనుఁగు రాజవీధిలో వచ్చుచుఁ [illegible]క్కను బోవుచున్న యొక సన్యాసిని తొండముతోఁ బట్టుకొనెను. అంత వీథిలోనివా రందఱు, అయ్యో! అయ్యో! సన్యాసి చచ్చిపోయెను. చచ్చిపోయె ననుచుఁ గేకలు పెట్టిరి ఆసందడి విని యొక్కగెంతున నే నచ్చటికిఁ బోయి యానాగము నొక్కదెబ్బ గొట్టి మరలించి యాసన్యాసిని విడిపించితిని. ఆభిక్షుకు నపాయమునుండి తప్పించినందు కందఱు వట్టిమాటలతోఁ బొగడినవారే కాని యొక్కకాసు నైన నిచ్చినవాఁడు లేఁడు. అంతలో నెవ్వఁడో గొప్పకులమువాఁ డొకఁడు తన చేతులు మొయి మొప చూచికొని యించుక విచారించి నా కున్న దిదే యనుచుఁ దనపరిచారకునిచే నా కీయుత్తరీయమును బంపెను. అతఁ డెవఁడో నే నెఱుంగను గాని యిప్పుడు మనవీథిలోనే పోవుచున్నాఁడు’ అని చెప్పిన, నాతనిమాటలు విని వసంతసేన, చారుదత్తునిగుణముల ననుసరించి యతఁ డెవఁడనుచు మేడమీఁదికి వచ్చి చూచి చారుదత్తుఁడే యతఁడని తెలిసికొని చేటికతో నాతనిసుగుణములనుఁ గూర్చి ము

చ్ఛటించుచుఁ గంటికిఁ గనఁబడునంతవఱకు నాతనిఁజూచెను.

తరువాత నొకనాఁటిరాత్రి మైత్రేయచారుదత్తు లిద్దఱు నెచ్చటికిఁబోయిరో యింటికి వచ్చుచుండఁగా వారికి వీణానాదము శ్రవణగోచర మయ్యెను. దాని నాలకించి నాయకుఁడు 'వయస్యా! వీణ యనఁగా రత్నాకరమునఁ బుట్టనిరతనము సుమీ! అస్వాధీన చిత్తశాంతి లేనివారికి నర్మసఖి, నిర్దోషమైనగోష్ఠి; కూరిమి వెదచల్లి కోరిక దీర్చుకులకాంత. కాని, కాంతలకు మాత్రము కాంతుసంగతి కంతరాయము చేయు సవతి' యని వర్ణింప, విదూషకుఁడు 'మిత్రమా! అది తీఁగెలు తెగి మూలఁబడనీ! దానిమాట నా కక్కఱలేదు. చూచితివా? రాజమార్గము లన్నియు నిశ్శబ్దము లయినవి. కుక్కలు గూడ నెచ్చగా నిద్రించుచున్నవి. మన కింకను నిద్ర యన్నమాటే లేదు.' అని దానిని నిరసించెను. అంత నతఁడు 'ఈ పాడుచున్నవాఁడు మనబావ రేభిలుఁడే యని తోఁచుచున్నది. ఆహా! గాన మెంత మనోహరముగా నున్నది! గోడ చాటున నుండి విన్నచోఁ దప్పక యాఁడుది పాడుచున్న దని తలఁపవలసినదే' యని శ్లాఘింప, మైత్రేయుఁడు 'నీ యిష్టము వచ్చినట్లు కొనియాడుము. ఆఁడుది గానీ, మగవాఁడు గానీ. నా కెవరు పాడిన నొక్కటే.' యనెను. అంత నాయకుఁడు 'మిత్రుఁడా! ఇపు డర్ధరాత్ర మయినది. ఊ రంతయు మాఁటుమణఁగినది. అష్టమీచంద్రుఁ డంధకారమున కవకాశ మిచ్చి యస్తంగతుఁ డయ్యె. కానీ నడు. ఇదే మనయిల్లు' అనుచు

గడపఁ జేరి వర్ధమానకా! యని పిలిచెను. వాఁడు వచ్చి తలుపు తీసినంత వా రిరువురు సంతర్గృహంబు చేరి శయనించిరి. అంత రదనిక వచ్చి 'మైత్రేయా! ఇదిగో సువర్ణభాండము. నేఁడు నీవు చెప్పినయష్టమి గదా! తీసికొను' మని చెప్ప, నతఁడు నిరాకరించి చారుదత్తునియానతిచేఁ గైకొని 'కానీ! ఏ దొంగముండకొడుకో యెత్తికొనిపోనీ!' అని తలక్రిందఁ బెట్టికొని 'ఏమమ్మా! నీ యుత్తరీయమును వసంతసేనపరిచారకున కిచ్చినా వెందుకు?' అని యడిగెను. "ఏమో! దయ దలఁచి యిచ్చినాను" అని యతఁ డనఁగా, మైత్రేయుఁడు 'నీ దయ బాగుగానే యున్నది. పక్క గుడ్డ లేక నేను నేలమీఁదఁ బొరలుచున్నాను' అనెను. అంత నిరువురు నిద్రించిరి.

తరువాత సజ్జలకుఁ డను దొంగ చారుదత్తుని యింటి యావరణములోఁ బ్రవేశించి చతుశ్శాలమును సమీపించి 'అందఱు నిద్రించుచుండఁ జేయునట్టి యీపని మిక్కిలి నీచమయిన పని పెద్దలు నిందింపనీ! నమ్మినవారిని మోసపుచ్చుట శౌర్యము కాకపోనీ! ఏమయినను సరియే. కేలు మోడ్చి యొరులఁ గొలుచుటకంటె నీనిందయే మేలు. తొల్లి యశ్వత్థామయే నిద్రపోవువారిని జంపి యొకత్రోవ త్రొక్కెను గదా! కాని యీయింటికంటె లుబ్ధుఁడు ధనికుఁడు సాధుబాధకుఁడు కఠినుఁడు నగు నొకవణిజునినిలయము దొరకిన మిక్కిలిసంతోషమే. అయిన నిప్పు డేమి చేయుదును? ఏదో యొకటి. కంతుఁ డెంతపని యైనను జేయింప వలంతియే కదా? కానీ!

దగ్గఱి చూచి 'హెచ్చుతగ్గులు లేక నిశ్శ్వాసము నిరాటంకముగా నున్నది. కాలుసేతులు సాగి చక్కఁగాఁ బక్క గూడ దాఁటి యున్నవి. కనుఱెప్పలు గట్టిగా మూఁతపడియున్నవి. ఇది దొంగనిద్ర యైనచో దగ్గఱ నెదురుగా నున్నయీదీప కాంతిని గన్నులు సహించునా? వీఁడు గాఢనిద్రలో నుండెను. సంశయము లేదు. ఈచినిఁగినయుత్తరీయమున మూట గట్టినదే కాఁబోలు వీఁడు చెప్పినది?—ఆఁ! అవు నిదే' అని భ్రమరకరండముమూఁత దీసి యొక్క శలభమును విడిచి 'ఆఁ! మే లయినమిడుత. దీప మాఱిపివేసి క్రిందఁబడినది' అనుచు విదూషకునిచేత నున్నమూట దీసికొనఁ జూచుచుండె. అంత విదూషకుఁడు మేల్కాంచి 'అయ్యో! దీపము పోయినది. చారుదత్తా! ఈకనకభాండము దీసికో. నాకు భయముగా నున్నది. దీనినిగూర్చి నాకు నిద్ర లేదు. తీసికొనకపోయిన నాతోడే' అనెను. అందుకు సజ్జలకుఁడు 'నీ వంతయొట్టు పెట్టికొన నేల? నాకే యిమ్ము' అనఁగా విదూషకుఁడు వానికామూట యిచ్చి 'అమ్మా! వదలిపోయినది. ఇఁక సరకులమ్మికొన్నకోమటివలె సుఖముగా నిద్రించెదను' అనెను. సజ్జలకుఁడు 'మహాబ్రాహ్మణా! నిద్రపో' అని చెప్పి తనలో 'ఛీ! లేమి యెంతకైనను దగును. పాడుజవ్వనము కష్టమెఱుఁగనిది. ఇట్టియెగ్గులకు రోఁత పడుచున్నాను. చేయుచున్నాను. చారుదత్తుఁ డని నమ్మి యీతఁ డిచ్చెను. నేను దీనిని దొంగిలించి మోసపుచ్చితిని' అని తలఁచునంతలోఁ

బటహాధ్వని వినఁబడెను. అంత నతఁడు తెల్లవాఱుచున్న దని తలఁచి పాఱిపోయెను.

పిదప రదనిక యచ్చటికి వచ్చి మైత్రేయుని లేపి యింటికి దొంగ కన్నము వేసినాఁ డని చెప్ప, నతఁడు లేచి కన్నము చూచి వచ్చి ‘వయస్యా! మంచిమాట చెప్పెదను లెమ్ము’ అనెను. అతఁడు మేల్కాంచి వసంతసేన వచ్చెనా యేమి?’ యనఁగా నతఁడు ‘లేదు లేదు. వసంతసేనుఁడే వచ్చె ననెను. అంత నాయకుఁడు ‘రదనికా! యే మిది?’ యనఁగా నది కన్నముమాట చెప్పెను. అంత నతఁడు ‘దొంగ వచ్చెనా? యన, మైత్రేయుఁడు ‘ఓయీ! నన్ను మూర్ఖుఁ డనుచుందువు చూడుము! సువర్ణభాండము నీకిచ్చి యెంతమంచిపని చేసితినో యనఁగా, నతఁడు ‘నాకిచ్చితివా? ఎప్పుడు?’ అనెను. అర్ధరాత్రి వేళ యిచ్చితి నని యతఁడు బదు లీయ ‘నర్ధరాత్రమందా?’ యని యతఁ డనెను. ‘అర్ధరాత్రమో గిర్ధరాత్రమో? నాకుఁ దెలియదు. నీవు మేల్కొని లేచి వచ్చినపుడు నీచేతికిచ్చితి’నని మైత్రేయుఁడు చెప్పఁ, జారుదత్తుఁడు ‘అయ్యో! పోయినదిరా! దొంగవాఁడు దీసికొనెను’ అనెను. అంత నాతఁడు ‘నే నిచ్చి నది మరల నాకి’ మ్మని యడుగ, నాయకుఁడు తనలో ‘దీని నిజము చెప్పిన నెవ్వరు నమ్మెదరు? లోక మంతయు నేనే యపహరించి యిట్లు పన్నితి నని తలఁచును గదా! ఆహా! దారిద్ర్య మనుమానమునకుఁ జోటు. ఇపు డేమి చేయుదు’ నని విచారించుచుండె. అంత మరల మైత్రేయుఁడు ‘అయ్యా!

కటిలోఁ దెలియక తప్పు చేసినందుకు నీ కాళ్ళకు మ్రొక్కి యాచించుచున్నాను. నే నిచ్చినవస్తువు మరల నాకిచ్చివేయు' మన, నతఁడు మిత్రమా! నన్ను బాధించెద వేల? నాశీల మెఱిఁగియు నన్ను నమ్మవేమి? నే నేమి చేయుదును? పోయినది' అనెను. అంతలోఁ జారుదత్తునిభార్య రదనికను బిలిచి దొంగ వచ్చె నని చెప్పకొనుచున్నారు. ఎవ్వరికిని దెబ్బలు దగులలేదు గదా! మైత్రేయునిచేతిలోని యలంకారమును జోరుఁ డపహరించెనా?—ఇపుడు దానికి బదులుగా నీయఁదగిన దేమున్నది? అయ్యో! నా చేతులకుఁ బచ్చదారము లే గదా?—మెడలో సూత్రము దక్క వేఱు లేదు. ఇపు డేమి గతి?—కానీ! నాపుట్టినింటివా రిచ్చినముత్యాలహార మొకటి యున్నది. లక్షరూప్యముల విలువ గలిగినయది యీసువర్ణాలంకారమునకు మాఱుగా నీయఁదగినది' యని తలఁచి మైత్రేయుని బిలిచి యా ముక్తాహారము తెచ్చి 'మైత్రేయా! దీనిని దీసికొను' మనెను. అతఁడును 'అమ్మా! ఇది యవస్థకుఁ దగని యీవి. ఇది నీ కెట్లు వచ్చినది?' అని పలుక, నామె 'నేఁడు మంచిదినము; మంచి బ్రాహ్మణుఁడవు. నీ కీయఁ దలచితిని. గ్రహింపు' మనగా నతఁడు రదనికవంకఁ జూచె. అదియు నాతని చెవిలో యజమానుఁడు పోయిననగకు బదు లే మీయ నగునని పరితపించుట తెలిసికొని యిది నీచేతి కిచ్చి యాతని ఋణవిముక్తుని జేయఁ దలఁచి నట్లున్నది 'ప్రతిగ్రహింపు' మనెను. ఆ బ్రాహ్మణి కన్నుల నీరుపెట్టుచు నాహార మీఁయ, నతఁడు

ప్రతిగ్రహించి ‘నీ వెందుకు విచారించుచున్నావో నిజముచెప్పక పోయిన నీ మగనితోడే’ యనెను. ఆమెయు నకటా! యనుచు వెడలిపోవెను. అంత మైత్రేయుఁ డాముత్యాలసరము గైకొని వచ్చి చారుదత్తునకుఁ జూపి యిదిగో హారము. తగినకులకాంత యున్నందుకు ఫల మిదియే’ యనఁగా నతఁడు ‘బ్రాహ్మణి నాపై జాలిపడి యిచ్చినదా యేమి? అయ్యో! ఆఁడుదాని సొమ్ము వాడుకొనవలసినవాఁడ నయితినా?’ అన, నాతఁడు ‘మిత్రమా! ఆమెయు నేనును గూడ నిన్నుఁ బ్రార్థించు చున్నాము. దీనిఁ బరిగ్రహింపు’ మనెను. అంత నాయకుఁడు ‘వయస్యా! దారిద్ర్య మెంత నీచ మయినది? ధనలోపము నను ధనలోభమునను గూడ నా మనోరథము స్త్రీధనమున ననుచితమయిన ప్రణయమును జేయుచున్నది. ఛీ! లేనివాని బ్రతు కెందుకు? దీని నిపుడే తీసికొనిపోయి వసంతసేన కిచ్చి రమ్ము. అల్పమూల్య మయిన యీసువర్ణభాండమున కీయనర్ఘమయిన తారహార మీయఁదగునా యని సంశయింప వలదు. నన్ను విశ్వసించి యీ హేమాభరణము నాయొద్ద దాఁచినది. విలువలేనియీసమ్మకమున కీయమూల్యముక్తావళియే తగును’ అని చెప్ప నతఁ డట్లే యని వెడలెను.

ఆయుదయముననే వసంతసేన తాను జిత్రఫలకమున లిఖించినచారుదత్తునియాకృతిని జూచుచుఁ దనచేటికిఁ జూపి యిది సరిగా నున్నదా యని యడుగుచు దానిమాటలు విని నన్నుఁ బరిహసించుచుంటివా యనుచు నాచిత్తరువే నిరీక్షిం

చుచు నందందు సవరించుచు నుండ, నింకొక చేటి యాభరణములు దీసికొని వచ్చి 'మీయమ్మ, యలంకరించికొని రమ్మని చెప్పి యీనగలు నీ కిమ్మన్నది. ఇవిగో' అనిన, నవ్వోలఁది 'చారుదత్తుఁడు వచ్చునా యేమి?' యని యడిగె. అంత నది 'కాదు. అలంకారములు పంపినరాజస్యాలకుఁడు సంస్థానుఁడు వచ్చునఁట' యని చెప్పిన, నగ్గణిక 'ఆర్యచారుదత్తుని రాపించితివేని యలంకరించికొనియెద నంటి నని మాయమ్మతోఁ జెప్పు'మన, నచ్చేటి యట్లే యని మరలిపోయె. వసంతసేనయు మరలఁ జిత్తరువు చూచుచుఁ బరధ్యానమున నుండె. ఇంతలో సజ్జలకుఁడు అమ్మా! ఎట్లో రాత్రి గడపి నాపని నెఱవేర్చికొని వచ్చితిని. దైవవశమునఁ బని పూర్తి యయినతరువాతఁ దెల్లవాఱినది. వసంతసేనపరిచారిక యయినమదనికను గొనుట కింతపని చేసితిని. ఆఁ! ఇదే వసంతసేనయిల్లు'అని తలఁచుచు వీథిగుమ్మములోనికి వచ్చి మదనికా యని పిలిచెను; వసంతసేనదగ్గఱ నున్న చేటిక యగుమదనిక యాపిలుపు వినియు దచూడకుండఁగా నీవలికి వచ్చి సజ్జలకుని సమీపించెను. ఆసమయమునసే వసంతసేన మదనికను బిలిచి, యది యందు లేనందునఁ దనచేతిలోనిచిత్తరువును బడకగదిలోఁ బెట్టుటకై తానే యీవలికి వచ్చి వీథిగుమ్మములో నున్నమదనికాసజ్జలకులను జూచి వీఁ డెవఁడో బేరము చేయవచ్చినాఁ డని తలఁచి వారి రహస్యము విన రాదని వారికిఁ గనఁబడకుండఁగఁ బోవుచుండె. అత్తఱి సజ్జలకుఁడు 'మఱి వసంతసేన___'అనెను. ఆమాట విని

వసంతసేన 'నామాట యేదో వచ్చినది గావున వినవచ్చు'నను కొని చాటున నిలిచి వారినిజూచుచు వారిమాటలు వినుచుండె. మరల సజ్జలకుఁడు 'మఱి వసంతసేన తగినసొమ్మిచ్చినచో నిన్ను నా కిచ్చునుగదా!' యని మదనిక నడిగెను. అందు కదియు నాతఁడు నిట్లు మాటలాడిరి. వసంతసేన యందే యుండి యామాటలు వినుచుఁ దనలో ననుకొనును.

మద—నన్ను వదలుట కాటంకము లేదు.

సజ్జ—ఇదిగో! వసంతసేనమెడకు సరిపడునట్లుగాఁ జేయఁబడినది. ఈవృత్తాంత మెక్కడను జెప్పఁ దగదుసుమీ! ఈయలంకార మామె కిమ్ము. (ఇచ్చును)

మద—ఏ దేది? ఇది మున్ను చూచినదిగా నున్న దే.

వసం—ఇది నావస్తువులాగున నున్నది.

మద— ఇది నీ కెక్కడిది? నిజము చెప్పుము.

సజ్జ—నీకొఱకు సాహసించితిని.

మద—ఇ దెక్కడిసాహసము? నిన్నుఁ జూచినను నీ నడవడిఁ జూచినను సంశయము గలుగుచున్నది.

సజ్జ—ఓసీవెఱ్ఱిదానా! లక్ష్మి సాహసమం దేయున్నది.

మద—సరియే కాని, యెవరియింటికిఁ గన్నము వేసి నావో చెప్పుము.

సజ్జ—నాకుఁ దెల్లవాఱినతరువాతఁ దెలిసినది—సెట్టి వీథిని గాఁపుర మున్న సార్థవాహపుత్త్రుఁడు చారుదత్తుని యింటికి—

మద—అయ్యో! పాపము!!

వసం—అయ్యో, అయ్యో!!

సజ్జ—ఏమి? వణఁకుచున్నావేమి?

మద—కత్తి చేతిలో నున్నది. అక్కడ నెవ్వరినేని నఱికి చంపలేదు గదా!

వసం—నే నడుగవలసినమాట యడిగితివి గదా!

సజ్జ—ఇది చాలక రెండవ పాపకృత్యము గూడఁ జేయుదునా?

మద—సత్యమే కదా!

సజ్జ—రామ రామా! నే నెవ్వరిని ముట్టికొనలేదు.

మద—అట్లయిన వినుము. తక్కినప్రసంగ మట్లుండ నిమ్ము. ఈయలంకారము మావసంతసేనదే.

సజ్జ—అయ్యో! ఎంతపని! మున్ను నా చేతితో నిశ్శేషముగా నాకులు గోసినకొమ్మనే యిపు డెండ వేఁడిమికిఁ దాళఁజాలక నీడకై యాశ్రయించితిని. ఇపు డేమి చేయఁదగును.

వసం—చేసినయకార్యమునకు వీఁడు పశ్చాత్తాపపడుచుండెను.

మద—ఏమియు లేదు. మరలఁ దీసికొనిపోయి యాతనికే యిమ్ము.

సజ్జ—నన్నతఁడు రక్షకభటుల కప్పగించు నని జడియుచున్నాను

మద — ఆ కులపుత్రుఁ డట్టివాఁడు కాఁడు. నీపశ్చాత్తాపమునకు సంతసించును.

వసం — లక్షవరహాలు వెల గలపలుకు పలికితివే మదనికా!

సజ్జ — ఏ మయినను సరియే కాని, నే నందుఁ బోఁజాలను.

మద — అట్లయిన నింకొకటి చేయుము. చారుదత్తుఁడు వసంతసేనయుఁ గూడ నిన్నెఱుఁగరు గావున నాతఁడు పంపినట్లుగా వసంతసేన కిమ్ము. ఇట్లయిన నీకుఁ బ్రమాదము లేదు. చారుదత్తునకు విచారము లేదు. నాకును బీడ లేదు. వసంతసేనకు హాని లేదు.

వసంతసేన యామాటలు విని యభ్యంతరగృహమున కరిగె. మదనికమాటచొప్పున సజ్జలకుఁడును గామదేవుని మందిరమున నుండె. మదనికయు నింటిలోనికిఁ బోయెను. ఇట్లుండఁగా నొకపరిచారిక వసంతసేనను సమీపించి చారుదత్తుఁడుగారిమిత్రుఁడు వచ్చుచున్నాఁ డని చెప్పిన, నది పరమానందపడి సిద్ధముగా నుండెను. విదూషకుఁడును దానిమందిరము నలువంకలు పరికించుచు 'అవురా! ఏమి దీనిభవనము? ఇందు లక్ష్మి తులఁదూఁగుచున్నదే' యనుచు లోనికి వచ్చిన నాతనిఁ జూచి వసంతసేన సత్కారపూర్వకముగాఁ బీఠ మిచ్చి తాను గూరుచుండెను. అంత మైత్రేయుఁడు 'నాఁడు నీవు దాఁచ నిచ్చినయాభరణమును నామిత్రుఁడు జూదములో నోడి

ఇటకట బని మొదలు పెట్టెదను. దైవవశమునఁ గన్నము పా
అవలయును గదా! నీళ్ళు పోసిన మెత్తపడి కత్తిపోటులకుఁ
జప్పుడు గానిదియు, నింటిలోనివన్నియుఁ గనఁబడ వెరవు గలి
గించుకన్నము పెట్ట నను వయినదియుఁ, జవు డూరి సన్నగిల్లిన
యిటికెలు గలదియు, నాఁడువాండ్రు గనిపింపరానిదియు నగు
చోటు దొరకినఁ గన్నగానికర్జము గట్టెక్కును. చుట్టును ది
రిగి వచ్చితిని. ఇచ్చోటే తగియున్నది. ఇందే సంధిచ్ఛేదము
చేసెదను. కాని, యిపు డెట్టికన్నము త్రవ్వుదును? మంచి
కన్న గాఁడుగూడఁ జూచి యబ్బురపడునట్టిసంధి యేది? సింహా
క్రాంతము గజాస్యము మీనాస్యము వ్యాఘ్రాస్యము త్రికో
ణము పూర్ణచంద్రము అర్ధచంద్రము పీఠికయు నని సంధి బహు
విధముగా నున్నది. ఇందు సింహాక్రాంతసంధినే త్రవ్వెదను'
అని యాలోచించి కొనుచుండెను.

అంత నింటిలో మైత్రేయుఁడు 'వయస్యా! మేల్కొని
యుంటివి గదా! నా కేమో కాని, కూరుకు రా కున్నది.
పైగా నా యెడమకన్ను దరుచున్నది. దొంగవాఁడు గన్నము
త్రవ్వుచున్నచప్పు డయినది. ఇదే నిజమయినచో నేను జాతి
చే దరిద్రుఁడనే యగుదును' అనఁగాఁ జారు దత్తుఁడు 'ఛీ
మూర్ఖా! నీ వెపుడును దారిద్ర్యమునే కోరుదువు. నోరు మూ
సికొని పండుకొమ్ము' అనెను.

ఇది యిట్లుండ సజ్జలకుఁడు 'కన్నము కొలిచికొనుట కే
మున్న దనుసంశయ మక్కఱ లేదు. బ్రాహ్మణుఁడ నయి

నందుకు యజ్ఞోపవీతము కాపాడినది. ఇది పగలు బ్రహ్మసూత్రము, రేయి కర్మసూత్రము. నే నిపుడు త్రవ్వినకన్నము నుదయమున నే యిరుగుపొరుగిండ్లవారు చూచి నన్నుఁ దిట్టినను నా నేర్పు దెలిసికొని ముక్కుమీఁద వ్రేలు వేసికొనవలసినదే—ఖరపటా! రాత్రిదేవతలారా! వందనము' అనుచు గన్నము వేసి యింటిలోఁ బ్రవేశించి దీపముచూచి యించుక జంకి తస్కరగురుఁడ నయిననాకును భయమా? యని ధైర్యమూని యిట్టటు చూచి క్రొత్తవాఁడ నగుటచేఁ గలిమి సంగతి తెలిసికొనఁ జాలక పెద్దయిల్లు గదా యని యిందుఁ బ్రవేశించితిని. మంచిదుప్పటియైన నొక్కటి గానరా కున్నదే? ఈ యింటివాఁడు గర్భదరిద్రుఁడా యేమి?- ఈ భవనము నేర్పాటుమాత్రము ప్రశస్తముగా నున్నది. దీనిఁ జూడఁగా నితఁడు గొప్పవిభవ మనుభవించి యీస్థితికి వచ్చినట్లు తోఁచుచున్నది. ఐశ్వర్య మంతయు నడుగంటినను జన్మభూమియందలి యభిమానముచే నిల్లుమాత్ర మమ్మికొనక యెట్లో దీనిని గాపాడికొనుచున్నాఁడు. అయ్యో పాపము! ఇతఁడు నావంటి వాఁడే. వీనిని బీడింతునా? కానీ వచ్చితిని గదా! నాలుగు మూలలు చూచి పోయెదను.' అనుచు వెదకుచుండెను.

అట్టియెడ విదూషకుఁడు 'వయస్యా! ఈసువర్ణభాండము నీవే తీసికో. నేను దాఁచలేను' అనఁగా దొంగ యామాట విని 'సువర్ణభాండమా? నన్నుఁ జూచి యిట్లనుచున్నాఁడా? లేక పలవరించుచున్నాఁడా? కానీ! అనుచు

పోయెను. దానివిలువ యెంత యుండునో తెలియదు గాని దానికి బదులుగా నీ ముక్తావళిని నీకుఁ బంపినాఁడు తీసుకో' అని చెప్ప, నవ్వారాంగన యించుక నవ్వి 'ఆహా! వేశ్యావృత్తి కడు నింద్యము గదా! నేను లుబ్ధురాల నని యాతఁడు భావించి యుండును. దీని నిపుడు ప్రతిగ్రహింపనా? ఆదోషమే నాపై బలవత్తర మగును' అని తలఁచికొని యూహారము గైకొనెను. అంత విదూషకుఁడు తనలో 'నగ దీసికొని యూరకున్న దే. ఏమియు మాటాడ కున్న దేమి'? యని తలఁచి వెంటనే వెడలి పోయెను. వసంతసేనయుఁ దనలో 'మేలు మేలు. చారుదత్తా ఇట్టిదశలోఁ గూడ మానము రక్షించికొంటివి. నీదే జన్మము' అని యానందించుచుండెను.

అంత మదనిక వచ్చి వసంతసేనతోఁ జారుదత్తుని మనుష్యుఁడు వచ్చె నని చెప్పి దాని యానతిని వానిని దీసికొని వచ్చుటకు వెడలె. వసంతసేనయుఁ నేఁడు శుభదినము. చారుదత్తమిత్రుని ప్రసంగమే వినఁబడుచున్నది యని తలఁచుచుండె. అత్తరుణమున సజ్జలకుఁడు తనలో 'అకటా! తనతప్పు తనకే శంక గలిగించును గదా! ఎవఁడు నావైపు చూచినను ఎవఁడు తొందరగా వచ్చుచున్నను నాకొఱకే యని యనుమానపడుచుందును' అని భీతి నందుచు మదనికతో వచ్చి, వసంతసేన పీఠము చూపినను గూరుచుండక తొందరగాఁ బోవలయును. పని యున్న దనుచు బెదరుచూపుతో నిలిచి యుండి 'తనవారెవ్వరు నింట లేకుండుటచేతను గృహము గట్టిది గాక పోవుట

చేతను దాఁచలేక యీయాభరణము నీకిమ్మని చారుదత్తుఁడు నన్నుఁ బంప' నని చెప్పిన, నవ్వారసుందరి 'ఆర్యా! మరల గొనిపోయి యాతనికే యి' మ్మనెను. నే నచ్చటికిఁ బోఁజాల' నని యాతఁ డనఁగా, నే నెఱుఁగుదును. నీవు దొంగిలించి తెచ్చితివి. అతని సుగుణసంపదకు జాలిపడు' మనుచుండు నంతలో వీథిలో బండిచప్పు డయ్యెను. అంత వసంతసేన తననగలు మదనిక కలంకరించి 'ఆర్యా! ఈయార్యురాలిని గూడి బండియెక్కి పొ' మ్మన, మదనిక నిశ్చేష్టురాలై యేమిది? యని యడిగె. అందు కావనిత 'యేమియు లేదు. సంశయింపకు. నీ విపుడు పూజ్యురాల వయితివి. ఈయార్యుని గూడి పొ' మ్మనె. సజ్జలకుఁడును దనలో 'నే నీమెఋణ మెపుడు దీర్చికొనఁగలను? ఛీ! నేను జేయున దేమి? ఎవరివలన నా కిట్టి మేలొనగూడెనో యాచారుదత్తునకు నీ వసంతసేనకు శుభము గలుగుఁగాక. వీరి శత్రువులకు వీరికి రాఁదగిన యాపదలు సంభవించుఁగాక' యని యామెకు జయము గోరుచు మదనికతో వెడలిపోయెను. అంత వసంతసేన చతురికయను జేటిని బిలిచి 'నాకు జాగ్రదవస్థలోనే శుభస్వప్నము వచ్చినది. ఇదియే శుభముహూర్తము. ఈయలంకారము చేతఁ గొని యార్యచారుదత్తునియింటి కభిసరించెదము రమ్మ' అనుచు దాసితో నిష్క్రమించి నిజమనోరథని[illegible] మగు చారుదత్తనిలయమును జేరెను.

---